Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 | సంచిక : 206 | మేడ్చల్ మల్కాజ్‌గిరి | 16 ఆగష్టు 2023 | బుధవారం | పేజీలు : 4

### తెలుగు వ్యక్తికి అమెరికా సైన్యంలో అత్యున్నత హోదా

వాషింగ్టన్ : భారత సంతతి వ్యోమగామి రాజాచారికి అమెరికా వైమానిక దళ(యూఎస్ఏఎఫ్) బ్రిగేడియర్ జనరల్ హోదా లభిం చనుంది. ఈ మేరకు దేశాధ్యక్షుడు జో బైడెన్ ఆయన్ను నామినేట్ చేశారు. ఈ నామినేషన్‌ను సెనేట్ ఆమోదించాల్సి ఉందని అమెరికా రక్షణ శాఖ ఒక ప్రకటనలో వెల్లడించింది. చారి ఇప్పటికే వైమానిక దళ కల్నల్ స్థాయిలో ఉన్నారు. ప్రస్తుతం ఆయన అమె రికా అంతరిక్ష సంస్థ నాసాలో క్రూ–3 కమాండర్‌గా వ్యవహరిస్తు న్నారు. భారత్‌లోని హైదరాబాద్ కు చెందిన చారి, ఉన్నత విద్య పూర్తి చేసిన అనంతరం అమెరికాలోనే స్థిరపడ్డారు. నాసాకు, యూఎస్ఏఎఫ్‌లో పలు విభాగాల్లో ఆయన కీలకంగా వ్యవహరిస్తున్నారు.

# మధ్య తరగతి, మహిళల నేతృత్వంలో అభివృద్ధి




## 77వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ప్రధాని మోదీ

న్యూఢిల్లీ : పేదరికం తగ్గితే, మధ్య తరగతి ప్రజల బలం పెరుగుతుందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చెప్పారు.

రానున్న ఐదేళ్లలో భారత దేశం ప్రపంచ దేశాల్లో అగ్రశ్రేణి ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా నిలుస్తుందని, ఇది మోదీ ఇచ్చే గ్యారంటీ అని తెలిపారు. 13.5 కోట్ల మంది భారతీయులు పేదరికం నుంచి బయటకు వచ్చారని, వారంతా మధ్య తరగతికి బలంగా మారారని చెప్పారు. 77వ స్వాతంత్ర్య దినోత్సవాల సందర్భంగా మంగళవారం ఆయన ఎర్ర కోట నుంచి ప్రసంగించారు.

**ఆ మూడింటి అంతానికి శపథం** : దేశాన్ని నాశనం చేసిన మూడు చెడుగులను అంతం చేస్తానని మోదీ శపథం చేశారు. అవినీతి, వారసత్వ రాజకీయాలు, బుజ్జగింపులను అంతం చేస్తానని చెప్పారు. అవినీతిపైన పోరాడుతూనే ఉండటానికి తాను నిబద్ధతతో జీవితాంతం కట్టుబడి ఉన్నానని చెప్పారు. వారసత్వ రాజకీయాలు ఈ దేశాన్ని సర్వనాశనం చేశాయన్నారు. ప్రజల హక్కులను వారసత్వ రాజకీయాలు తొలగించాయన్నారు. బుజ్జగింపులు జాతీయ స్వభావంపై ఓ కళంకంగా మారిపోయాయని తెలిపారు. ఈ మూడు చెడుగులపైనా మనం సంపూర్ణ బలంతో పోరాడాలని పిలుపునిచ్చారు. నేడు మనకు ప్రజల సంఖ్యాబలం ఉందని, అదేవిధంగా ప్రజాస్వామ్యం, వైవిధ్యం ఉన్నాయని, దేశం యొక్క కలలను సాకారం చేసే శక్తి, సామర్థ్యాలు ఈ మూడింటికి ఉన్నాయని చెప్పారు.

**మహిళలు లక్షాధికారులుగా..** మహిళా స్వయం సహాయక బృందాల కృషిని మోదీ ప్రశంసించారు. రెండు కోట్ల మంది మహిళలను లక్షాధికారులుగా చేయాలనేది తన కల అని చెప్పారు. నేడు మహిళా స్వయం సహాయక బృందాల్లో 10 కోట్ల మంది మహిళలు ఉన్నారని తెలిపారు. మహిళల నేతృత్వంలో అభివృద్ధి జరిగితే దేశం మరింత అభివృద్ధి సాధిస్తుందని తెలిపారు. పౌర విమానయాన రంగంలో మహిళా పైలట్లు ఉన్నారని, మహిళలు శాస్త్రవేత్తలు అవుతున్నారని చెప్పడం గర్వంగా ఉందని చెప్పారు. చంద్రయాన్ కార్యక్రమానికి మహిళా శాస్త్రవేత్తలు నాయకత్వం వహిస్తున్నారని చెప్పారు. మహిళల నేతృత్వంలో అభివృద్ధికి ఉన్న ప్రాధాన్యాన్ని జీ20 దేశాలు గుర్తించాయన్నారు.


**యువతకు మెరుగైన భవిత** : దేశంలో యువతకు మెరుగైన భవితను కల్పిస్తామని హామీ ఇచ్చారు. దేశంలో అవకాశాలకు కొరత లేదన్నారు. అంతులేని అవకాశాలను అందించే సమర్థత భారత దేశానికి ఉందన్నారు. యువత శక్తి, సామర్థ్యాలపై తనకు నమ్మకం ఉందన్నారు. యువతకు సమర్థత ఉందని, మన విధానాలు, కార్యక్రమాలు వారిని బలోపేతం చేసేవేనని తెలిపారు. మన యువత ప్రపంచంలో మొదటి మూడు స్టార్టప్ ఇకోసిస్టమ్స్‌లో ఒకదానిగా భారత దేశాన్ని తీసుకెళ్లారని తెలిపారు. మన దేశ సైనిక దళాలు నూతన జవసత్వాలతో, యుద్ధ సన్నద్ధతతో ఉండేలా నిరంతరం సంస్కరణలు జరుగుతున్నాయని చెప్పారు. సురక్షితంగా ఉన్నామనే భావన నేడు దేశానికి ఉందన్నారు. శాంతి, భద్రత ఉన్నపుడు మనం అభివృద్ధిపై దృష్టి పెట్టగలుగుతామన్నారు. ప్రతి క్షణం ప్రజా సంక్షేమం కోసమే.. ప్రభుత్వానికి ఉన్న ప్రతి క్షణం, ప్రతి రూపాయి దేశ ప్రజల సంక్షేమం కోసమే ఖర్చువుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వం, ప్రజలు ఐకమత్యంగా ఉన్నందువల్ల మనం బలమైన ఆర్థిక వ్యవస్థను నిర్మించుకున్నామని, లీకేజీలను అరికట్టగలిగామని చెప్పారు. సంక్షేమ పథకాలను పొందుతున్న 10 కోట్ల మంది బూటకపు లబ్ధిదారులను తొలగించినట్లు తెలిపారు. అక్రమాస్తుల జప్తు 20 రెట్లు పెరిగిందన్నారు. అంతరిక్ష సాంకేతిక పరిజ్ఞాన రంగంలో భారత దేశ సామర్థ్యం వేగంగా పెరుగుతోందన్నారు. డీప్ సీ మిషన్, రైల్వేల ఆధునికీకరణ, వందే భారత్ రైలు, బుల్లెట్ రైలు... ఇలాంటివాటి కోసం మనం నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. గ్రామాలకు ఇంటర్నెట్ సేవలు అందుబాటులోకి వచ్చాయన్నారు. నానో యూరియా కోసం కృషి చేస్తున్నామని, ఆర్గానిక్ వ్యవసాయంపై కూడా దృష్టి పెట్టామని చెప్పారు. తన ప్రభుత్వం శంకుస్థాపన చేసిన ప్రాజెక్టులకు తన ప్రభుత్వ హయాంలోనే ప్రారంభోత్సవాలు జరుపుతున్నట్లు తెలిపారు.

## మద్దతు ఒకరికి ఇచ్చి మరొకరిని ప్రశ్నిస్తే ఎలా?




హైదరాబాద్ : ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగకు టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి పరోక్షంగా చురకలు అంటించారు. వర్గీకరణ విషయంలో కాంగ్రెస్ కమిట్మెంట్‌ను ఎవరూ శంకించాల్సిన అవసరం లేదన్నారు. మాట ఇచ్చిన వాళ్ళని ప్రశ్నించి మీ చిత్తశుద్ధి నిరూపించుకోండని మందకృష్ణకి పరోక్షంగా చురకలు అంటించారు. బీజేపీ రాష్ట్ర చీఫ్ కిషన్ రెడ్డి దేవుడు ఇచ్చిన అన్న కదా.. అయన్ని ఎందుకు అడగడం లేదని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. వర్గీకరణ విషయంలో తమ చిత్తశుద్ధిని ప్రశ్నించాల్సిన పని లేదన్నారు. మద్దతు ఒకరికి ఇచ్చి మరొకరిని ప్రశ్నిస్తే ఎలా? కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ కూడా వర్గీకరణ పై స్పష్టంగా మా విధానాన్ని చెప్పారని రేవంత్ అన్నారు. వర్గీకరణకి కాంగ్రెస్ కట్టుబడి ఉందన్నారు. ఎస్సీ వర్గీకరణ వ్యక్తుల కోసం చేయబోమని.. ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ పై కాంగ్రెస్‌కు స్పష్టమైన విధానం ఉందన్నారు. ధామాషా పద్ధతి ప్రకారం వర్గీకరణ ఎలా చేయాలో తమకు తెలుసన్నారు. మా చిత్తశుద్ధి పై ఎవరికి స్పష్టత ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. ఎవరి వకాల్తాలు తమకు అవసరం లేదని రేవంత్ అన్నారు. ఎవరి బెదిరింపులకూ భయపడేది లేదన్నారు. బెదిరించే వారు ఎవరికి మద్దతు ఇచ్చారో వారినే అడిగితే మంచిదన్నారు. ఎస్సీ సామాజిక వర్గానికి కాంగ్రెస్ ఏంటో తెలుసన్నారు. కిషన్ రెడ్డి ఎందుకు పార్లమెంట్‌లో మాట్లాడం లేదని ప్రశ్నించారు. వాళ్ళ ప్రభుత్వంపై ఎందుకు ఒత్తిడి తేవడం లేదన్నారు. మాట ఇచ్చి అమలు చేయని వారిని నిలదీసి మీ చిత్తశుద్ధి నిరూపిస్తే కొంతైనా మీకు గౌరవం ఉంటుందని రేవంత్ హితవు పలికారు.

## 2024లో ఇంటి దగ్గరే మోదీ జెండా ఎగరవేస్తారులే..: ఖర్గే



స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ ఎర్రకోటపై చేసిన ప్రసంగంపై కాంగ్రెస్ తీవ్ర విమర్శలు చేస్తోంది. ముఖ్యంగా వచ్చే ఏడాది మళ్లీ ఆగస్టు 15న వస్తానని ప్రధాని మోదీ వ్యాఖ్యానించడాన్ని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఎద్దేవా చేశారు. "ఆయన వచ్చే ఏడాది జెండా ఎగరవేస్తారు.. కానీ, అది ఆయన ఇంటిపైనే. గెలిచిన వాళ్లు ఎప్పుడూ మేమే మళ్లీ మళ్లీ వస్తామని చెబుతుంటారు. కానీ, జయాపజయాలు నిర్ణయించాల్సింది ప్రజలు. ఇది ఓటర్ల చేతిలో ఉంది. 2024లో జాతీయ పతాకాన్ని మళ్లీ ఎగరవేస్తానంటూ 2023లోనే చెప్పడం గర్వాన్ని సూచిస్తోంది. ఆయన స్వాతంత్ర్య దినోత్సవం రోజున కూడా ప్రతిపక్షాలపై కామెంట్లు చేస్తుంటే.. దేశాన్ని నిర్మించేదెప్పుడు..?వచ్చే ఆగస్టు 15వ తేదీన మీముందు దేశం సాధించిన విజయాలనుంచుతాను" అని వ్యాఖ్యానించారు.

**ప్రధాని ప్రసంగం వేళ ఖాళీ కుర్చీ..** ఎర్రకోట వద్ద స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమానికి గైర్హాజరు కావడానికి కారణాన్ని ఖర్గే వివరించారు. తనకు నేత్ర సంబంధిత సమస్యలున్నాయన్నారు. తొలుత ప్రొటోకాల్ ప్రకారం ఉదయం 9.20 తన ఇంటి వద్ద జాతీయ పతాకాన్ని ఎగరవేశానని వెల్లడించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి వచ్చి జెండాను ఎగరవేశానని చెప్పారు. అందుకే సమయానికి ఇక్కడికి రాలేకపోయానని వివరించారు. దీనికి తోడు భద్రతా దళాలు ప్రధానిని తప్ప ఎవరినీ ముందుకు వెళ్లనీయడంలేదని అసహనం వ్యక్తం చేశారు. దీంతో సమయానికి ఎర్రకోట వద్దకు రాలేనని అనుకొన్నాను. భద్రతా కారణాలు, సమయాభావం కారణంగా అక్కడికి వెళ్లకపోవడమే మంచిదని భావించినట్లు ఖర్గే వెల్లడించారు. దిల్లీలో ఎర్రకోటపై ప్రధాని నరేంద్రమోదీ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ వేడుకలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఖర్గే పాల్గొనలేదు. దాంతో అతిథుల కోసం ఏర్పాటు చేసిన కుర్చీల్లో ఆయన పేరుతో ఉన్న కుర్చీ ఖాళీగా కనిపించింది. ఆరోగ్యం సహకరించకపోవడంతో ఖర్గే ఈ కార్యక్రమానికి రాలేదని కాంగ్రెస్ వెల్లడించింది.

ప్రధాని 2024 ప్రకటనపై కాంగ్రెస్ పార్టీకి చెందిన మరో ఎంపీ కేసీ వేణుగోపాల్ మాట్లాడుతూ "2024 ఎన్నికల్లో ఎవరు తిరిగి వస్తారో.. ఎవరు రారో ప్రజలే నిర్ణయిస్తారు. కనీసం 2024 వరకు ఎదురు చూడండి" అని వ్యాఖ్యానించారు.

# భాగ్యనగరంలో లక్ష డబుల్ బెడ్రూం ఇండ్లు పంపిణీ

## గోల్కొండ కోట వేదికగా ప్రకటించిన సీఎం కేసీఆర్




హైదరాబాద్ : రాష్ట్రంలోని గూడు లేని నిరుపేదలు ఆత్మగౌరవంతో బతకాలనే ఉద్దేశంతో కేసీఆర్ సర్కార్ డబుల్ బెడ్రూం ఇండ్లను కట్టించి ఇస్తున్న సంగతి తెలిసిందే. ఒక్క రూపాయికి కూడా పేదలకు ఖర్చు లేకుండా పేదలకు ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇండ్లను నిర్మించి ఇస్తోంది. 77వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా హైదరాబాద్‌లోని నిరుపేదలకు సీఎం కేసీఆర్ తీపి కబురు అందించారు. నేటి నుంచే హైదరాబాద్‌లో లక్ష డబుల్ బెడ్రూం ఇండ్లను అందజేస్తున్నదని కేసీఆర్ గోల్కొండ కోట వేదికగా ప్రకటించారు. గోల్కొండ కోటపై జాతీయ జెండాను ఎగురవేసిన అనంతరం ప్రజలను ఉద్దేశించి కేసీఆర్ ప్రసంగించారు. గతంలో పేదలకు ప్రభుత్వం ఇచ్చిన నివాసం చాలీచాలని ఒకే ఒక్క ఇరుకుగది అని కేసీఆర్ పేర్కొన్నారు. అందుకు భిన్నంగా బీఆర్ఎస్ ప్రభుత్వం పేదల ఆత్మ గౌరవాన్ని నిలబెట్టే విధంగా రెండు పడక గదులతో ఇండ్లు నిర్మించి ఉచితంగా అందిస్తున్నది. దీన్ని ఒక నిర్విరామ ప్రక్రియగా ప్రభుత్వం కొనసాగిస్తున్నదని తెలిపారు. హైదరాబాద్ మహానగరంలో నిర్మాణం పూర్తిచేసుకొని ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న 1 లక్ష డబుల్ బెడ్రూం ఇళ్లను ప్రభుత్వం నేటినుంచే అర్హులైన పేదలకు అందజేస్తున్నది.

సొంతంగా స్థలం ఉండి ఇల్లు నిర్మించుకోలేని నిరుపేదల కోసం ప్రభుత్వం గృహలక్ష్మి అనే పథకాన్ని అమలు చేస్తున్నది. ఈ పథకం కింద లబ్ధిదారులకు గృహ నిర్మాణానికి మూడు దశల్లో మూడు లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందజేస్తున్నది.

ముందుగా, ప్రతీ నియోజకవర్గంలో 3 వేలమందికి ఈ ప్రయోజనం చేకూరుస్తున్నది. ప్రభుత్వం మానవీయ కోణంలో ఆలోచించి గృహలక్ష్మి పథకంలో దివ్యాంగులకు ఐదు శాతం రిజర్వేషన్ కల్పించింది అని కేసీఆర్ తెలిపారు.

**అసాధారణ స్థాయిలో భారీ వర్షాలు.. దెబ్బతిన్న ఇండ్లకు గృహలక్ష్మి కింద సాయం :** రాష్ట్రంలో గత నెలలో అనూహ్యంగా, అసాధారణ స్థాయిలో భారీ వర్షాలు కురిశాయని సీఎం కేసీఆర్ తెలిపారు. ప్రభుత్వం ఎప్పటికప్పుడు అతివృష్టి పరిస్థితులను అంచనా వేస్తూ, ముందు జాగ్రత్త చర్యలు చేపట్టింది అని కేసీఆర్ పేర్కొన్నారు. భారీ వర్షాల నేపథ్యంలో వరదల్లో చిక్కుకున్న ప్రజలను రక్షించడానికి, ఆయా ప్రదేశాలకు సుశిక్షితులైన సిబ్బందినీ, పడవలనూ, ఎన్డీఆర్ఎఫ్ బృందాలను, భారత వైమానిక దళానికి చెందిన హెలికాప్టర్లను వినియోగించింది అని కేసీఆర్ తెలిపారు. బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించింది. సహాయ శిబిరాలు ఏర్పాటుచేసి ఆదుకున్నది. తక్షణ సహాయ చర్యల కోసం ప్రభుత్వం రూ. 500 కోట్లు విడుదల చేసింది. ఊహించనిరీతిలో కుంభవృష్టి కురిసి, వరదలు సంభవించినా, ప్రభుత్వం సత్వరమే చర్యలు తీసుకొని ప్రాణ నష్టాన్ని, ఆస్తినష్టాన్నిచాలావరకు నివారించగలిగిందని సీఎం స్పష్టం చేశారు. అతివృష్టి కారణంగా మరణించిన వారి కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించి ఆదుకుంటుందని కేసీఆర్ హామీ ఇచ్చారు. దెబ్బతిన్న ఇళ్ళకు గృహలక్ష్మి పథకం కింద ప్రభుత్వం సాయం అందిస్తుంది. వరదలలో కోతకు గురైన పొలాల సంఖ్యను అంచనా వేయడం జరుగుతున్నది. జూన్, జూలై మాసాల్లో వర్షపాతంలో కలిగిన లోటును ఈ భారీ వర్షాలు భర్తీ చేశాయి. రాష్ట్రంలోని అన్ని జలాశయాలూ నిండుకుండలుగా మారాయి. ఈసారి వరిసాగు రికార్డు స్థాయిలో 64 లక్షల 54 వేల ఎకరాలకు పెరుగుతుందని అంచనా వేస్తున్నాం. పంటలు దెబ్బతిన్న రైతులు మళ్లీ విత్తనాలు వేసుకొనేందుకు వీలుగా విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచుతున్నాం. ఈ సందర్భంగా బాధితులకు ప్రభుత్వం అన్నివేళలా బాసటగా నిలుస్తుందని తెలియజేస్తున్నాను అని కేసీఆర్ పేర్కొన్నారు.

# సంపాదకీయం

## కాంగ్రెస్ ఆధ్వర్యంలో ప్రజాకోర్టులా ?

బీఆర్ఎస్ ను ఓడించేందుకు తెలంగాణా కాంగ్రెస్ సరికొత్త నినాదాన్ని కాయిన్ చేయబోతోంది. ఇంతకీ అదేమిటంటే 'తిరగబడదాం-తరిమికొడదాం' అని. కేసీయార్ పాలన మీద తిరగబడతాం..కేసీఆర్ ప్రభుత్వాన్ని తరిమికొడదాం అనే నినాదంతో కాంగ్రెస్ నేతలు రాజకీయం చేయబోతున్నారు. కర్ణాటక ఎన్నికల్లో సాధించిన ఘనమైన విజయంతో తెలంగాణా కాంగ్రెస్ రెచ్చిపోతున్న విషయం అందరు చూస్తున్నదే. ఎన్నికల్లో మంచి నినాదాలు జనాలను చాలా తొందరగా ఆకట్టుకుంటాయన్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగానే కేసీయార్ ప్రభుత్వాన్ని, పాలనను ఉద్దేశించి లిలితిరగబడదాం..తరిమికొడదాంలిలి అనే స్లోగన్ మొదలుపెట్టింది. అలాగే ప్రతి నియోజకవర్గంలో కేసీఆర్ పాలనపై ప్రజా కోర్టులను నిర్వహించాలని కూడా డిసైడ్ చేసింది. నిజానికి ప్రజాకోర్టులన్నది మావోయిస్టుల వ్యవహారం అని అందరికీ తెలిసిందే. ప్రజాప్రతినిధుల వ్యవహారశైలి మీద జనాల్లో బాగా వ్యతిరేకత వచ్చేసినపుడు మావోయిస్టులు సీన్లోకి ఎంటరవుతారు. అప్పుడు సదరు ప్రజాప్రతినిధిని దొరికించుకుని లేదా ఆ ప్రజా ప్రతినిధికి ప్రతినిధిగా ఎవరినో పట్టుకుని జనాల మధ్య నిలబెట్టి పంచాయితి చేస్తారు. సదరు ప్రజాప్రతినిధి చేసిన తప్పులను ప్రజాకోర్టులో విచారిస్తారు. అప్పుడు ప్రజాకోర్టులో ప్రజా ప్రతినిధిగా శిక్షకూడా విధిస్తారు. కొన్నిసార్లు చంపేస్తారు కూడా. ఇదంతా ఒకపుడు జరిగిన వ్యవహారం. ఇప్పుడు తెలంగాణాలో మావోయిస్తులు ఎక్కడా ప్రజాకోర్టులు నిర్వహించటంలేదు. అలాంటిది ఇపుడు కాంగ్రెస్ పార్టీ సడెన్ గా ప్రజాకోర్టుల నినాదంతో కార్యక్రమాల జోరును పెంచబోతోంది. అంటే మంత్రులు, బీఆర్ఎస్ ఎంఎల్ఏలు చేస్తున్న తప్పులు, పాల్పడుతున్న అవినీతిని జనాల్లో ఎండగట్టాలని కాంగ్రెస్ ప్లాన్ చేస్తోంది. మరి ఈ ప్రజాకోర్టుల కాన్సెప్ట ఎంతవరకు సక్సెస్ అవుతుందో తెలీదు. ఎందుకంటే ప్రజా కోర్టుల పేరుతో కాంగ్రెస్ నిర్వహించాలని అనుకుంటున్న కార్యక్రమాన్ని పోలీసులు అనుమతించే అవకాశాలు దాదాపు లేవనేచెప్పాలి. ఎందుకంటే ప్రజాకోర్టు అనగానే ముందుగా అందరికీ మావోయిస్టులే గుర్తుకొస్తారు కాబట్టి. అసలీ పేరుతో కార్యక్రమాన్ని నిర్వహిస్తే జనాలు వస్తారా అన్న అనుమానాలు కూడా పెరిగిపోతున్నాయి. కాబట్టి తాను నిర్వహించబోతున్న కార్యక్రమానికి కొత్తగా మరేదైనా పేరుపెట్టుకుంటే బాగుంటుందేమో ఆలోచిస్తే మంచిది. గాంధీభవన్లో జరగబోతున్న స్క్రీనింగ్ కమిటి సమావేశం ఏమి నిర్ణయం తీసుకుంటుందో చూడాలి.

# పచ్చని పొలాల్లో అక్రమ వెంచర్లు



మల్యాల : అక్రమ వెంచర్లతో ప్రభుత్వం పెద్ద మొత్తంలో ఆదాయం నష్టపోవాల్సి వస్తోంది. ప్రజా అవసరాలకు ఉపయోగించేందుకు వెంచరులో 10 శాతం స్థలం గ్రామ పంచాయతీకి అప్పగించాలి. దానిని కూడ స్థిరాస్తి వ్యాపారులు అమ్ముకుని జేబులు నింపుకొంటున్నారు. వెంచర్లు ఏర్పాటు చేస్తున్న సమయంలోనే ఇలాంటి వాటిని నియంత్రిస్తే పంచాయతీలకు ఆదాయం సమకూరడంతోపాటు ప్రజా ప్రయోజనాలకు స్థలం సైతం ఉండేది. ఇప్పటికైనా కఠినంగా వ్యవహరించి ప్లాట్ల కొనుగోలుదారులు నష్టపోకుండా అధికారులు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.ప్రభుత్వ అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన వెంచర్లపై చర్యలు చేపట్టాల్సిన అధికారులు అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారు. ఇష్టానుసారంగా ఏర్పాటు చేస్తున్నా పట్టించుకున్న నాథుడు లేడు. ఫలితంగా కొందరు రియల్‌ఎస్టేట్ వ్యాపారులు ఎటువంటి అనుమతులు తీసుకోకుండా ఏర్పాటు చేసి ప్లాట్లను విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. తద్వారా ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు.

తంగళ్లపల్లి మండల కేంద్రంతోపాటు చుట్టు పక్కల గ్రామాలైన సారంపల్లి, నేరెల్ల, మండెపల్లి, బద్దెనపల్లి, పద్మనగర్, తాడూరు, లక్ష్మిపూర్, అంకుసాపూర్, చీర్లవంచ తదితర గ్రామాల్లో పుట్టగొడుగుల్లా అక్రమ వెంచర్లు వెలిశాయి. ఎలాంటి ప్రభుత్వ అనుమతి లేకుండానే క్రయ, విక్రయాలు కొనసాగుతున్నాయి. మండలంలో ఒక్క వెంచర్‌కు మాత్రమే అనుమతి ఉంది. గతంలో అక్రమ వెంచర్లపై వివిధ పార్టీలకు చెందిన నాయకులు ఆందోళనలు చేపట్టడం, వెంచర్లల్లోని ప్లాట్ల రిజిస్ట్రేషన్లు నిలిపివేయాలని సబ్ రిజిస్ట్రార్‌కు సమాచారం ఇవ్వడంతో పాటు అనుమతి లేని వాటి సర్వే నంబర్లను బ్లాక్ లిస్టులో పెట్టడం జరుగుతుందని అధికారులు చెబుతున్నారు. అయితే ప్రారంభంలోనే ఇటువంటి వాటికి అడ్డుకట్ట వేయాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఇష్టానుసారంగా ఏర్పాటు చేస్తున్నారన్న విమర్శలున్నాయి.

భూ మార్పిడి కాకుండానే...

వ్యవసాయ భూములను వాణిజ్య అవసరాలకు మార్చే సమయంలో రెవెన్యూశాఖకు నాలా పన్ను చెల్లించాల్సి ఉంటుంది. స్థిరాస్తి వ్యాపారులు కట్టడం లేదు. ఫలితంగా తంగళ్లపల్లి మండల కేంద్రంతో పాటు పద్మనగర్, మండెపల్లి, సారంపల్లి, బద్దెనపల్లి, తాడూరు, అంకుసాపూర్ తదితర గ్రామాల్లో వందల ఎకరాల్లో భూ మార్పిడి జరగకుండానే వెంచర్లు ఏర్పాటు చేసి ప్లాట్లను విక్రయించే పరిస్థితి నెలకొంది. దీనిపై రెవెన్యూ, పంచాయతీ అధికారులు చర్యలకు ఉపక్రమించాల్సి ఉన్నా ఫిర్యాదులు వస్తేకాని చర్యలు చేపట్టడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ప్రభుత్వ ఆదాయానికి గండి

అక్రమ వెంచర్లతో ప్రభుత్వం పెద్ద మొత్తంలో ఆదాయం నష్టపోవాల్సి వస్తోంది. ప్రజా అవసరాలకు ఉపయోగించేందుకు వెంచరులో 10 శాతం స్థలం గ్రామ పంచాయతీకి అప్పగించాలి. దానిని కూడ స్థిరాస్తి వ్యాపారులు అమ్ముకుని జేబులు నింపుకొంటున్నారు. వెంచర్లు ఏర్పాటు చేస్తున్న సమయంలోనే ఇలాంటి వాటిని నియంత్రిస్తే పంచాయతీలకు ఆదాయం సమకూరడంతోపాటు ప్రజా ప్రయోజనాలకు స్థలం సైతం ఉండేది. ఇప్పటికైనా కఠినంగా వ్యవహరించి ప్లాట్ల కొనుగోలుదారులు నష్టపోకుండా అధికారులు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. అనుమతి లేకుండానే..మండలంలో నేరెల్లలోని ఓ వెంచర్‌కు పూర్తిస్థాయిలో అనుమతి రాకుండానే బోర్డులు పెట్టి ఇప్పటికే విక్రయాలు కొనసాగించారు. అలాగే తంగళ్లపల్లి మండల కేంద్రంతోపాటు, నేరెల్ల, బద్దెనపల్లి, మండెపల్లి, సారంపల్లి గ్రామాల్లో స్థిరాస్తి వ్యాపారులు శ్రీగంధం చెట్ల పేరిట ఎలాంటి అనుమతి లేకుండా అక్రమ వెంచర్లు ఏర్పాటు చేస్తున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. దీనిపై వివిధ పార్టీలకు చెందిన నాయకులు, ప్రజాప్రతినిధులు అధికారులను నిలదీసిన సందర్భాలున్నాయి. కొందరు రియల్‌ఎస్టేట్ వ్యాపారులు వెంచర్లకు ఏకంగా పేర్లు పెట్టి ప్లాట్లను విక్రయిస్తున్నారు. పంచాయతీరాజ్‌శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి వారికి నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకొంటున్నారు. ఇది ఒక్క తంగళ్లపల్లి మండలంలోనే కాదు. జిల్లా కేంద్రంలోని పట్టణం నలుమూలలా ఇలా వెలశాయి. తంగళ్లపల్లి మండలంలో మొత్తం 127 వెంచర్లు ఉండగా అందులో మండల కేంద్రంలో సగానికి పైగా ఉండటం గమనార్హం.

చట్టపరమైన చర్యలు తీసుకుంటాం- లచ్చాలు, ఎంపీడీవో, తంగళ్లపల్లి

ప్రభుత్వ అనుమతి లేకుండా వెలసిన వెంచర్లలో ప్లాట్లు కొనుగోలు చేసి మోసపోవద్దు. కొంత మంది అనుమతి ఉన్నట్లు తప్పుదారి పట్టిస్తారు. ఎవరూ నమ్మవద్దు. పాట్లు కొనుగోలు చేసే ముందు వెంచరుకు అనుమతి ఉందా? లేదా? అని తెలుసుకొని కొనుగోలు చేసుకోవాలి. అనుమతి లేకుండా వెంచర్లు ఏర్పాటు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

# రాజభాషకు ప్రాధాన్యం.. ఎన్టీపీసీ ఆదర్శం



మల్యాల : స్వాతంత్రోద్యమ సమయంలో హిందీ భాష దేశాన్ని ఒక్కటి చేసింది. ఈక్రమంలో హిందీ ప్రాధాన్యతను చాటడానికి 1975 జనవరి 10న నాగ్‌పూర్‌లో విశ్వహిందీ సమ్మేళనం నిర్వహించారు. ప్రతి ఏటా ప్రపంచ హిందీ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఎన్టీపీసీ ప్రాంతంలో హిందీ భాష అమలుకు ప్రాధాన్యం పెరిగింది. సెప్టెంబరు 14 నుంచి సెప్టెంబరు 29 వరకు హిందీభాషపై పక్షోత్సవాలు నిర్వహించి అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. ప్రపంచ హిందీ దినోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలకు ఏర్పాట్లు చేస్తున్నారు.

పట్టు సాధించేందుకు..హిందీభాషపై ప్రతి ఒక్కరు పట్టు సాధించటానికి హిందీలో టైప్‌రైటింగ్, క్విజ్, పాటలు, ప్రత్యుత్తరాలు, చదవడం, రాయటం, వ్యాసరచన పోటీలను ఏర్పాటు చేశారు. అధికారులు, ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు పాఠశాలల విద్యార్థులను పోటీలకు ఆహ్వానించి రాజభాష సాహిత్యాన్ని విస్తృతం చేస్తున్నారు.

దక్షిణాదిలో తొలిసారి...దక్షిణ భారతదేశంలో ఎన్టీపీసీ పరిశ్రమలో మొట్టమొదటిసారిగా 'రాజభాష గౌరవ్ సమ్మాన్' అవార్డును రామగుండం అదనపు జీఎం విజయలక్ష్మి అందుకున్నారు. అధికార భాష అమలులో తీసుకుంటున్న చర్యలను అభినందిస్తూ ఈ అవార్డును ప్రదానం చేశారు. రామగుండం అదనపు జీఎం మరాఠీ, తెలుగు, తమిళం, ఒడియా, హిందీ, ఆంగ్లం, బెంగాలీ భాషల్లో ప్రావీణ్యత పొందారు. 2022 మే మాసంలో 21 మంది ఎన్టీపీసీ ఉద్యోగులు సమాంతరంగా హిందీ ప్రబోధ్, ప్రాగ్యా, పారంగత్ పరీక్షలు రాయగా 19 మంది ఉత్తీర్ణులయ్యారు. డిసెంబరులో నిర్వహించిన పారంగత్‌లో 13 మంది పరీక్షలు రాసి 9 మంది ఉత్తీర్ణత సాధించారు. వచ్చే మే నెలలో నిర్వహించనున్న పరీక్షలకు 19 మంది సిద్ధమవుతున్నారు.

ప్రత్యేక తరగతులు...

ఎన్టీపీసీ సౌజన్యంతో ఇటీవల ఈ ప్రాంతంలో ప్రపంచ హిందీ సెక్రటేరియట్ ఆధ్వర్యంలో విశ్రాంత ప్రధాన కార్యదర్శి మిశ్రా ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఉద్యోగులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి హిందీ భాష ప్రాధాన్యతను వివరించారు.

సంచిక విడుదలకు ఏర్పాట్లు...ప్రపంచ హిందీ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎన్టీపీసీ ప్రాంతంలో యాజమాన్యం ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించనుంది. జ్యోతిస్వర్ అనే ప్రత్యేక సంచికను విడుదల చేయనున్నారు. ఇటీవల నిర్వహించిన పలు పోటీల్లో విజేతలకు బహుమతుల ప్రదాన కార్యక్రమం జరగనుంది.

ద్వితీయ భాషతో..- ఆశాలత, హిందీ పండిట్‌హిందీని ద్వితీయ భాషగా ఎంచుకోవడం వల్ల భవిష్యత్తులో ఉద్యోగ సాధనలో ప్రత్యేక ప్రాధాన్యం పొందవచ్చు. కళాశాలల్లో ప్రస్తుతం 10 శాతం మంది విద్యార్థులు రెండో పాఠ్యాంశంగా హిందీని ఎంపిక చేసుకుంటున్నారు. హిందీ భాషకు సంబంధించిన సర్టిఫికెట్ ఉంటే బ్యాంకింగ్, సామాజిక మాధ్యమాలు, వివిధ పరిశ్రమల్లో తేలికగా ఉద్యోగాలు సాధించే అవకాశాలు ఉన్నాయి. మారిషస్ తదితర దేశాల్లో హిందీ విశ్వవిద్యాలయాలు సైతం ఉన్నాయి. హిందీ భాషను మన దేశంలో 90 శాతం మంది అర్థం చేసుకుంటారు. 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీలతోపాటు పీహెచ్‌డీలో ప్రత్యేక పాఠ్యాంశంగా హిందీ తీసుకుంటే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

# కొలత యంత్రాల కొరత

ఇల్లెందు : ఇల్లెందు బీఎంసీయూ పరిధిలో ఇల్లెందు మండలం ముకుందాపురం, ధనియాలపాడు, టేకులపల్లి మండలం టేకులపల్లి, సులానగర్, బేతంపూడి, బోడు తదితర గ్రామాల్లో విజయ డెయిరీ పాలు సేకరిస్తుంది. కానీ స్థానికంగానే పాలల్లో కొవ్వు, నీళ్ల శాతం కొలవడం లేదు. సేకరించిన పాలను ఇల్లెందు బీఎంసీయూకు తరలించి అక్కడ పాలల్లో కొవ్వు శాతం లెక్కిస్తున్నారు. దీనికి కారణం పాలు సేకరించే గ్రామాల్లో ఎనలైజర్లు లేకపోవడమే.విజయ డెయిరీ పరిధిలో పాలల్లో కొవ్వు, నీటి శాతం కొలిచే మిషన్ల కొరత తీవ్రంగా నెలకొంది. పాల సేకరణ కేంద్రాల పెంపుదలకు అనుగుణంగా ఎనలైజర్ల సంఖ్య పెంచకపోవడంతో ఈ పరిస్థితి ఉత్పన్నమైంది. ఈ మిషన్ల ద్వారా పాలల్లో కొవ్వు, నీళ్ల శాతం కొలిచి వాటి ఆధారంగా పాడి రైతులకు ధర నిర్ణయిస్తుంటారు. కానీ మిషన్లు లేకపోవడంతో పాడిరైతుల సమక్షంలో పాలల్లో కొవ్వు శాతం కొలవడం లేదు. పలు గ్రామాలు తిరిగి పాలు సేకరించిన ఆటో సుమారు నాలుగైదు గంటల తర్వాత బీఎంసీయూకు వెళ్లి పాలల్లో కొవ్వు శాతం చూస్తుంటారు. ఒక్కోసారి పాడిరైతుల బాటిళ్లు అటు, ఇటు కూడా మారుతుంటాయి. తమ కళ్లెదుటే తమ పాలల్లో కొవ్వు శాతం చూడాలని లబ్ధిదారుల నుంచి డిమాండ్లు వినిపిస్తున్నాయి. అయితే ఒక్కో మిషన్ ధర సుమారు రూ. 1.35 లక్షలు కావడం గమనించాల్సిన అంశం.

# కేసుల పురోగతి.. ప్రవర్తనపై ఆరా!

భూపాలపల్లి : పోలీసు శాఖ స్నేహపూర్వక సేవలు అందిస్తోంది. ప్రతి ఠాణాలో ఫిర్యాదుదారులతో మర్యాద పూర్వకంగా ప్రవర్తించాలని ఆదేశించింది. అవినీతికి ఆస్కారం లేకుండా కేసులు పరిష్కరించాలని నిర్దేశించింది. సిబ్బంది పనితీరు మెరుగుపర్చేందుకు పలు సంస్కరణలు తీసుకొచ్చింది.. అయినా కొంతమంది వ్యవహరిస్తున్న తీరుతో శాఖకు చెడ్డ పేరు వస్తోందని భావిస్తోంది. ఈ నేపథ్యంలో వివిధ ఠాణాల్లో ఫిర్యాదు చేసిన బాధితులకు హైదరాబాద్ కమాండ్ కంట్రోల్ నుంచి నేరుగా ఫోన్ చేసి మాట్లాడుతున్నారు. మీ కేసు పురోగతి ఎలా ఉంది..? స్టేషన్లో సిబ్బంది మీతో మర్యాదగా ప్రవర్తించారా..? మీతో పోలీసులు ఏమన్నారు..? స్టేషన్ హౌస్ అధికారిగా ఎవరున్నారు.. మీ సమస్యపై ఏవిధంగా స్పందించారు.. లంచం అడిగారా..? విచారణ వేగవంతంగా సాగుతోందా అని వివరాలు తెలుసుకుంటున్నారు. ఎప్పుడెవరికి ఫోన్ చేస్తారో తెలియక.. అవినీతి, అక్రమాలకు పాల్పడేవారు, ఫిర్యాదుదారులతో దురుసుగా ప్రవర్తించే పోలీసులకు భయం పట్టుకుంది.

జిల్లా కేంద్రంలో ఇటీవల ఓ ఇంట్లో చోరీ జరిగింది. కమాండ్ కంట్రోల్ నుంచి ఫిర్యాదుదారుడికి ఫోన్ చేసి సొత్తు విషయంలో ఏమైనా పురోగతి ఉందా.. అని తెలుసుకున్నారు. రికవరీ జరిగినట్లు మీకు సమాచారం ఇచ్చారా..? అనే విషయాలు సేకరించారు. ఓ మండల కేంద్రానికి చెందిన వ్యక్తి ఒక గొడవ విషయంలో రెండు నెలల క్రితం స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ విషయమై ఫిర్యాదుదారుడికి కంట్రోల్ కేంద్రం నుంచి ఫోన్ వచ్చింది. ఆయన ఇచ్చిన ఫిర్యాదుపై వివరాలు అడిగారు. పోలీసులు ప్రవర్తిస్తున్న తీరుపై ఆరా తీశారు. బాధితుడు తనకు జరుగుతున్న అన్యాయాన్ని వెల్లడించినట్లు సమాచారం.

వివరాలు గోప్యంముఖ్యంగా కొంత మంది నేతల కనుసన్నల్లో పోలీసులు పని చేస్తున్నా రనే విమర్శలున్నాయి. మరికొందరు మామూళ్లకు అలవాటుపడి కేసులను తప్పుదోవ పట్టిస్తున్న తీరు వెలుగుచూస్తోంది. ఇటీవల జిల్లాలోని కొందరు పోలీసులు ఫిర్యాదుదారుల అవతలి పార్టీ నుంచి వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలున్నాయి. కమాండ్ కంట్రోల్ కేంద్రం నుంచి ఫోన్ రాగానే బాధితులు మొదటగా వివరాలు చెప్పాలా వద్దా.. అని వెనకాడారు. వివరాలు గోప్యంగా ఉంచుతామని భరోసా కల్పిస్తుండటంతో తమకు జరిగిన అన్యాయాన్ని తెలియజేస్తున్నారు.

ఫిర్యాదు ఆధారంగా పోలీసుస్టేషన్‌లో నమోదైన ఫిర్యాదు.. ఎఫ్ఐఆర్ లోని వివరాల ఆధారంగా కమాండ్ కంట్రోల్ నుంచి బాధితులతో మాట్లాడుతున్నారు. కేసు ఎప్పుడు నమోదైంది.. న్యాయం జరిగిందా.. లేదా..? అనే విషయాలు తెలుసుకొని ఉన్నతాధికారులకు సమాచారం ఇస్తున్నారు. ఫిర్యాదుదారులతో దురుసుగా ప్రవర్తించినట్లు తేలితే శాఖాపరమైన విచారణ చేపట్టి ఉన్నతాధికారులు చట్టపరమైన చర్యలు తీసుకోనున్నారు.

తప్పని గుబులు

ఖాకీల పనితీరుపై నిరంతరం వివరాలు సేకరిస్తుండటంతో పలువురిలో గుబులు మొదలైంది. ప్రధానంగా ఠాణాల్లో పనిచేసే ఎస్‌హెచ్‌వోతో పాటు రిసెప్షన్ కేంద్రాల్లో పనిచేసే సిబ్బంది పనితీరును ప్రధానంగా పరిగణలోకి తీసుకుంటున్నారు. ఫిర్యాదుదారులు ఎక్కువగా రిసెప్షన్ కేంద్రం సిబ్బందితో పాటు ఎస్‌హెచ్‌వోను ఎక్కువగా సంప్రదించే అవకాశం ఉంటుంది. వీరి పనితీరుపైనే ఫిర్యాదుదారులకు న్యాయం జరిగే అవకాశం ఉంటుంది. ఇందులో ఎవరు నిర్లక్ష్యంగా వ్యవహరించినా.. స్పందించకపోయినా బాధితులకు నష్టం జరిగే అవకాశం ఉంటుంది.

వర్టికల్ నిర్వహణపై..వర్టికల్ విధానంపైనా ఆరా తీస్తున్నారు. రాష్ట్రంలోని పోలీసు శాఖ కొత్త పద్ధతులు తీసుకొచ్చింది. వాటిని పాటించడం ద్వారా సేవలు మెరుగ్గా ఉంటాయని భావించింది. దాని కోసం 14 రకాల విధానాన్ని అమలుచేయాలని పోలీసు శాఖ నిర్ణయించింది. దీన్ని ప్రతి ఠాణాలో పాటించాలని ఆదేశాలు సైతం జారీ చేసింది. వాటి నిర్వహణ ఆధారంగానే స్టేషన్లకు మార్కులు కేటాయిస్తున్నారు. మార్కుల ద్వారా ర్యాంకులు సైతం నిర్ణయిస్తున్నారు. రిసెప్షన్‌లో పనిచేసే సిబ్బంది పనితీరు, స్టేషన్ రైటర్‌లు, క్రైమ్ రైటర్‌లు, బ్లూకోల్ట్స్, పెట్రోలింగ్, కోర్టు డ్యూటీ సిబ్బంది, టెక్నికల్ బృందం, క్రైం స్టాఫ్, ఎంసీ సిబ్బంది, సెక్షన్ బాధ్యులు, జనరల్ డ్యూటీ సిబ్బంది, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్, స్టేషన్ హౌజ్ ఆఫీసర్, అడ్మిన్ ఎస్సైల పనితీరు ఆధారంగా మార్కులుంటాయి. వీటి నిర్వహణ ఏవిధంగా ఉందన్న విషయాలపైనా కమాండ్ కంట్రోల్ నుంచి వివరాలు సేకరిస్తున్నారు. స్టేషన్‌కు వచ్చే వారితో సత్ప్రవర్తనతో మెలుగుతున్నారా.. లేదా అనే విషయాలపై ఆరా తీస్తున్నారు.

# ఉత్పత్తిలో మణుగూరు.. రవాణాలో గూడెం

మణుగూరు : సింగరేణిలో బొగ్గు ఉత్పత్తి వార్షిక లక్ష్య ఛేదనకు 80 రోజులే గడువు ఉంది. గడిచిన తొమ్మిది నెలల కాలంలో లక్ష్య సాధనలో భద్రాద్రి జిల్లాలోని కొత్తగూడెం, మణుగూరు ఏరియాలు ముందు ఉన్నాయి. ఈ రెండు ఏరియాలు ఉత్పత్తి, రవాణాలో లక్ష్యాన్ని అధిగమించి పోటీపడుతున్నాయి. గత ఏడాది ఎన్నడూ లేనంతంగా వర్షాలు కురిశాయి. దీంతో బొగ్గు ఉత్పత్తి వార్షిక లక్ష్య సాధన సాధ్యమవుతుందా? లేదా? అనే అనుమానాలు ఏర్పడ్డాయి. ఈ క్రమంలో గత మూడు నెలల్లోనే బొగ్గు ఉత్పత్తి అమాంతం పెరిగింది. ఆ దిశగానే బొగ్గుని రవాణా చేశారు.

గడువు కంటే ముందే..బొగ్గు ఉత్పత్తిలో మణుగూరు ఏరియా సింగరేణి వ్యాప్తంగా రెండో స్థానంలో నిలిచింది. 115 శాతం ఉత్పత్తితో ప్రథమ స్థానంలో ఆర్జీ-1 ఉండగా, 108 శాతంతో మణుగూరు ఏరియా ఆ తరువాత నిలిచింది. 2022-23 నాటికి మణుగూరు ఏరియా నుంచి 116 లక్షల టన్నుల ఉత్పత్తి లక్ష్యాన్ని నిర్ణయించగా, ఇప్పటికే 91,39,35 టన్నులు వెలికితీశారు. అయితే ఓసీ-2, ఓసీ-4 మణుగూరు ఓసీ గనులు వంద శాతం ఉత్పత్తి లక్ష్య సాధనలో కొనసాగుతున్నాయి. గడువు కంటే ముందే మరో రెండు నెలల్లో స్థానిక గనులు వార్షిక లక్ష్యాన్ని సాధించే అవకాశం లేకపోలేదు.కొత్తగూడెం ఏరియా నుంచి అధిక బొగ్గు రవాణా జరిగింది. ఉత్పత్తి సాధనలో కొంత వెనుకబడి ఉన్నా రవాణాలో ప్రథమ స్థానంలో ఉంది. ఉత్పత్తి ఎంత ముఖ్యమో, ఆ సరకును వినియోగదారులకు అందించటం కూడా అంతే ప్రాధాన్యం. ఉత్పత్తి అయిన బొగ్గు రోడ్డు, రైలు ద్వారా సిమెంటు, విద్యుదుత్పత్తి ప్లాంట్లకు, ఐటీసీ వంటి పరిశ్రమలకు తరలివెళ్లాయి. కొత్తగూడెం ఏరియా నుంచి ఇప్పటివరకు 92,59,026 టన్నుల బొగ్గు రవాణా జరిగింది. తరువాతి స్థానంలో మణుగూరు ఏరియా ఉంది. గూడెం నుంచి 586 వ్యాగన్ల ద్వారా రోజుకి 10 రేకుల ద్వారా రవాణా అవుతోంది."ఏరియా లక్ష్యాన్ని మణుగూరు మార్చి మొదటి వారంలోనే సాధిస్తుంది. బొగ్గు ఉత్పత్తి, రవాణాలో ముందు ఉంది. కొన్ని గనులు ముందుగానే లక్ష్యాన్ని సాధిస్తాయి."వెంకటేశ్వరరెడ్డి, జీఎం

# నిర్వహణ కొరవడి.. చీకట్లు కమ్ముకొని..

మహబూబాబాద్ : జిల్లా కేంద్రంలో విద్యుత్తు దీపాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది.. పలు కాలనీల్లో సక్రమంగా వెలగక రాత్రివేళ పట్టణవాసులకు పాట్లు తప్పడం లేదు. మహబూబాబాద్ పురపాలక సంఘం పరిధిలో వీధి దీపాల నిర్వహణను ఓ ప్రైవేటు ఏజెన్సీకి అప్పగించారు. ఇందుకు పురపాల సంఘం నెలకు రూ.5 లక్షలు చెల్లిస్తోంది. 2017లో ఒప్పందం చేసుకున్న సంస్థ నిర్వాహకులు అవసరమున్న ప్రాంతాల్లో దీపాల అమరికను చేపట్టారు. మూడు నెలల నుంచి వారు నిర్వహణను సక్రమంగా పట్టించుకోకపోవడంతో కాలనీలు అంధకారంగా మారుతున్నాయి. వెలగని వీధి దీపాల స్థానం లో కొత్తవి అమర్చడంలో జాప్యమవుతోంది. విలీన గ్రామాల్లో పరిస్థితి మరింత దయనీయంగా మారింది. మున్సిపాలిటీ అధికారులు, పాలకవర్గ సభ్యులు వీధి దీపాలు సరఫరా చేయాలంటూ నిర్వాహకుల ను కోరినా పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. దీంతో పురపాలక సంఘం నిధుల్లోంచి కొనుగోలు చేయాలంటూ అధికారులపై పాలకవర్గం డిమాండ్ చేస్తున్నట్లు తెలిసింది.

కొత్తవి ఏర్పాటు చేయాల్సిందే..

పురపాలక సంఘ పరిధిలోని వివిధ కాలనీల్లో కాలిపోయిన వీధి దీపాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాల్సిన బాధ్యత ఏజెన్సీ నిర్వాహకులది. మూడు నెలలుగా సరఫరా చేయకపోవడంతో 36 వార్డుల పరిధిలో 1500ల దీపాలు వెలగడం లేదు. ఒక్కో వార్డులో సుమారు 40 నుంచి 42 చొప్పున ఏర్పాటు చేయాల్సిన ఉంది. గతంలో ఏర్పాటు చేసినవి సుమారు ఆరు నెలల వరకు మన్నికతో ఉండేవి. ప్రస్తుతం అమర్చిన నాలుగు రోజులకే కాలిపోతున్నాయని మున్సిపల్ అధికారులు చెబుతున్నారు. వర్షం కురిస్తే కాలిపోతున్న వాటి సంఖ్య పెరుగుతుం దంటున్నారు.

డబ్బులు ఇవ్వాలంటూ డిమాండ్

నిబంధనల ప్రకారం ఒప్పందం కుదుర్చుకున్న ఏజెన్సీ ఏడుగురు సిబ్బందిని నియమించి పనులు చేపట్టాలి. నిర్వాహకులు ఇద్దరినే నియమించుకుని మిగిలిన వారి స్థానంలో మున్సిపల్ సిబ్బందితోనే పనులు చేయించారు. మున్సిపాలిటీ సిబ్బంది పనిచేసినప్పటికీ వారికిచ్చే వేతనాలు తమకే చెల్లించాలంటూ డిమాండ్ చేస్తున్నట్లు సమాచారం. అందుకు సంబంధించి రూ.28 లక్షలు ఇవ్వాలంటున్నారు. దానికి అధికారులు అంగీకరించడం లేదు. దీంతో నిర్వాహకులు వీధి దీపాల సరఫరా చేయడంలో జాప్యం చేస్తున్నారు.

రద్దీ ప్రాంతంలోనే..మహబూబాబాద్ పట్టణంలో నిత్యం రద్దీగా ఉండే నెహ్రూ కూడలి నుంచి రామమందిరం-మార్వాడీ బజార్ వైపు వెళ్లే వీధిలో విద్యుత్తు దీపం వెలగడం లేదు. వారం రోజులుగా వెలగడం లేదని ప్రజాప్రతినిధులు, సిబ్బందికి సమాచారం ఇచ్చినా పట్టించుకోవ దం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రధాన రహదారి సమీపంలోనే ఉన్న ఈ వీధిలో ఉన్న రెండు విద్యుత్తు దీపాలు వెలగకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం- ప్రసన్నారాణి, మున్సిపల్ కమిషనర్, మహబూబాబాద్

వీధి దీపాల సరఫరా నిలిచిపోయింది. కాలనీల్లో కాలిపోతున్నవాటి సంఖ్య పెరుగుతోంది. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు దృష్టికి తీసుకెళ్లాం. ఒకేసారి 100 నుంచి 150 చొప్పున ఇస్తున్నా సరిపోవడం లేదు. ప్రస్తుతం రెండు వేలు పంపిస్తే సమస్య పరిష్కారమవుతుంది. వెయ్యి దీపాలు పంపిస్తామని ఉన్నతాధికారులు చెప్పారు. అవి రాగానే ఏర్పాటు చేయిస్తాం.

# వేములవాడలో వీటీఏడీఏ కార్యాలయం


సిరిసిల్ల : దక్షిణ కాశీగా పేరొందిన వేములవాడలోని రాజన్న ఆలయ అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన వేములవాడ టెంపుల్ ఏరియా డెవలప్‌మెంట్ (వీటీఏడీఏ) కార్యాలయం హైదరాబాద్ నుంచి పట్టణానికి తరలివచ్చింది. ఫిబ్రవరి 2016లో ఏర్పాటైన ఈ సంస్థ ప్రారంభం నుంచి హైదరాబాద్‌లోనే కొనసాగింది. ప్రస్తుతం రాజన్న ఆలయ ఎదుట రాజరాజేశ్వరి అమ్మవారి అతిథి గృహం మొదటి అంతస్తులో ఏర్పాటు చేశారు కార్యాలయానికి సంబంధించిన సామగ్రిని మొత్తం తీసుకొచ్చారు. ఆలయం, పురపాలకశాఖ, ఇతర విభాగాల ఇంజినీరింగ్ అధికారులతో వీటీఏడీఏ సమన్వయం చేస్తూ పనులు చేపట్టాలి. మొన్నటి వరకు పరిపాలన దూరంగా ఉండటంతో స్థానిక అధికారుల కు, సంస్థకు మధ్య సమన్వయం కొరవడేది. ఫలితంగా ఏడేళ్లలో ఆలయ విస్తరణ, అభివృద్ధిలో అనుకున్న పురోగతి కనిపించలేదు. దీనికితోడు నిధుల వెచ్చింపు కూడా అంతంత మాత్రమే. ఏడేళ్లలో



సంస్థకు రూ.77 కోట్లు కేటాయించారు. వాటిలో రూ.35 కోట్లను గుడిచెరువు విస్తరణకు సేకరించిన స్థలంలో నిర్వాసితులుగా మారిన వారికి పరిహారంగా చెల్లించారు. ఉద్యోగుల జీతభత్యాలకు సుమారు రూ.8 కోట్ల వరకు వెచ్చించారు. కార్యాలయం అద్దె రూ.1.26 కోట్లు. ప్రస్తుతం ఆలయానికి చెందిన భవనం కావడంతో అద్దెభారం తప్పనుంది. ప్రభుత్వం నుంచి సంస్థకు కేటాయించే నిధులను బట్టి అభివృద్ధి పనులపై దృష్టి సారిస్తే రాబోయే రోజుల్లో వేములవాడ పట్టణ రూపురేఖలు మారే అవకాశం ఉంది.

రాజన్న ఆలయ ప్రాంత అభివృద్ధి కోసం ప్రత్యేకంగా వీటీఏడీఏను ఏర్పాటు చేశారు. 2017లోనే అభివృద్ధి నమూనాలు సిద్ధమయ్యాయి. వాటిని పీఠాధిపతి సూచనల మేరకు రెండోసారి సవరించారు. గతేడాది యాదాద్రి ఆలయ పునర్నిర్మాణం ప్రారంభం తర్వాత అందరి దృష్టి రాజన్న ఆలయం మీదే కేంద్రీకృతమైంది. వీటీఏడీఏ పరిపాలన మొత్తం ఇక్కడి నుంచే సాగనున్నది. వీటీఏడీఏకు ఛైర్మన్‌గా ముఖ్యమంత్రి కేసీఆర్, వైస్ ఛైర్మన్, సీఈవోగా స్థానిక కలెక్టర్ వ్యవహరిస్తారు. కార్యదర్శి ఇటీవల ఉద్యోగ విరమణ పొందడంతో సిరిసిల్ల పురపాలక కమిషనర్‌గా పని చేసిన సమ్మయ్యను బదిలీ చేస్తూ సెక్రటరీగా నియమించారు. ప్రస్తుతం ఇందులో చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ చంద్రిక, ఎస్టేట్ అధికారిగా సత్యనారాయణ పని చేస్తున్నారు. వివిధ విభాగాల్లో 14 మంది కార్యాలయ సిబ్బందిని నియమించాల్సి ఉంది. హైదరాబాద్ కార్యాలయంలో పని చేసిన వారంతా ప్రైవేటు ఏజెన్సీ ద్వారా నియమించినవారు కావడంతో వారు ఇక్కడికి వచ్చే పరిస్థితి లేదు. కలెక్టర్ నేతృత్వంలో సిబ్బందిని నియమించాల్సి ఉంది.

# స్వయం ఉపాధికి సాయం




మెదక్: బీసీ చేతి, కులవృత్తుల వారికి రూ.లక్ష సాయం అందిస్తోన్న ప్రభుత్వం ఇకపై మైనార్టీలకు ఇవ్వనుంది. తొలి విడతలో పలువురికి సబ్సిడీపై రుణాలివ్వగా, అందులో పదుల సంఖ్యలో యూనిట్లు మిగిలి ఉండడంతో వారికి శత శాతం అందజేయనున్నారు. దీంతో పాటు రెండో విడతలో సాయం అందించాలని నిర్ణయించారు. నియోజకవర్గానికి 120 మందికి చొప్పున సాయం అందిస్తారు. ఏవిధంగా అందజేయాలని మార్గదర్శకాలు రానందున కొంత సమయం పట్టే అవకాశం ఉంది. రెండో విడతకు ఎలాంటి దరఖాస్తులు స్వీకరించకుండానే.. ఇది వరకు వచ్చిన అర్జీల నుంచి లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ చేపట్టనున్నారు. ఈ అంశంపై కథనం...

2,239 దరఖాస్తులు

జిల్లాలో మైనార్టీల జనాభా 51,318 ఉంది. ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు లేని యువత స్వయం ఉపాధి కోసం వ్యాపారాలను నిర్వహిస్తుంటారు. వారికోసం సబ్సిడీ రుణాలు ఎంతగానో ఉపయోగపడుతాయి. గతేడాది డిసెంబర్‌లో మైనార్టీ సంక్షేమశాఖ జిల్లాకు యూనిట్లను కేటాయించింది. కేటగిరి-1లో రూ.లక్ష రుణం కోసం 78 యూనిట్లను, కేటగిరి-2లో రూ.2 లక్షల కోసం 34 యూనిట్లను మంజూరు చేశారు. కేటగిరి-1లో రూ.80 వేలు సబ్సిడీ, రూ.20 వేలు బ్యాంకు రుణం, కేటగిరి-2లో రూ.1.40 లక్షలు సబ్సిడీ, రూ.60వేలు బ్యాంకు రుణం అందజేయాలని నిర్ణయించారు. ముస్లింలు, జైనులు, సిక్కులు, బౌద్ధులు, పార్శీలు ఈ రుణాలకు అర్హులుగా అప్పట్లో తేల్చారు. సుమారు ఆరేళ్ల తర్వాత యూనిట్లు మంజూరు కావడంతో మైనార్టీలు పెద్దసంఖ్యలో దరఖాస్తు చేసుకున్నారు. 2,239 దరఖాస్తులు అందాయి. 35 శాతం మహిళలకు, 5 శాతం దివ్యాంగులకు, నిరుపేదలు, ఎటువంటి ఆధారం లేని మహిళలు, ఇదివరకు కార్పొరేషన్ రుణం తీసుకోనివారిని లబ్ధిదారులుగా ఎంపిక చేయాలని ఆదేశాలున్నాయి. తొలివిడతలో కేటగిరి-1, కేటగిరి-2 కలిపి మొత్తం 112 యూనిట్లు కాగా, ఇందులో 91 మందికి రుణాలిచ్చారు. ఎంపికైన లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమై ఉంది. కానీ ఇంత వరకు ఏ ఒక్క యూనిట్ గ్రౌండింగ్ కాలేదు. గత మార్చిలో రుణాలివ్వగా, ఇప్పటి వరకు గ్రౌండింగ్ చేయకపోవడం గమనార్హం.

పూర్తి రాయితీపై

దళితబంధు, బీసీ చేతి, కులవృత్తులకు సాయం అందిస్తున్న ప్రభుత్వం మైనార్టీలపై దృష్టిసారించింది. అసెంబ్లీ నియోజకవర్గానికి 120 మందికి రూ.లక్ష సాయం ఇవ్వనున్నారు. జిల్లాలో మెదక్, నర్సాపూర్ నియోజకవర్గాలు ఉండగా, 240 మందికి సాయం అందనుంది. అప్పటి వరకు తొలివిడతలో మిగిలిన 21 మందికి త్వరలో రూ.లక్ష సాయం అందిస్తారు. తొలివిడతలో కొంత రాయితీపై రుణం ఇచ్చారు. కానీ మిగిలిన వారికి శతశాతం సబ్సిడీ రానుంది. వీరికి సాయం అందించగా, రెండో విడత ప్రక్రియను మొదలుపెట్టనున్నారు.

మార్గదర్శకాల ప్రకారం ఎంపిక - జెమ్లానాయక్, జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి

మైనార్టీలకు తొలివిడతలో 91 మంది లబ్ధిదారులను ఎంపిక చేసి వారి ఖాతాల్లో నగదు జమచేశాం. మిగిలిన 21 మందికి రూ.లక్ష సాయం త్వరలో ఇవ్వనున్నాం. రెండో విడతలో సైతం నియోజకవర్గానికి 120 మంది చొప్పున అవకాశం కల్పించారు. లబ్ధిదారుల ఎంపిక మార్గదర్శకాలు రాలేవు. అవి వచ్చాక ఎంపిక చేపడతాం. రెండో విడతకు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ఉండదు. ఇది వరకు వచ్చిన అర్జీల్లో నుంచి ఎంపిక చేస్తాం.

# 'సహకార' విస్తరణ ఎప్పుడో?



సంగారెడ్డి : సహకార సంఘాల సేవలు విస్తరించాలని గతంలో ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతమున్న వాటికి తోడు కొత్తగా సంఘాల ఏర్పాటుకు మార్గం సుగమం కానుందని అన్నదాతలు భావించారు. ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల సంఖ్యను పెంచేందుకు వీలుగా జిల్లా యంత్రాంగం ప్రతిపాదనలు సిద్ధం చేసినా.. ఆమోదం లభించలేదు. ఆ తర్వాత కేంద్రం తీసుకున్న నిర్ణయం అమలులోకి రాకపోవడంతో ఎదురుచూపులే మిగిలిన నేపథ్యంలో కథనం.

71వేల మంది సభ్యులు

జిల్లాలో ప్రస్తుతం 53 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలున్నాయి. ఆయా సొసైటీల పరిధిలో 71వేల మంది రైతులు సభ్యులుగా కొనసాగుతున్నారు. ఎరువులు, విత్తనాలతో పాటు ధాన్యం కొనుగోలు కేంద్రాలు నిర్వహిస్తూ పరస్పర సహకారంతో ముందుకు సాగుతున్నారు. సహకార సంఘాలు అందుబాటులో లేనిచోట రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. కొత్త సంఘాల ఏర్పాటుతోనే వారి ఇబ్బందులు దూరమవుతాయి.

కేంద్రం నిర్ణయం అమలులోకి వస్తే..

ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా మూడేళ్ల కిందట జిల్లా యంత్రాంగం 13 కొత్త సంఘాల ఏర్పాటుకు ప్రతిపాదనలు రూపొందించింది. కొత్తగా ఏర్పాటైన అమీన్‌పూర్, నాగలిగిద్ద మండలాల్లో ఒక్క సొసైటీ లేదు. ఆ రెండు మండలాల్లో నాలుగు సంఘాల ఏర్పాటుకు ప్రతిపాదించారు. మరో తొమ్మిది మండలాల్లో ఒక్కో సొసైటీ మాత్రమే ఉన్నాయి. ఆయా మండలాల్లో అదనంగా ఒక్కో సహకార సంఘం, గుమ్మడిదల, మొగుడంపల్లి, కంది, వట్‌పల్లి, మునిపల్లి, రామచంద్రాపురం, మనూరు, కంగ్టి, సిర్గాపూర్ మండలాలు ఈ ప్రతిపాదిత జాబితాలో ఉన్నాయి. కేంద్రం తీసుకున్న నిర్ణయం అమలులోకి వస్తే కొత్తగా ఏర్పడిన నాగలిగిద్ద మండల కేంద్రంతోపాటు కరాస్‌గుత్తిలోనూ సహకార సంఘం ఏర్పాటయ్యే అవకాశం ఉంది. అమీన్‌పూర్ కొత్త మండలంగా ఏర్పడటంతో ఇక్కడ మండల కేంద్రమైన అమీన్‌పూర్‌తో పాటు వడక్‌పల్లిలో సహకార సంఘాలు ఏర్పాటవుతాయి. మునిపల్లి మండల కేంద్రంతోపాటు కంది మండలం కలివేముల, గుమ్మడిదల మండలం నల్లవెల్లి, మండల కేంద్రమైన మొగుడంపల్లి, కంగ్టి మండలం తడ్కల్, మండల కేంద్రమైన వట్‌పల్లి, మనూరు మండలం రాయిపల్లి, సిర్గాపూర్ మండలం వాసర్‌లో సహకార సంఘాలు ఏర్పాటుకు అవకాశం ఉంటుంది.

ఆదేశాలు రాగానే అమలు చేస్తాం

సహకార సంఘాల పెంపునకు సంబంధించి గతంలో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినప్పటికీ.. అప్పట్లో ఎన్నికల నేపథ్యంలో ప్రతిపాదనల ఉత్తర్వులను రద్దు చేశారు. కొత్తగా సంఘాలు ఏర్పాటుచేసే అంశం కేంద్రం పరిశీలనలో ఉంది. ప్రభుత్వం నుంచి వచ్చే ఆదేశాలకు అనుగుణంగా ముందుకుసాగుతాం. ఒక్కో సంఘంలో సభ్యులు ఎంతమంది, రుణాలు, వాటాధనం తదితర వివరాలతో గతంలో ప్రభుత్వానికి సమగ్రంగా నివేదిక ఇచ్చాం. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే కొత్త సంఘాల ఏర్పాటు ప్రక్రియను చేపడతాం.ప్రసాద్, జిల్లా సహకార అధికారి

# సామర్థ్య పరీక్షలు జరగవు.. బస్సులు రావు

ములుగు : జిల్లాలో జులై చివరి వారంలో కురిసిన భారీ వర్షాలు, వరదలు ఏజెన్సీ ప్రాంత వాసులకు శాపంగా మారాయి. వరదలు తగ్గి సుమారు 10 రోజులు దాటినప్పటికీ ఇంకా రవాణా వ్యవస్థ మెరుగు పడలేదు. ప్రజలు తీవ్ర వ్యయ ప్రయాసలకు గురవుతున్నారు. ఈ వ్యవహారం పలు విమర్శలకు దారి తీస్తోంది. రవాణా వ్యవస్థ మెరుగు పడకపోవడంతో హనుమకొండ నుంచి ఏటూరునాగారం మార్గంలో జాతీయ రహదారిపై భారీ వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. గోవిందరావుపేట మండలం పస్రా సమీపంలో జాతీయ రహదారిపై గల గుండ్లవాగు వంతెన అధిక వర్షాలతో దెబ్బతిన్నది. అయితే దానిని తాత్కాలిక మరమ్మతులతో పునరుద్ధరించారు. కానీ చిన్న తరహా వాహనాల రాకపోకలకే పరిమితమైంది. వంతెనకు దృఢత్వ పరీక్షలు నిర్వహించే వరకు భారీ వాహనాలను అనుమతించొద్దని కలెక్టర్ ఆదేశించడంతో ఆర్టీసీ బస్సులు నడవడం లేదు. ప్రయాణికులు అష్టకష్టాలు పడుతున్నారు. ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు. సామర్థ్య పరీక్షలు ఎప్పుడు నిర్వహిస్తారు, ఎప్పుడు వాహనాలను అనుమతిస్తారో అంతు చిక్కడం లేదు.

40 కిలోమీటర్ల దూర భారం

హనుమకొండ నుంచి ఏటూరునాగారం వరకు 110 కిలోమీటర్ల దూరం ఉంటుంది. గుండ్లవాగు వంతెన దెబ్బతిన్న కారణంగా ఏటూరునాగారం వెళ్లాలనుకునే ప్రయాణికులు 150 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తోంది. అదనంగా సుమారు 40 కిలోమీటర్ల దూరభారం పడుతోంది. హనుమకొండ నుంచి బయలు దేరిన బస్సు గోవిందరావుపేట మండలం పస్రా వరకు వెళ్తోంది. అక్కడి నుంచి పస్రా-మేడారం మార్గంలో బస్సులను డైవర్ట్ చేస్తున్నారు. పస్రా, నార్లాపూర్,





మేడారం, తాడ్వాయి మీదుగా ఏటూరునాగారం వరకు బస్సులను నడుపుతున్నారు. ఇలా ఒక గంట సమయం వృథా అవుతోంది. హనుమకొండ నుంచి ఏటూరునాగారం వరకు ఆర్టీసీ బస్సుల్లో గతంలో రూ.160 వసూలు చేసేవారు. 40 కిలోమీటర్లు అదనంగా తిరుగుతుండడంతో ప్రస్తుతం రూ.190 వసూలు చేస్తున్నారు.

ఇంజినీరింగ్ అధికారుల నిర్లక్ష్యం!

గుండ్లవాగు వంతెన జాతీయ రహదారుల శాఖ పరిధిలో ఉంది. వాహనాల రాకపోకలకు సంబంధించి ఈ వంతెనకు సామర్థ్య పరీక్షలు నిర్వహించాల్సిన బాధ్యత ఆ శాఖదే. సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు పట్టించుకోవడం లేదు. సాంకేతిక నిపుణులను తీసుకొచ్చి వంతెన స్థితి గతులను పరిశీలించి నిర్ధారించాల్సి ఉంది. ఈ ప్రక్రియకు ఇంకెన్నాళ్లు పడుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఈ విషయంపై ఎన్‌హెచ్ ఈఈ విద్యాసాగర్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. ఈ విషయాన్ని టెస్టింగ్ ఏజెన్సీకి సిఫారసు చేశామన్నారు. వారు ఎప్పుడు వస్తారనేది స్పష్టత లేదని సమాధానం ఇచ్చారు.

# ముమ్మరంగా జ్వర సర్వే

సిరిసిల్ల : ఇటీవల కురిసిన వర్షాల కారణంగా వీధుల్లో దోమల బెడద బాగా పెరిగింది. వీటి కారణంగా జనాలు అనారోగ్యం బారిన పడకూడదనే ఉద్దేశంతో జిల్లా యంత్రాంగం ముందుగానే స్పందించి ముమ్మరంగా ఇంటింటా జ్వర సర్వే చేయిస్తుంది. కాలానుగుణ వ్యాధుల నియంత్రణకు జ్వర సర్వే కీలకంగా భావిస్తున్నారు. దోమల కారణంగా వచ్చే డెంగీ, మలేరియా వ్యాధులను అరికట్టేందుకు చర్యలు చేపడుతున్నారు. ఈ ప్రక్రియ వానాకాలంలో నిరంతరాయంగా చేపట్టనున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు చెబుతున్నారు. జిల్లాలోని 13 మండలాలతోపాటు రెండు పురపాలక సంఘాల్లో వైద్య సిబ్బంది ఇంటింటా జ్వర సర్వే చేస్తున్నారు. 17 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో సుమారు 652 మంది సిబ్బంది సర్వేలో పాల్గొంటున్నారు. ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు రోజుకు 20 ఇళ్ల చొప్పున సర్వే చేస్తూ మొత్తం 5.52 లక్షల జనాభాను పరిశీలించనున్నారు. జులై 24న కార్యక్రమం మొదలై ఇప్పటి వరకు 1.85 లక్షల ఇళ్లలో ఆరోగ్య వివరాలు సేకరించినట్లు చెబుతున్నారు. క్షేత్ర సందర్శనకు వెళ్లే సిబ్బంది ఆరోగ్య వివరాలు తెలుసుకోవడంతోపాటు ఇంటి ఆవరణలో పారిశుద్ధ్య పరిస్థితులను పరిశీలిస్తారు. నీటి నిల్వ ప్రదేశాల్లో లార్వాను గుర్తించి నాశనం చేస్తారు. అలాగే ప్రతి శుక్రవారం డ్రైడేను నిర్వహిస్తూ జనాలకు అవగాహన పెంపొందిస్తున్నారు. డెంగీ కేసు నమోదైన ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపడుతున్నారు. లార్వాను నాశనం చేసేలా రసాయనాలు పిచికారీ చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.

864 మంది జ్వరపీడితులు...జిల్లాలో డెంగీ కేసుల నమోదును పరిశీలిస్తే ఏటా తగ్గుతూ వస్తున్నాయి. 2021లో 127, 2022లో 50, ఈ ఏడాది ఆగస్టు 8 వరకు కేవలం నాలుగు కేసులు నమోదైనట్లు



అధికారిక లెక్కలు చెబుతున్నాయి. అలాగే మలేరియా కేసులు సైతం తగ్గుతున్నాయి. సర్వేలో ఇప్పటి వరకు 864 మంది జ్వర పీడితులను గుర్తించినట్లు చెబుతున్నారు. లక్షణాలను బట్టి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మందులు పంపిణీ చేస్తున్నారు.

సమన్వయంతో మెరుగైన ఫలితాలు

గృహ సందర్శనకు వెళ్లే సిబ్బందికి పంచాయతీ ఉద్యోగులు, కార్మికులు కొంత సహకరించడం లేదన్న ఆరోపణలున్నాయి. వ్యవసాయ పనులకు ఉదయాన్నే వెళ్లడంతో ఇంట్లో కుటుంబ సభ్యులు ఉండటం లేదు. దీంతో సర్వేకు వెళ్లే సిబ్బంది అందుబాటులో ఉన్నవారి వద్ద వివరాలు సేకరిస్తున్నట్లు చెబుతున్నారు. భూమిలో ఏర్పాటు చేసిన నీటి ట్యాంకులను శుభ్రం చేయడం కొంత ఇబ్బంది. ఇలాంటి విషయాల్లో పంచాయతీ ఉద్యోగుల సహకారం తప్పనిసరి. వైద్య ఆరోగ్య శాఖ, పంచాయతీశాఖ సమన్వయంతో పని చేస్తే మెరుగైన ఫలితాలు వస్తాయి. గ్రామాల్లో సరైన వైద్య సదుపాయాలు లేకపోవడంతో స్థానిక ఆర్ఎంపీ, పీఎంపీలను ఆశ్రయిస్తుంటారు. వాళ్లు ఇచ్చిన మందుగోళీలను వాడుతుంటారు. వైద్యుల సూచనలు లేకుండా కొన్ని సందర్భాల్లో తెలిసిన మందు బిల్లలను తీసుకుంటారు. వ్యాధి ముదిరే వరకు వైద్యులను సంప్రదించరు. తెలియకుండా మందు బిల్లలను వినియోగిస్తే కలిగే దుష్ఫలితాలను వివరిస్తూ అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.ప్రతి ఒక్కరి భాగస్వామ్యంతో...

కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశాలతో జూన్ నుంచి జ్వర సర్వే చేపడుతున్నాం. గృహ సందర్శనలు చేస్తూ లార్వాను గుర్తించి జనాలకు అవగాహన కల్పిస్తున్నాం. జ్వర పీడితుల లక్షణాల ఆధారంగా మందు బిల్లల పంపిణీ, పరీక్షలకు సిఫారసు చేస్తున్నాం డ్రైడే కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహిస్తున్నాం. కార్యక్రమంపై కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. రోజు వారి వివరాలు సేకరిస్తూ ప్రతి పది రోజులకో సారి పునరావృతం చేయాలని ఆదేశిస్తున్నారు. ఫలితంగా జిల్లాలో డెంగీ కేసుల సంఖ్య తగ్గుముఖం పట్టింది.శ్రీరాములు, జిల్లా కీటకజనిత వ్యాధుల నియంత్రణ అధికారి

# నిధులుండీ నిర్లక్ష్యం.. నీరందక దుర్భిక్షం

ధర్మారం : 'అంగట్లో అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని' అన్నట్లుంది ఎస్సారెస్పీ డి83 బి కాలువ ఆయకట్టు రైతుల పరిస్థితి. కాలువ మరమ్మతు పనుల్లో జాప్యం కారణంగా పంటలకు నీరందడం లేదు. అవసరమైనన్ని నిధులున్నా సకాలంలో పనులు చేపట్టడం లేదు. దీంతో ధర్మారం, ఎండపల్లి, వెల్గటూరు మండలాల్లోని ఆయకట్టుకు ఎస్సారెస్పీ నీటి విడుదల ఆలస్యమవుతోంది.

ముదురుతున్న వరి నార్లు వానాకాలం వరి సాగుకు సాధారణంగా రైతులు ఆరుద్ర కార్తె చివరలో నార్లు పోస్తారు. ఈ సీజన్‌కు నార్లు పోసి నెల రోజులు దాటింది. ఇటీవలి వర్షాలకు పొలాల్లో జాలువారడం, బావుల్లోని నీటి ఆధారంగా చాలా మంది రైతులు నాట్లు వేసేందుకు పొలాలను దమ్ము చేశారు. వారం రోజులుగా మండుతున్న ఎండలతో దున్నిన పొలాలు ఎండుతున్నాయి. ఎస్సారెస్పీ ద్వారా ఈ నెల 9వ తేదీనే పంటలకు నీటిని విడుదల చేయగా, డి83 బి కాలువ మరమ్మతు పనులు పూర్తి కాకపోవడంతో వదలడం సాధ్యం కాలేదు. ధర్మారం మండలం మల్లాపూర్ శివారు నుంచి వెల్గటూరు మండలంలోని గోదావరి తీరం వరకు 28 కిలోమీటర్ల పొడవునా ఉన్న ఈ కాలువ ద్వారా ధర్మారంతో పాటు ఎండపల్లి, వెల్గటూరు మండలాల్లో 17,585 ఎకరాల ఆయకట్టుకు సాగు నీరందాల్సి ఉంది.సజావుగా సాగితే పక్షంలో పూర్తి అయిదేళ్ల కిందట ధర్మారం శివారులో అండర్ టన్నెల్(యూటీ) దెబ్బతిని ఎస్సారెస్పీ డి83 బి కాలువకు గండి పడింది. అప్పట్లో తాత్కాలికంగా మరమ్మతు చేసి నీటిని విడుదల చేశారు. యూటీ నిర్మాణానికి కొద్ది నెలల కిందట రూ.87.6 లక్షలు మంజూరయ్యాయి. నెల రోజుల కిందట పనులు ప్రారంభించారు. అయితే యూటీ నిర్మిస్తున్న ప్రదేశం పల్లంగా ఉండటం, చిత్తడి ప్రదేశం కావడంతో ఆశించిన మేర పనులు సాగడం లేదు. తాజాగా స్లాబు పనులు పూర్తయ్యాయి. స్లాబుపై మట్టి నింపి కాలువ పునరుద్ధరణ పనులు నిర్వహించాల్సి ఉంది. వర్షాలు లేకుంటే పది రోజుల్లో పనులు కొలిక్కి వస్తాయని సైట్ ఇంజినీర్లు చెబుతున్నా పక్షం రోజులు పట్టే ఆస్కారం ఉంది.అనుసంధానం.. అర్ధాంతరం నందిమేడారం రిజర్వాయరు నుంచి ఎస్సారెస్పీ డి83 బి కాలువకు 12.14 కోట్ల వ్యయంతో చేపట్టిన అనుసంధాన కాలువ పనులు ఇంకా పూర్తి కాలేదు. ఈ కాలువ పూర్తయితే ధర్మారం శివారులో కాలువ 10.775 కిలోమీటర్ల నుంచి నుంచి దిగువన 28 కిలోమీటర్ల వరకు ఆయకట్టుకు నీటిని విడుదల చేసే అవకాశం ఉండేది. గత నవంబరులో పనులు ప్రారంభించిన గుత్తేదారు మట్టి పనులు పూర్తి చేశారు. వంతెనలు, పాసేజ్‌ల నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది. నాలుగు నెలలుగా ఇవి సాగడం లేదు.

# వారాంతపు సంత.. సమస్యల చింత

చేర్యాల: చేర్యాల పట్టణంలో అంబేడ్కర్ కూడలి వద్ద ప్రతి మంగళవారం సంత(అంగడి) నిర్వహిస్తారు. దశాబ్దాలుగా కొనసాగుతున్న వారాంతపు సంతలో కనీస సౌకర్యాలు కరవయ్యాయి. పట్టణంలోని ఈ ప్రాంతం ప్రధాన కూడలితో పాటు బ్యాంకు, పోలీసు స్టేషన్‌లతో పాటు ముఖ్యమైన వాణిజ్య దుకాణాలున్నాయి. దీంతో నిత్యం రద్దీగా ఉంటుంది. దీనికి తోడు జనగామ నుంచి సిద్దిపేటకు వెళ్లే ప్రధాన రహదారిపైనా రైతులు, చిరువ్యాపారులు కూరగాయలు విక్రయిస్తుంటారు. జాతీయ రహదారి కావడంతో నిమిషానికి 35 నుంచి 40 వాహనాలు ఈ రోడ్డుపై వెళ్తుంటాయి. ఈ విషయాన్ని సర్వే చేసిన ఆర్అండ్‌బీ అధికారులే చెప్పారు. ఇరుకైన ఈ ప్రాంతంలో ఏర్పడే రద్దీతో ప్రతి మంగళవారం ప్రజలు, దుకాణదారులు నలిగిపోతున్నారు. రైతుబజారు నిర్మించినా పరిమిత సంఖ్యలో మడిగెలు ఉండటంతో సరిపోవడం లేదు. ప్రతి వారం రహదారిపైనే సంత కొనసాగుతోంది.

సబ్‌డివిజన్‌లోనే పెద్దది

చేర్యాల, మద్దూరు, బచ్చన్నపేట, నర్మెట మండలాల్లోనే పెద్ద అంగడి. చుట్టుపక్కల 80 గ్రామాల నుంచి రైతులు, చిరువాప్యారులు, మారువ్యాపారులు ఈ సంతలో కూరగాయలు విక్రయించి ఉపాధి పొందుతున్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పని చేసే ఉద్యోగులు, వసతి గృహ వార్డెన్లు, మధ్యాహ్నభోజన నిర్వాహకులు సంతకు వచ్చి కూరగాయలు కొనుగోలు చేస్తుంటారు. సంత జరిగే మంగళవారం రోజంతా రోడ్డు రద్దీగా ఉండటంతో కాలుతీసి కాలు పెట్టులేని పరిస్థితి. వాహనాలను రోడ్డు పక్కనే నిలపడం వల్ల సమస్య మరింత జఠిలమవుతోంది.



వాన పడినపుడు గోస

వాన జల్లు కురిసినపుడు విక్రయదారుల బాధలు వర్ణనాతీతం. ఆ ప్రాంతమంతా జలమయం అవుతుంది. సంత జరిగే వైపు మురుగు కాలువ లేదు. నీరు రోడ్డుపైనే నిలుస్తోంది. నీళ్లలోనే పెట్టి అమ్ముకోవాల్సిన పరిస్థితి ఉంటోంది. సరుకు కూడా పాడవుతోంది. మిగిలిన వాటిని వినియోగదారులు ఎక్కువ ధర పెట్టి కొనాల్సి వస్తోంది.

ఆదాయమున్నాఅంగడి తైబజారు వేలం ద్వారా బల్దియాకు ఏటా రూ.లక్షల్లో ఆదాయం సమకూరుతోంది. సౌకర్యాల కల్పనలో పంచాయతీ నిర్లక్ష్యం వహించింది. ఈ ఏడాది నిర్వహించిన వేలం పాటలో రూ.4.34 లక్షల ఆదాయం చేకూరింది. కనీసం షెడ్లయినా నిర్మించలేని పరిస్థితి. ఫలితంగా ఎండలో, వానలోనూ రోడ్డుపైనే క్రయవిక్రయాలు జరుగుతుంటాయి. రెండేళ్ల క్రితం ఈ కూడలి పూర్తిగా తారు రోడ్డు వేశారు.

రూ.3 కోట్లతో చేపట్టిన నిర్మాణం

పెరుగుతున్న జనాభాతో పాటు చేర్యాల స్థాయి పెరిగింది. మేజరు పంచాయతీ నుంచి మున్సిపాలిటీగా ఎదిగింది. సిద్దిపేట జిల్లాలో చేరాక అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఈ ప్రాంత రైతులకు ఉపాధి మరింత మెరుగుపరచాలన్న దృష్టితో అధికారులు 'సమీకృత విపణి' నిర్మాణానికి రూ.3 కోట్లు మంజూరు చేశారు. అంగడి బజారులోనే కూరగాయలు, మాంసం మార్కెట్ నిర్మించేందుకు నిర్ణయించారు. దీనికోసం బల్దియా కార్యాలయ భవనాన్ని నేల కూల్చారు. పనులు ప్రారంభించి ఏడాది గడుస్తున్నా పిల్లర్ల స్థాయిలోనే పనులు ఆగిపోయాయి. త్వరలో ప్రారంభిస్తాం:– రాజేంద్రకుమార్, కమిషనర్, చేర్యాల పురపాలిక

వారాంతపు సంతలో కొనుగోలుదారులు, అమ్మకందారులకు ఇబ్బందులు ఎదురవుతోంది వాస్తవమే. సమీకృత విపణికి సంబంధించి ముందుగా తయారు చేయించిన ఆకృతిలో మార్పులు జరిగాయి. ఆమేరకు పనులు కాస్త ఆలస్యమయ్యాయి. త్వరలోనే పనులు ప్రారంభిస్తాం. రెండు నెలల్లో నాన్‌వెజ్ విభాగం పూర్తి చేయిస్తాం.

# సైబర్ వలలో కుటుంబం

వరంగల్ : నాన్న మీరు కరెంటు బిల్లు చెల్లించలేదు గనక ఈ రాత్రే విద్యుత్తు కోత విధిస్తామంటూ నాన్నకు సందేశం వస్తుంది. అది నిజమేనని నమ్మి వాళ్లు చెప్పిన లింకు ద్వారా బిల్లు కడితే చివరకు ఆ డబ్బు సైబర్ మోసగాళు లాగేస్తారు. అమ్మ వాట్సప్ నెంబర్‌కు ఒక సందేశం వస్తుంది. మేమిచ్చిన టాస్కలు పూర్తి చేస్తే మీరు ఆన్‌లైన్‌లో అదనంగా సంపాదించవచ్చని చెబుతారు. అది నమ్మి డబ్బులు పంపుతూ చివరకు ఆమె మోసపోతారు. పిల్లలు మొబైల్‌లో వీడియోగేమ్‌లు ఆడుతున్న పిల్లాడికి గేమింగ్ యాప్‌లు వల వేస్తాయి. పాయింట్లు పెరగాలంటే క్రెడిట్ కార్డు వివరాలు నమోదు చేయాలని. దీంతో బాలలు తల్లిదండ్రులకు తెలియకుండా కార్డు తీసుకొని వాళ్లు అడిగిన వివరాలు నమోదు చేయడంలో వేల రూపాయలు ఖాతాలో నుంచి మాయమవుతున్నాయి. తాత, నానమ్మలు మలివయస్సు వారిని బ్యాంకు ఖాతా బూచి చూపి నగదు లాగేస్తున్నారు. మీ కేవైసీ అప్‌డేట్ చేయకపోతే పింఛన్ రాదని ఫోన్‌కాల్ రావడంతో వారు తెలియక ఓటీపీ చెబుతూ నిలువునా మోసపోతున్నారు. ఉమ్మడి వరంగల్ వ్యాప్తంగా ఇటీవల వెలుగుచూసిన సైబర్ మోసాలు ఆందోళన కలిగిస్తున్నాయి. నేరగాళ్లు కుటుంబంలో ఎవరినీ వదలడం లేదు. అన్ని వయస్సుల వారిని మోసగించేందుకు చూస్తున్నారు. ఒక కుటుంబాన్ని ఉదాహరణగా తీసుకుని సైబర్ నేరస్థుల చేతిలో ప్రధానంగా ఎవరు ఎలా మోసపోతారో ఉదాహరణలతో వివరిస్తూ ప్రత్యేక కథనం. ఇవిగో ఉదాహరణలు..ఆశ చూపి.. హనుమకొండ జిల్లా ఆత్మకూరు ఠాణా పరిధిలో బుధవారం ఓ వివాహిత పోలీసులను ఆశ్రయించారు. గూగుల్ మ్యాప్ రివ్యూవార్ అనే పని.. ఆన్‌లైన్‌లో చేస్తే మీకు డబ్బులు వస్తాయని, తాము ఇచ్చిన టాస్కలు పూర్తి చేయాలని సందేశం రావడంతో ఆమె లింకులు తెరుస్తూ టాస్కులు చేయగా కొంత డబ్బు వచ్చింది. మరిన్ని టాస్కలు చేస్తే పెద్ద మొత్తంలో డబ్బులు వస్తాయని సైబర్ నేరగాళ్లు చెప్పిన విధంగా పలు దశలో రూ.1,25,000 పోగొట్టుకున్నారు. చివరకు తాను మోసపోయానని గ్రహించి ఆత్మకూరు పోలీసులను ఆశ్రయించగా కేసు నమోదు చేశారు.

లక్షలు మాయం

నెహ్రూసెంటర్: పెట్టుబడి పెడితే లాభం వస్తుందని నమ్మించి ఓ వ్యక్తి ఖాతా నుంచి సైబర్ నేరగాళ్లు రూ.3.85 లక్షలు కాజేశారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఎన్జీవోస్ కాలనీకి చెందిన ఒక వ్యక్తికి జులై 15న తెలిగ్రామ్ అనే యాప్ ద్వారా లింక్ వచ్చింది. డబ్బులు పెట్టుబడి పెడితే మీకు లాభం వస్తుందని, చెప్పగా నమ్మి తన రెండు ఖాతాల నుంచి రూ.80 వేలు, రూ.35 వేలు, మర్నాడు మరో రూ.2,65,000 పంపించారు. తర్వాత సమాచారం రాకపోవడంతో తాను మోసపోయినట్టు గ్రహించి పోలీసులను ఆశ్రయించారు.

జనగామ జిల్లా పాలకుర్తి మండలం ఏడునూతలకు చెందిన ఓ వ్యక్తి ఆన్‌లైన్‌లో ఒక యాప్‌లో టేబుల్ బుక్ చేశారు. ప్రముఖ ఈకామర్స్ యాప్‌ను పోలిన నకిలీ యాప్‌ను సృష్టించడంతో కొనుగోలుదారుడు రూ.5500 చెల్లించి చివరకు నష్టపోయారు. పెద్దవాళ్లను నమ్మిస్తూ.. వరంగల్ మిల్స్‌కాలనీ ఠాణాలో ఇటీవల ఒక వృద్ధుడిని సైబర్ మోసగాళ్లు నమ్మించి రూ.లక్ష కొల్లగొట్టారు. డెబ్భై ఏళ్ల వృద్ధుడికి ఫోన్‌కాల్ వచ్చింది. మీ అల్లుడికి అండమాన్ నికోబార్‌కు బదిలీ చేస్తున్నామని రూ.లక్ష తమకు పంపితే దాన్ని నిలిపి వేస్తామని చెప్పడంతో వృద్ధుడు గుడ్డిగా అది నమ్మి అడిగినంత నగదు పంపి మోసపోయారు. వృద్ధులను అనేక రకాలుగా సైబర్ నేరగాళ్లు మోసగిస్తున్నారు.

# నక్కవాగులో ఇసుకాసురులు!



చేగుంట: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వాగులు, వంకలు పొంగిపొర్లాయి. ప్రవాహంతో ఏర్పడిన ఇసుక మేటలను కొందరు అక్రమార్కులు కొల్లగొట్టడంతో పాటు.. వాగుల్లోని నీటిని వినియోగిస్తూ కృత్రిమంగా ఇసుక తయారు చేస్తున్నారు. ప్రకృతి సంపదను కాజేస్తున్నారు. జిల్లాలోని నక్కవాగును ఆసరాగా చేసుకుని ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక వ్యాపారం జోరుగా సాగుతున్నా.. అడ్డుకట్ట వేయడంలో అధికారులు విఫలమవుతున్నారనే ఆరోపణలున్నాయి. ఇసుక దందా చేసేవారికి రాజకీయ అండదండలు ఉండటమే కారణమనే విమర్శలున్నాయి. ఈ నేపథ్యంలో కథనం.

జిల్లా, ఇతర ప్రాంతాలకు తరలింపు

పటాన్‌చెరు మండలం, సంగారెడ్డి మండలం ఇస్మాయిల్‌ఖాన్, గౌడిచెర్ల, హనుమాన్‌నగర్, దాసుగడ్డతండా, కంది మండలం బ్యాతోల్, ఆరుట్ల, చిద్రుప్ప, బేగంపేట, ఎర్దనూర్, హత్నూర మండలలోని పల్పనూర్, గుండ్లమాచనూర్ గ్రామాల మీదుగా నక్కవాగు ప్రవహిస్తుంది. ఆ వాగును అనుకొని కృత్రిమ ఇసుక తయారీ జోరుగా సాగుతోంది. అసైన్డ్‌భూముల్లో తవ్విన మట్టిని ట్రాక్టర్లలో తీసుకొచ్చి.. జనరేటర్ల సాయంతో నక్కవాగులో నుంచి నీటిని తోడేస్తూ ఇసుక తయారు చేస్తున్నారు. మరికొందరు వాగువెంటే ఇసుక ఫిల్టర్లు ఏర్పాటు చేశారు. నిత్యం 30 నుంచి 40 ట్రిప్పుల లారీల ఇసుకను సంగారెడ్డి, పటాన్‌చెరు, జహీరాబాద్, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఒక్కో లారీ ఇసుకకు రూ.25వేల నుంచి రూ.30వేల ధరకు విక్రయిస్తూ.. రూ.లక్షలు అక్రమంగా ఆర్జిస్తున్నారు.

ప్రభుత్వ, అటవీ భూముల్లో తవ్వకాలు

హత్నూర మండలం మల్కాపూర్, మంగాపూర్, దౌల్తాబాద్, దౌలాపూర్, నాగుల దేవులపల్లి, గుండ్లమాచనూర్, పల్పనూర్, తదితర గ్రామాల్లో కృత్రిమ తయారీ జోరుగా సాగుతోంది. ఇందుకోసం సమీపంలోని ప్రభుత్వ, పట్టా, అటవీ భూముల్లో ఎలాంటి అనుమతులు లేకుండా తవ్వకాలు చేపడుతున్నారు. సంగారెడ్డి మండలంలో ఇస్మాయిల్‌ఖాన్‌పేట, గౌడిచెర్లలో ఏడు ఇసుక తయారు కేంద్రాలు కొనసాగుతున్నాయి. ఇందుకోసం కొన్ని చోట్ల ఉచిత విద్యుత్తును సైతం వినియోగిస్తున్నారు. ఇంత జరుగుతున్నా.. రెవెన్యూ, నీటిపారుదల, విద్యుత్తు శాఖ అధికారులు చర్యలు తీసుకోవడానికి వెనుకడుగు వేస్తున్నారు. ఇసుక తయారీపై స్థానికులు ఫిర్యాదు చేసినప్పుడు అధికారులు ఒకటి, రెండు రోజులు హడావుడి చేసి.. ఆ తర్వాత చేతులు దులుపుకొంటున్నారనే విమర్శలున్నాయి.

రహదారులు ధ్వంసం

ఇసుక తయారీ, తరలింపులో భాగంగా అక్రమార్కులు భారీ వాహనాలు వినియోగిస్తున్నారు. భారీ లోడుతో లారీలు వెళ్లడం వల్ల అంతర్గత, ప్రధాన, గ్రామీణ రహదారులు ధ్వంసమవుతున్నాయి. రూ.లక్షల వ్యయంతో వేసిన దారులు ఛిద్రంగా మారుతుండటంతో రాకపోకలకు ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. ప్రధానంగా రాత్రివేళల్లో రహదారులపై ఏర్పడిన గుంతల వల్ల వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. పరిశీలించి.. చర్యలు తీసుకుంటాం– రవీందర్‌రెడ్డి, ఆర్డీవో, సంగారెడ్డిసంగారెడ్డి డివిజన్‌లో ఎక్కడైనా కృత్రిమ తయారు చేస్తే చర్యలు తప్పవు. ఆయా మండలాల తహసీల్దార్లు వెంటనే క్షేత్ర స్థాయిలో పర్యటించాలి. ఇసుక ఫిల్టర్లను నేలమట్టం చేయాలని ఆదేశిస్తాం. వాల్టా చట్టానికి వ్యతిరేకంగా వ్యవహరించడం సరికాదు. ఇసుక తయారుచేస్తున్న వ్యాపారులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం.

# ప్రమాదాలకు అడ్డుకట్ట



చేగుంట: జాతీయ రహదారి బైపాస్ సర్కిల్ వద్ద ఉపరితల వంతెన నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. మరో నెల రోజుల్లో వంతెన పూర్తికానుంది. తర్వాత దానిపై నుంచి రాకపోకలు ప్రారంభంకానున్నాయి. వంతెన లోపల నుంచి ఇతర వాహనాలు చేగుంటకు రావటం జరుగుతుంది. చేగుంట సమీపంలోని రెడ్డిపల్లి సర్కిల్ వద్ద 44వ జాతీయ రహదారి బైపాస్ వెళ్తుంది. ఇక్కడ కేంద్ర ప్రభుత్వం రూ.19 కోట్లతో ఉపరితల వంతెన నిర్మించేందుకు పచ్చజెండా ఊపింది. 2021లో మంజూరు చేస్తే 2022 ఫిబ్రవరిలో పనులు ప్రారంభించారు. అప్పటి నుంచి పనులు వేగంగా సాగుతున్నాయి. నిర్మాణంలో ఎలాంటి జాప్యం లేకుండా గుత్తేదారు నిర్మిస్తున్నారు.

ఎంతో మంది ప్రాణాలు కోల్పోయి..

44వ జాతీయ రహదారిని 2006లో నాలుగు వరుసలుగా నిర్మాణం చేపట్టారు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు ఈ రహదారి విస్తరించి ఉంది. జిల్లాలో 55 కిలోమీటర్లు ఉండగా మనోహరాబాద్, తూప్రాన్, మాసాయిపేట, చేగుంట, నార్సింగి, రామాయంపేట మండలాల మీదుగా వెళ్తుంది. ప్రతి రోజు వేల వాహనాలు 24 గంటలు ప్రయాణం సాగిస్తుంటాయి. రెడ్డిపల్లి బైపాస్ సర్కిల్ వద్ద చాలా ప్రమాదాలు జరుగుతుండేవి. ఎంతో మంది ప్రాణాలను కోల్పోయారు. చేగుంట మండల ప్రజలతో పాటు హైదరాబాద్, కామారెడ్డి, నిజామాబాద్, జగిత్యాల, కరీంనగర్ జిల్లాలకు చెందిన వారు మరణించారు. ముఖ్యంగా చేగుంట మండలం రెడ్డిపల్లి, చిట్టోజీపల్లి, నార్సింగి మండలం వల్లూరు, భీంరావుపల్లి గ్రామాలకు చెందినవారు ద్విచక్రవాహనాలు, సైకిళ్లపై చేగుంటకు రాకపోకలు చేస్తున్న సమయంలో సర్కిల్ వద్ద జాతీయ రహదారిపై వాహనాలు వేగంగా వచ్చి ఢీకొనడంతో ప్రమాదాలు జరుగుతుండేవి.

2014 నుంచి ప్రయత్నం

ప్రమాదాలు జరిగే సర్కిల్ వద్ద ఉపరితల వంతెన నిర్మాణం కావాలని ప్రజల నుంచి పెద్దఎత్తున డిమాండ్ ఉంది. దీంతో 2014 నుంచి అధికారులు, పలు పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు ప్రయత్నాలు ప్రారంభించారు. ఎట్టకేలకు కేంద్ర ప్రభుత్వం రెండేళ్ల క్రితం ఉపరితల వంతెన మంజూరు చేసింది. దీంతో పనులు ప్రారంభించారు. మొదట పాత రహదారిపై ఉన్న చిన్న వంతెనల నిర్మాణం చేపట్టారు. తర్వాత వంతెనకు ఇరువైపుల గోడల నిర్మాణం చేపట్టి మట్టి వేసే పనులు ప్రారంభించారు. ప్రస్తుతం మట్టి పనులు పూర్తిచేశారు. ఇప్పుడు దానిపై చిన్న కంకర వేసే పనులు చేస్తున్నారు. తర్వాత బీటీ నిర్మాణం చేపడితే పూర్తి అవుతుంది. భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఆరు వరుసలుగా నిర్మాణం చేశారు. దీనివల్ల ఇక ఎలాంటి సమస్య లేకుండా వాహనాలు వెళ్లేందుకు అవకాశం ఉంది. జాతీయ రహదారిపై ఇంతకు ముందే తూప్రాన్ మండలం నాగులపల్లి చౌరస్తా వద్ద వంతెన నిర్మాణం చేపట్టి పూర్తిచేశారు. త్వరలోనే రెడ్డిపల్లి సర్కిల్ వద్ద పూర్తికానుంది. దీని తర్వాత జప్తిశివునూర్ వద్ద రూ.29 కోట్లతో నిర్మిస్తున్న ఉపరితల వంతెన నిర్మాణ పనులు వేగం అందుకోనున్నాయి. అలాగే తూప్రాన్ మండలం కరీంగూడ వద్ద కూడా వంతెన నిర్మాణ పనులు సాగుతున్నాయి. రానున్న రోజుల్లో జాతీయ రహదారిపై మరికొన్ని చోట్ల కూడా వంతెనలు మంజూరు కానున్నాయి. మంజూరై పూర్తిచేస్తే రానున్న రోజుల్లో జాతీయ రహదారి ప్రమాదాలు చాలా వరకు తగ్గిపోతాయి.

# ఇదేనా స్వచ్ఛత?

సిరిసిల్ల : ఇటీవల కురిసిన వర్షాలతో సిరిసిల్ల పట్టణంలోని సుభాష్‌నగర్‌లో అంతర్గత సీసీ రోడ్లు వరదలకు కొట్టుకుపోయాయి. దీంతో వాహనదారులు, స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. సుభాష్‌నగర్ నుంచి గాంధీనగర్‌కు వచ్చే ప్రధాన కాల్వపై పిచ్చి మొక్కలు ఏపుగా పెరగడంతో కాల్వలో మురుగు నిలిచి దుర్వాసన వస్తుందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతర్గత వీధుల్లో కాల్వలు పూర్తిస్థాయిలో లేకపోవడంతో వర్షాలు వస్తే మురుగు రహదారులపై నుంచే పారుతుందని వాపోయారు. సుభాష్‌నగర్‌లోని మరో ప్రధాన కాల్వలో చెత్త పేరుకుపోయి మురుగు నెమ్మదిగా పారుతోంది. చెత్తాచెదారం కల్వర్టుపైన వేయడంతో దుర్గంధం వచ్చి వ్యాధుల బారిన పడుతున్నామని స్థానికులు చెబుతున్నారు. పారిశుధ్య లోపం వల్ల ఈగలు, దోమలు వృద్ధి చెంది వ్యాధుల బారిన పడుతున్నా అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. దీంతో చెత్తాచెదారం ఎక్కడికక్కడ పేరుకుపోతోందని, ఎప్పటికప్పుడు కాలువలను



శుభ్రం చేయిస్తే ఈ సమస్య ఉండదని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వార్డులో కాల్వలను శుభ్రం చేసి బ్లీచింగ్ పౌడర్ చల్లాలని కోరుతున్నారు. అలాగే చెడిపోయిన అంతర్గత రహదారులను మరమ్మతులు చేయించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# యువతరం.. సేవే పరమార్థం

వరంగల్ : దేశ భవిత యువతరం చేతుల్లోనే ఉందన్నది మేధావుల మాట. కొందరు యువకులు చదువులు, పనులు చూసుకుంటూనే సామాజిక సేవల్లో ముందుంటున్నారు. రెండేళ్ల కిందట ప్రపంచాన్ని వణికించిన కరోనా మహమ్మారి సమయంలో.. ఇటీవల గ్రేటర్ వరంగల్‌ను అతలాకుతలం చేసిన వరదల సందర్భంగా పలువురు సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా.. యువతరం సేవా తత్పరతపై ప్రత్యేక కథనం..

వరదల్లో ప్రాణాలకు తెగించి..

రంగంపేటకు చెందిన యువకులు సేవా కార్యక్రమాల్లో ఆదర్శంగా నిలుస్తున్నారు. గత నెల వరంగల్ నగరాన్ని వరదలు ముంచెత్తిన సమయంలో పలువురిని కాపాడారు. జులై 28న పోటెత్తిన భద్రకాళి నాలా వరద రంగంపేటను ముంచెత్తింది. స్మార్ట్‌రోడ్డులో శుద్ధజలం ప్లాంటు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్న వృద్ధ దంపతులు ఇంట్లోనే చిక్కుకుపోయారు. డీఆర్ఎఫ్ టీం వచ్చినప్పటికీ అక్కడికెళ్లేందుకు సాహసించలేదు. దీంతో యువకులు కరీమ్, యాకుబ్, నబీ అంత వరదల్లోనూ ప్రాణాలకు తెగించి తాడు సాయంతో ఆ ఇంట్లోకి చేరుకొని వృద్ధ దంపతులను కాపాడి స్థానికుల అభిమానాన్ని చూరగొన్నారు.

కరోనా బాధితులకు అండగా..

వరంగల్ రంగశాయిపేట ప్రాంతానికి చెందిన బాల్య మిత్రులు సేవా కార్యక్రమాల్లో ముందుంటున్నారు. 250 మంది రంగశాయిపేట యూత్ ఫోర్స్ (ఆర్‌వైఎఫ్) పేరుతో సంఘం ఏర్పాటు చేసుకొన్నారు. స్థానికుల సహకారంతో సేవా కార్యక్రమాలు చేపడుతూ ఆదర్శంగా నిలుస్తున్నారు. కరోనా సమయంలో అండర్ రైల్వేగేట్ ప్రాంతంలోని సుమారు 200 మంది బాధితులకు రోజూ ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనాలు అందించారు. అవసరం ఉన్నవారికి మందులు పంపిణీ చేశారు. నిత్యావసరాలు, రోగ నిరోధకశక్తి పెరిగేలా ఎండు ఫలాలు, పండ్లు అందజేసి వారు త్వరగా కోలుకునేలా అండగా నిలిచారు. క్రీడలు, చదువులో రాణిస్తున్న పేద విద్యార్థులకు అన్నివిధాలా చేయూతనందిస్తున్నారు. మహనీయుల జయంతి, వర్ధంతుల సందర్భంగా రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నారు. వృద్ధులు, అనాథలకు అన్నదానం, పండ్ల పంపిణీ చేస్తున్నారు.

ఆపదలో ఉన్నవారిని ఆదుకుంటూ..

ఆపదలో ఉన్నవరాని ఆదుకోవడం, ఆకలితో ఉన్నవారి కడుపు నింపడం లక్ష్యంగా వరంగల్‌లోని యువ నేతాజీ ఫౌండేషన్ సభ్యులు సేవా



కార్యక్రమాలు చేపడుతున్నారు. గిర్మాజీపేటకు చెందిన కొత్తకొండ అరుణ్‌కుమార్, పోలీసు కానిస్టేబుళ్లు కన్నెరాజు, బొట్టు కమలాకర్ తదితరులు ఈ ఫౌండేషన్ ఏర్పాటు చేశారు. అత్యవసర పరిస్థితుల్లో ఉన్నవారికి రక్తదానం చేసి వారి ప్రాణాలు కాపాడుతున్నారు. ఇటీవల ఎంజీఎం ఆసుపత్రి, అంధుల పాఠశాల, ములుగురోడ్డులోని స్వయం కృషి అనాథ ఆశ్రమంలో అన్నదానాలు చేస్తున్నారు. కరోనా సమయంలో ఆన్‌లైన్ చదువుల సందర్భంగా పేద విద్యార్థులు 11 మందికి చరవాణులు, శివనగర్, హనుమకొండ, నెక్కొండ ప్రాంతాలకు చెందిన నలుగురికి ల్యాప్‌టాప్‌లను అందించారు. ఒక దివ్యాంగురాలికి కుట్టుమిషన్ అందించి ఉపాధి కల్పించారు. ఎంజీఎం ఆసుపత్రిలో రోగులకు తాగునీటి కోసం రెండు కూలర్లు, అక్వాగార్డు ఫిల్టర్ల యంత్రాన్ని అందించారు. సభ్యుల చందాలు, దాతల సహకారంతో సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఫౌండేషన్ అధ్యక్షుడు కొత్తకొండ అరుణ్ తెలిపారు. వాట్సాప్ వేదికగా..వరంగల్ అండర్ రైల్వేగేటు ప్రాంతానికి చెందిన యువకులు 2015లో వాట్సాప్ వేదికగా చేసుకొని సామాజిక సేవా కార్యక్రమాలతో ఆదర్శంగా నిలుస్తున్నారు. ఖిలావరంగల్ మధ్యకోటకు చెందిన పేరుమాండ్ల మధు నాయకత్వంలో సుమారు 60 మంది సభ్యులు వారి జన్మదినం రోజున రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నారు. అంధుల పాఠశాలలో అన్నదానం చేస్తూ మానవత్వాన్ని చాటుకొంటున్నారు. లేబర్ కాలనీలో రేచీకటితో బాధపడుతున్న అనాథలకు సొంత ఖర్చులతో వివాహం జరిపించారు. కోటలోని బాలిక పాఠశాలను దత్తత తీసుకొని 200మంది పిల్లల చదువులకు చేయూత అందిస్తున్నారు. జాతీయస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైన విద్యార్థినులకు శిక్షణకు అవసరమైన సౌకర్యాలు కల్పించడంతో పాటు వారికి బూట్లు, న్యూట్రీషన్ అందించారు. సంఘం సభ్యులు, విదేశాల్లో ఉన్న మిత్రులు సహకారంతో సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు.

ఊరి కోసం ఒక్కటయ్యారు..

మండలంలోని ల్యాబర్తి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న 22 మంది గ్రామం కోసం ఒక్కటయ్యరు. 'ల్యాబర్తి మిత్రమండలి'గా ఏర్పడి పేదలకు అండగా నిలుస్తున్నారు. కరోనా సమయంలో గ్రామంలో మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.3 లక్షల వరకు ఆర్థికసాయం అందించారు. అదే గ్రామానికి చెందిన అన్నందాస్ శ్రీనివాస్ కరోనాతో మృతి చెందగా ఆయన కుమార్తె అక్షిత చదువు బాధ్యతను తీసుకొని వర్ధన్నపేటలోని ప్రైవేటు పాఠశాలలో ఫీజులు చెల్లిస్తూ ఆంగ్ల మాధ్యమం చదివిస్తున్నారు. గ్రామస్థుల సహకారంతో కార్యక్రమాలు చేస్తున్నట్లు శ్రీనివాస్, కరుణాకర్, రాజు, శ్రీధర్ తెలిపారు.

సాయం చేసే చేతులే మిన్న..ప్రార్థించే పెదవులకన్నా సాయం చేసే చేతులే మిన్న అన్నసూక్తితో ముందుకు సాగుతున్నారు ఆ యువత. గీసుకొండ మండలంలోని ఊకల్ హవేలీ గ్రామానికి చెందిన మొగసాని శంకర్ ఎమ్మార్సీ కార్యాలయంలో ఒప్పంద ఉద్యోగం చేస్తూ జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన 25 మంది యువకులతో నేతాజీ సర్వీస్ టీం ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. 20మందితో వాట్సప్ గ్రూపు ఏర్పాటు చేసి అవసరార్థులకు రక్తదానం చేస్తున్నారు. ములుగు జిల్లా ఏటూరు నాగారం మండలం కొండాయి, ఊరట్టం గ్రామాల్లో వరద బాధితులకు నిత్యావసరాలు అందించారు. వరంగల్‌లోని ముంపు ప్రాంతాల్లో గుడిసెలపై కప్పుకోవడానికి టార్పాలిన్‌లు పంపిణీ చేశారు. టీం సభ్యులు రక్తదానం చేయడంలో ముందుంటున్నారు. 120 సార్లు అన్నదానాలు చేశారు. ఇప్పటి వరకు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో 20 అవార్డులు వచ్చాయి. టీమ్ అధ్యక్షుడు శంకర్ కేంద్ర మంత్రి సదానందం చేతుల మీదుగా మదర్ థెరెస్సా పురస్కారం, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేణుగోపాలచారి చేతుల మీదుగా స్ఫూర్తి శిఖర జాతీయ విశిష్ట సేవా పురస్కారం అందుకున్నారు.

# అంచనాలకు మించి.. వరించె

సూర్యాపేట : జిల్లాలో సాగునీరు సమృద్ధిగా ఉండటంతో అన్నదాతలు యాసంగిలో ఎక్కువగా వరి పంటపైనే ఆసక్తి చూపుతున్నారు. ఇతర పంటలను వదిలేసి వరిపైనే గురి పెడుతుండటంతో గతంతో పోలిస్తే ఈ సారి సేద్యం పెరగనుంది. జిల్లాకు ఎస్సారెస్పీ కాల్వల ద్వారా గోదావరి జలాలు విడుదల చేస్తుండటంతోపాటు చెరువుల్లోనూ జలకళ కనిపిస్తోంది. భూగర్భ జలాలూ పెరగడంతో బోరుబావుల్లో నీరు పుష్కలంగా ఉంది. పత్తి, మిర్చితో పోలిస్తే వరికి పెట్టుబడి తక్కువ ఉండటం, కొనుగోలు కేంద్రాల ద్వారా సులభంగా విక్రయించే వెసులుబాటు ఉండటంతో అన్నదాతలకు కలిసివస్తోంది.

నామమాత్రంగా చిరుధాన్యాల సేద్యం

జిల్లాలో గత నెల వరకు కూలీల సమస్య తలెత్తింది. దీంతో వరినాట్లు కాస్త ఆలస్యమయ్యాయి. ఎక్కువ మంది వెదజల్లె, డ్రమ్ సీడర్ పద్ధతి ద్వారా సాగు చేపట్టారు. ప్రస్తుతం పత్తి తీత పనులు పూర్తి కావడంతో నాట్లు వేసేందుకు కూలీలు అందుబాటులోకి వచ్చారు. జిల్లాలో యాసంగిలో ఇప్పటి వరకు 2,77,730 ఎకరాల్లో వరి సాగు చేపట్టారు. ఇంకా మరో 50 వేల ఎకరాల్లో సాగయ్యే అవకాశం ఉంది. వ్యవసాయ శాఖ లెక్కల ప్రకారం గత ఏడాది కంటే వరి 21,466 ఎకరాల్లో



సేద్యం పెరగనుందని అంచనా. జిల్లాలో ఆరుతడి పంటల సాగు అంతంత మాత్రంగానే ఉంది. వరి తర్వాత పత్తి, మిర్చి సాగు చేస్తున్నారు. ప్రత్యామ్నాయ పంటలేవీ 1,050 ఎకరాలకు మించటం లేదు. పెట్టుబడి తక్కువ, వరి సాగుకు భూమి అనుకూలంగా ఉండటంతో అన్నదాతలు అటువైపే మొగ్గు చూపుతున్నారని వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

సమృద్ధి నీటి నిల్వలతో..రామారావు నాయక్, జిల్లా వ్యవసాయ అధికారి, సూర్యాపేట

రాష్ట్ర ప్రభుత్వం ఆదేశానుసారం మిగతా పంటలపై దృష్టి సారించాలని రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. నీటి వనరులు సమృద్ధిగా ఉండటంతో అన్నదాతలు ఎక్కువగా వరి వైపే మొగ్గు చూపుతున్నారు. చిరుధాన్యాలు పండించాలని, వాటి వినియోగంపై అవగాహన కల్పించాం. రైతులు వరి కాకుండా మిగతా పంటలు పండించాలి.

# మత్స్యకారులకు బీమా భరోసా

సూర్యాపేట : మత్స్యకారుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అండగా నిలుస్తున్నాయి. ప్రమాదవశాత్తు మృత్యువాత పడిన కార్మికుల కుటుంబాలు రోడ్డున పడకుండా కేంద్ర ప్రభుత్వం జాతీయ మత్స్యకారుల అభివృద్ధి బోర్డు ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన(పీఎంఎంఎస్‌వై) ప్రమాద బీమా పథకాన్ని తీసుకొచ్చింది. గ్రూపు యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ స్కీం(జీఏఐఎస్) కింద బీమా వర్తింపజేసేందుకు ప్రీమియం మొత్తాన్ని కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు చెల్లిస్తాయి. ఉమ్మడి జిల్లాలో 434 మత్స్య సహకార సంఘాలు ఉన్నాయి. వాటిలో 47,688 మంది సభ్యులు ఉన్నారు. పీఎంఎంఎస్‌వై పథకం ద్వారా వీరికి ప్రమాద బీమా వర్తిస్తుంది.

బీమా వర్తించే సందర్భాలు..

రోడ్డు, రైల్వే, సముద్రం, నీటి వనరుల్లో మునిగినా, గల్లంతయినా బీమా వర్తిస్తుంది. అగ్ని, విషపూరిత పదార్థాల కారణంగా చనిపోయినా, పిడుగుపాటు, విద్యుదాఘాతానికి గురైనా, మిషనరీతో పని చేస్తున్నప్పుడు ప్రమాదం జరిగినా, హత్యకు గురైనా, ఎత్తునుంచి పడిపోయినా, పాము, తేలుకాటు, ఏదైనా జంతువు వల్ల గాయం కారణంగా మరణించినా, వైకల్యం పొందినా బీమా వర్తిస్తుంది.

మృతి చెందితే రూ. 5 లక్షలు

చెరువులు, కుంటలు, జలాశయాలు, నదుల్లో చేపలు పట్టేందుకు మత్స్యకారులు వెళ్తుంటారు. ఆ సమయంలో కాళ్లకు వల చుట్టుకొని మృతిచెందితే రూ.5లక్షల వరకు బీమా వచ్చేది. ప్రస్తుతం కేంద్ర,



రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ఈ పథకంతో మత్స్యకారులు ప్రమాదవశాత్తు మరణించినా, శాశ్వత వైకల్యం పొందినా వారి కుటుంబాలకు రూ.5 లక్షలు బీమా పరిహారం వస్తుంది. ఒకవేళ ప్రమాదానికి గురై ఆసుపత్రిలో చేరితే రూ.25 వేలు అందుతాయి.

అర్హులెవరంటే..!

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బీమా పథకానికి మత్స్యకారులు, మహిళా వృత్తిదారులు, చేపల పెంపకందారులు, మత్స్య సంబంధిత అనుబంధ పనులు చేసేవారు అర్హులు. వయస్సు 18 ఏళ్ల నుంచి 70 ఏళ్లలోపు ఉండాలి. ఈ ఏడాది జులై 25 వరకు దరఖాస్తుకు అవకాశం ఉంది.

జులై 25 వరకు గడువు

రూపేందర్‌సింగ్, జిల్లా మత్స్యశాఖ అధికారి, సూర్యాపేట

ఈ ఏడాది జులై 25 వరకు మత్స్యకారులు బీమా నమోదుకు గడువు ఉంది. సకాలంలో దరఖాస్తు చేసుకోవాలి. మత్స్య సహకార సంఘాల్లో సభ్యత్వం ఉన్నవారితోపాటు నామినీకి సంబంధించిన ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతా వివరాలను దరఖాస్తుతో జతపర్చాలి. వచ్చిన దరఖాస్తులను ఎన్‌ఎఫ్‌డీబీ వెబ్‌సైట్‌లో నమోదు చేస్తాం.

# అడగలేవని అలుసా..?



కోదాడ : ప్రభుత్వం పాడి రైతులకు గేదెలను, మాంసం ఉత్పత్తి కోసం గొర్రెలు, మేకలను పలు రకాల రాయితీలతో అందిస్తోంది. కానీ వీటి సంరక్షణకు ఏర్పాట్లు చేయకపోవడంతో వందల సంఖ్యలో మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల వారికి అవగాహన కొరవడటం, వైద్య సేవలు అందుబాటులో లేకపోవడం పశువులకు శాపంగా మారుతోంది. ఏడాదికి ఒక్కసారి గ్రామంలో నట్టల నివారణ శిబిరాల పేరిట రెండు రోజులు హడావుడి చేసి అధికారులు చేతులు దులుపుకొంటున్నారు.

జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి..

సూర్యాపేట జిల్లాలో 41 ప్రాథమిక పశు వైద్యశాలలు, 5 ప్రాంతీయ పశు వైద్యశాలలు, 42 ఉపకేంద్రాలు ఉన్నాయి. వీటిలో సిబ్బంది కొరత తీవ్రంగా వేధిస్తోంది. జిల్లా వ్యాప్తంగా 15 పశు వైద్య ఉపకేంద్రాల్లో సహాయకులు లేక వారానికి ఒక్కరోజే ఉపకేంద్రాలు తెరుస్తున్నారు. కొన్ని గ్రామాల్లో సిబ్బంది లేకపోవడంతో మూసి ఉంటున్నాయి.

అవగాహన లేమి..

ప్రభుత్వం 108 తరహాలో పశువులను వైద్యశాలలకు తరలించేందుకు సంచార పశు వైద్యశాల పేరుతో 1962 టోల్‌ఫ్రీ నంబరును అందుబాటులోకి తెచ్చింది. దీనిపై గ్రామీణ రైతులకు అవగాహన లేదు. గ్రామీణ ప్రాంతాల్లో దీని పనితీరుపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత అధికారులు, ప్రభుత్వంపై ఉంది.

ఇబ్బందులు పడుతున్నాం..వీరబాబు, తొగర్రాయి

వారంలో ఒక్కరోజు ఉపకేంద్రం తెరుస్తుండటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. పశువులు రోగాల బారిన పడినప్పుడల్లా పక్క గ్రామాలకు తీసుకెళ్తున్నాం. గ్రామంలో పశు వైద్య సహాయకులను వెంటనే భర్తీ చేసి సేవలు ప్రారంభించాలి.

సిబ్బందిని నియమించాలివీరారెడ్డి, అడ్లూరు

గ్రామస్థులకు పశుపోషణే జీవనాధారం. జిల్లా ఉన్నతాధికారులకు పలుమార్లు తమ సమస్యను మొర పెట్టుకున్నా పట్టించుకోలేదు. సిబ్బంది లేకపోవడంతో ఏళ్ల తరబడి ఉపకేంద్రం మూసే ఉంటోంది. ఇప్పుడికైనా సమస్యను గుర్తించి గ్రామంలో సిబ్బందిని నియమించాలి.

ఉన్నతాధికారులకు నివేదిక అందించాం..శ్రీనివాసరావు, జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి

జిల్లాలో సిబ్బంది కొరత కారణంగా 15 ఉపకేంద్రాల్లో సేవలు నామమాత్రంగా నడుస్తున్నాయి. ఉన్న సిబ్బందిపై పని ఒత్తిడి అధికమవుతోంది. పశు వైద్య సేవలు పూర్తి స్థాయిలో అందించేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నాం. ఖాళీల కొరతపై ఉన్నతాధికారులకు నివేదిక అందించాం. త్వరలో ఖాళీల భర్తీ జరగనుంది.

# పెద్దల అండ.. ఆనవాళ్లే లేకుండా..!



సూర్యాపేట :చెరువులు, నీటి కుంటలు ఉన్న ప్రాంతాల్లోనే పూర్వం జనావాసాలు ఏర్పాటు చేసుకోగా..కాలగమనంలో..మానవ అభివృద్ధి క్రమంలో కబ్జాలు పెరిగిపోయి.. నీటిని నిల్వ చేసే చెరువులు, కుంటలు అదృశ్యమవుతున్నాయి. గతంలో నిత్యావసరాలు తీర్చేందుకు, పంటలు పండించేందుకు ఉపయోగపడిన చెరువులు..ప్రస్తుతం రియల్ వ్యాపారుల ఆక్రమణలతో ఆనవాళ్లు కోల్పోతున్నాయి. చెరువుల పూర్తి నీటి నిల్వ సామర్థ్యం (ఎఫ్‌టీఎల్) నిర్ధరించినప్పటికీ ఈ మేరకు చెరువుల హద్దులు నిర్ణయించి వాటిని పరిరక్షించే విషయంలో సరైన వ్యవస్థ లేకపోవడంతో చెరువులు మాయమవుతున్నాయి. ఉమ్మడి నల్గొండ జిల్లా వ్యాప్తంగా పట్టణాల్లో చెరువులు, కుంటల స్థలాల్లో ఇళ్లను నిర్మించుకుంటుండగా, గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ పంటలు సాగు చేస్తూ కబ్జాలకు పాల్పడుతున్నారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత మిషన్ కాకతీయ పేరుతో చెరువులు, కుంటల పూడిక తీత పనులు చేపట్టినప్పటికీ ఆయా చెరువుల హద్దుల నిర్ణయం విషయంలో రాజకీయ జోక్యంతో అవి పూర్వ వైభవాన్ని పొందలేకపోయాయి.

ఉమ్మడి జిల్లాలో పరిస్థితి

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 556 నీటిచెరువులు, 4193 నీటి కుంటలు కలిపి మొత్తం 4749 చెరువులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వీటిలో దశలవారీగా మిషన్ కాకతీయ కింద పూడికతీత పనులు చేపట్టారు. 2014- 15 ఏడాదికి గాను 952 చెరువుల్లో పూడికతీసి పూర్తి నీటినిల్వ సామర్థ్యం మేరకు నీరు నిల్వ ఉండేలా ఏర్పాటు చేశారు. ఉమ్మడి జిల్లాలోని 556 చెరువుల పరిధిలో 1,38,855 ఎకరాలు, నీటికుంటలు 4077 పరిధిలో 79,750 ఎకరాలు కలిపి మొత్తం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 4633 చెరువుల పరిధిలో 2,18,605 ఎకరాల ఆయకట్టు సాగుచేస్తున్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో అటవీ శాఖ పరిధిలో 13 నీటి చెరువులు ఉన్నాయి. వీటిని అటవీశాఖ పరిరక్షిస్తుంది.

మచ్చుకు కొన్ని..మిర్యాలగూడ పట్టణం, మండలంలోని యాద్గార్‌పల్లి గ్రామాల మధ్య విస్తరించి ఉన్న పెద్దచెరువు రామచంద్రగూడెంలో ఆక్రమణలకు గురైంది. నీటి నిల్వ సామర్థ్యం గుర్తించి హద్దులు ఏర్పాటు చేయకపోగా ఈ ప్రాంతంలో రెవెన్యూ సిబ్బంది గతంలో పలువురికి పాసుపుస్తకాలు జారీ చేశారు. దీని కారణంగా ఆక్రమణలతో మినీ ట్యాంక్ బండ్ నిర్మాణ పనులు 2016 నుంచి ఇప్పటి వరకు పూర్తి చేయలేకపోతున్నారు. కోదాడ పెద్ద చెరువునకు చెందిన స్థలాలను కొందరు వ్యక్తులు కబ్జాకు పాల్పడి నిర్మాణాలు చేపట్టారు. పురపాలిక, రెవెన్యూ, నీటిపారుదల మధ్య సమన్వయ లోపంతో ఆక్రమణలు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం 50 ఎకరాలకుపైగా ఆక్రమణలకు గురైనట్లు సమాచారం.నాగార్జునసాగర్ నియోజకవర్గ పరిధిలోని గుర్రంపోడు మండలం కొప్పోలు గ్రామంలో తాటిచెరువు కొంత భాగం ఆక్రమణకు గురైంది. కొందరు వ్యక్తులు వ్యవసాయం చేసుకుంటున్నారు.సూర్యాపేటలోని సద్దుల చెరువు పరిధిలో కొందరు ఆక్రమించి నిర్మాణాలు జరిపారు. 59 జీవో ప్రకారం రెగ్యులర్ కోసం దరఖాస్తు చేసుకోగా.. దీన్ని అధికారులు పెండింగ్‌లో పెట్టారు. దేవరకొండ పురపాలిక పరిధిలోని తులసమ్మకుంటలో కొందరు వ్యక్తులు అక్రమంగా నిర్మాణాలు జరిపి షెడ్లు నిర్మించారు. దీనివల్ల కుంటకు చెందిన స్థలం ఆక్రమణకు గురైంది. హుజూర్‌నగర్ నియోజకవర్గ పరిధిలో బూరుగడ్డ, లింగగిరి చినచెరువు వంద ఎకరాలు ఉండగా.. ప్రస్తుతం కబ్జాలకు గురై ఆనవాళ్లు కోల్పోయింది. భువనగిరి పట్టణంలోని పెద్దచెరువులో ఓ పరిశ్రమ వారు రహదారి ఏర్పాటుకు మట్టితో నింపారు. మరో రియల్ ఎస్టేట్ సంస్థ ఒక అడుగు ముందుకు వేసి ఎఫ్‌టీఎల్ పరిధిలో తమ వెంచరు ఏర్పాటు చేసి విక్రయాలు జరుపుతోంది.

# అందని పరిహారం.. అన్నదాతలు ఆగం

భువనగిరి : కన్న తల్లిలాంటి ఊరు.. జీవనాధారమైన పొలాలు.. తమ ముత్తాతలు సంపాదించిన ఆస్తులు.. సర్వం కోల్పోయి... ఊరు విడిచి వెళ్లాల్సి సమయం ఆసన్నమైనా పరిహారం అందక, పునరావాస పనులు పూర్తి కాక బీఎన్ తిమ్మాపూర్ గ్రామస్థులు దయనీయ పరిస్థితుల్లో కొట్టిమిట్టాడుతున్నారు. భువనగిరి మండలం బస్వాపూర్‌లో 11.39 టీఎంసీల సామర్థ్యంతో నృసింహసాగర్ జలాశయం నిర్మితమౌతున్న విషయం విధితమే. బీఎన్ తిమ్మాపూర్‌తో పాటు చౌక్లా తండా, లప్పనాయక్ తండాలు జలాశయంలో ముంపునకు గురవుతున్నాయి. పరిహారం కోసం 57 రోజులుగా జలాశయం కట్టపైన ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం నుంచి కనీసం స్పందన లేకపోవడంతో బాధను తట్టుకోలేక ఇప్పటికే పలువురి గుండెలు ఆగాయి. మరికొందరు ఆత్మహత్యలు చేసుకున్నారు. జూపల్లి నర్సింహా అనే నిర్వాసితుడు బుధవారం గుండెపోటుతో మరణించడంతో ప్రభుత్వంలో కదలిక వచ్చింది. పరిస్థితులు చేజారుతున్నాయని కలెక్టర్ పమేలా సత్పత్తి ఉన్నతాధికారుల దృష్టికి తెచ్చారు. అప్పటికప్పుడు ఎమ్మెల్యే శేఖర్‌రెడ్డి ప్రభుత్వ ఉన్నతాధికారుల వద్దకు వెళ్లి ఆర్‌అండ్ ఆర్ ప్యాకేజీలో పెండింగ్‌లో ఉన్న రూ.34 కోట్ల విడుదలకు అనుమతి తెచ్చారు. కానీ భూ నిర్వాసితులకు చెల్లించాల్సిన రూ.195 కోట్లు గూర్చి ఊసెత్తలేదు. బీఎన్ తిమ్మాపూర్ వాసులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీకి గాను భూసేకరణ చట్టం-2103 ప్రకారం 2019లో నోటిఫికేషన్ జారీ చేశారు. భువనగిరి పట్టణం హుస్సేనాబాద్‌లోని సర్వే నెంబర్ 107లోని 93 ఎకరాల్లో లే-అవుట్ తయారు చేస్తున్నారు. ఒక్కొక్కరికీ 200 చ.గజాలు ఇచ్చేందుకు సిద్ధం చేస్తున్నారు. ఈ పనులు తుది దశకు చేరుకున్నాయి. సర్వే చేసిన అధికారులు 1056 మంది నిర్వాసితులు ఉన్నట్లు తేల్చారు. పరిహారం ప్యాకేజీలో భాగంగా ఒక్కొక్కరికి 200 చ.గజాల స్థలం, రూ.7.61 లక్షల నగదు ఇవ్వాలని నిర్ణయించారు. 655 మంది లబ్ధిదారులకు రూ.50 కోట్లను 2022 సెప్టెంబరు నెలలోనే చెల్లించారు. మిగిలిన 401 మందికి రూ.34 కోట్లను చెల్లించాల్సి ఉండగా ప్రభుత్వం జాప్యం చేస్తూ వచ్చింది. ఎట్టకేలకు నిధులు విడుదల చేసేందకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

తీవ్ర జాప్యం..నిర్వాసితులపాలిట శాపం

నృసింహసాగర్ జలాశయం నిర్మాణంలో భువనగిరి మండలంతో బీఎన్ తిమ్మాపూర్, యాదగిరిగుట్ట మండలం లప్పనాయక్‌తండా(లక్ష్మీనాయక్ తండా), తుర్కపల్లి మండలం చౌక్లా తండలు మునిగిపోతున్నాయి. 2017 నుంచి భూసేకరణ పనులు కొనసాగుతున్నాయి. తిమ్మాపూర్ గ్రామానికి సంబంధించి 1090 ఎకరాలకు అవార్డు పాస్ చేసి డబ్బులు చెల్లింపు కోసం గత మే నెలలోనే జాబితా పంపించారు. రూ.194 కోట్లను చెల్లించాలి. వీటిలో 750 ఎకరాలు రైతులువి కాగా మిగిలిన 270 ఎకరాలు రియల్‌ఎస్టేట్ వ్యాపారులవి. అవార్డు పాసై ఎనిమిది నెలుల గుడుస్తున్నా ప్రభుత్వం నయాపైసా విడుదల చేయలేదు.

వారంలో చెల్లిస్తాంపమేలా సత్పతి, కలెక్టర్‌బీఎన్ తిమ్మాపూర్ నిర్వాసితులను అన్ని విధాలా ఆదుకునేందకు చర్యలు తీసుకుంటున్నాం. అందరకీ న్యాయం జరిగేలా ప్రభుత్వానికి నివేదిస్తున్నాం. రూ.34 కోట్లు రెండు రోజుల్లో జమౌతాయి. ఆ వెంటనే లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తాం. గ్రామస్థులు గ్రామ సభ పెట్టుకుని తీసుకున్న నిర్ణయం ప్రకారం ప్లాట్లు కేటాయిస్తాం.

# సృజనాత్మకత.. ఉపాధికి భరోసా

జడ్చర్ల : నేడు ఉన్నత విద్య అభ్యసిస్తున్నా ఉద్యోగం దొరుకుతుందన్న భరోసా లేదు. ఇలాంటి పరిస్థితుల్లో యూజీసీ మార్గదర్శకాల మేరకు విద్యార్థులకు చదువుతో పాటు ఉపాధి మార్గాలను చూపాలన్న లక్ష్యంతో ప్రభుత్వ కళాశాలల యాజమాన్యాలు కృషిచేస్తున్నాయి. ఇందులో భాగంగా జడ్చర్లలోని డా.బూర్గుల రామకృష్ణారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జంతుశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఓ వినూత్న కార్యక్రమం చేపట్టారు. వివాహాలు, ఇతర శుభకార్యాల సమయంలో మెహందీ కళాకారులకు చాలా డిమాండ్ ఉంటోంది. ఒక్కో వేడుకకు పనిచేసేందుకు రూ. వేలల్లో డబ్బులు తీసుకుంటున్నారు. మెహందీలో శిక్షణ ఇప్పిస్తే విద్యార్థినులకు ఆర్థికంగా ఆధారమవుతుందని ప్రిన్సిపల్ డా.అప్పియా చిన్నమ్మ, అధ్యాపకురాలు, కోర్సు సమన్వయకర్త కె.సుభాషిణి ఇందుకు శ్రీకారం చుట్టారు. డిగ్రీ ప్రథమ సంవత్సరం విద్యార్థినులకు నైపుణ్య అభివృద్ధిలో భాగంగా మెహందీ డిజైన్ సర్టిఫికెట్ కోర్సులో నెల రోజుల శిక్షణ ఇచ్చారు. 30 రకాల డిజైన్లను నేర్పించారు. ఈ నేపథ్యంలో పలువురు విద్యార్థినులను పలకరించింది.

కొత్త డిజైన్లు నేర్చుకున్నా

కళాశాల వసతి గృహంలో ఉంటూ చదువుతున్నా. మెహందీ అంటే చాలా ఇష్టం. కోర్సుతో చాలా డిజైన్లు నేర్చుకున్నా. గ్రామాలు, పట్టణాల్లో మోహందీకి మంచి డిమాండ్ ఉంది. వివాహాల్లో మోహందీ డిజైన్ వేస్తే రూ. 2వేల నుంచి రూ. 5వేల వరకు ఇస్తారు. డిగ్రీ పూర్తయిన



తర్వాత ఎలాంటి ఉద్యోగం రాకున్నా మెహందీ డిజైన్‌తో నేను ఉపాధి పొందొచ్చు.

మేఘన

స్వయంఉపాధికి అవకాశంనెల రోజులుగా మెహందీపై ఇచ్చిన శిక్షణ సద్వినియోగం చేసుకున్నా. ఖాళీ సమయంలో మెహందీపై ప్రత్యేక సాధన చేసి నైపుణ్యాలు పెంచుకుంటాను. చదివే సమయంతో పాటు డిగ్రీ తర్వాత డబ్బులు సంపాదించేందుకు తోడ్పాటు అవుతుంది. ఆర్థికంగా నిలదొక్కుకుంటానన్న నమ్మకం ఏర్పడింది. మెహందీ సర్టిఫికెట్ కోర్సు స్వయం ఉపాధికి మంచి తోడ్పాటునిస్తుంది. సద్వినియోగం చేసుకుంటే ఎంతో బాగుంటుంది.

కరిష్మా సద్వినియోగం చేసుకున్నాం

మా కళాశాలలో చదువుతో పాటు విభిన్న రంగాల్లో విద్యార్థులను ప్రోత్సహిస్తున్నారు. మెహందీ సర్టిఫికెట్ కోర్సు నిర్వహించటం గొప్ప అవకాశం. నెల రోజుల పాటు ఎంతో ఆసక్తితో నేర్చుకున్నాం. పండుగల సమయంలో మెహందీకి భలే డిమాండ్ ఉంటుంది. మంచి డిజైన్లు వస్తే డబ్బులు బాగానే వస్తాయి. డిగ్రీ చదివిన తర్వాత ఇంటి వద్ద ఉంటూ సొంతంగా ఉపాధి పొందొచ్చు.

షాహిస్తా అజ్మీ, ఫౌజియా బేగం, నజ్మా

# మాయమవుతున్న గుడి మాన్యం!

సిద్దిపేట : ఆలయాల భూములు అన్యాక్రాంతమవుతున్నాయి. వీటి ద్వారా వచ్చే ఆదాయాన్ని నిత్యం పూజలు, సందర్భానుసారంగా చేసే ఉత్సవాల ఖర్చులకు వినియోగించుకునేందుకు కేటాయించారు. కానీ అక్రమార్కుల కడుపు నింపుతున్నాయి. ఆ స్థలాల హద్దులు, సర్వే సంఖ్యలను నిర్ధారణ చేయలేదు. నిర్ధారించినా పర్యవేక్షణ కరవవడంతో కబ్జాదారులు పాగా వేస్తున్నారు. దశాబ్దాలుగా దస్త్రాల్లోనే భద్రంగా ఉంటున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉంది. సిద్దిపేట జిల్లాలో ప్రముఖమైన దేవాలయాల భూముల పరిస్థితిపై ప్రత్యేక కథనం. మల్లికార్జునస్వామి కల్యాణోత్సవానికి 2014 డిసెంబరు 21న హాజరైన ముఖ్యమంత్రి కేసీఆర్.. 'కొమురవెల్లి ఆలయాన్ని అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో స్వామివారికి ముందుగా భూములు కేటాయించాలని అధికారులను ఆదేశించారు. తితిదే మాదిరిగా విల్లాలు, కాటేజీల నిర్మాణం చేయాలన్నారు. నాలుగైదు ఎకరాలు అభివృద్ధి చేయాలని.. భారీ శివలింగం ఏర్పాటు చేయాలని కలెక్టర్‌కు ఆదేశాలిచ్చారు. కొమురవెల్లి మండలంలోని ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ భూములను స్వామివారికి కేటాయించేందుకు సర్వే చేశారు. కొమురవెల్లి, కిష్టంపేట, రాంసాగర్, వేచరేణి, గౌరాయపల్లిలో గుర్తించారు. అప్పట్లో 161 ఎకరాలు ఉన్నాయని గుర్తించిన అధికారులు చివరకు ఏ వివాదాలు లేని 131.09 ఎకరాలని నిర్ధారించారు. మల్లికార్జునస్వామి పేరిట దస్త్రాల్లో మార్పిడి చేశారు. భూముల వద్ద బోర్డులు ఏర్పాటు చేయించారు. రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో కొలతలు వేసి, దేవస్థానానికి ఇంకా అప్పగించలేదు. కొందరు వ్యక్తులు ఆక్రమించి కబ్జాలో ఉన్నారు. పలు చోట్ల ఆలయాలు, సంఘాల భవనాలు, శ్మశానవాటిక నిర్మాణాలు చేపట్టారు. రెండేళ్ల క్రితం ఆలయానికి సమీపంలోనే ఓ వ్యక్తి కొంత భూమి చదును చేసి పరదాలతో గుడిసె వేశారు. నాలుగేళ్ల క్రితం రాజీవ్ రహదారి వద్ద మరో వ్యక్తి ఏకంగా గోడ నిర్మిస్తుండగా ఆలయ అధికారులు అడ్డుకున్నారు. నాలుగు నెలల క్రితం మట్టిని తరలిస్తుండగా ఈవో చూసి అడ్డుకొని పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదైంది. సుదూరంగా ఉండే భూముల పర్యవేక్షణ సరిగా లేకపోవడంతో ఇతరుల చేతుల్లోకి వెళ్లిపోతున్నాయి. కిష్టంపేట శివారులోని ఎంబేరుమన్నారుస్వామి గుడికి సుమారు 33 ఎకరాల భూమి ఉంది. కబ్జాకు గురి కావడంతో రెండేళ్ల క్రితం దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో సర్వే చేశారు. కొందరు కౌలు చేసుకుంటున్నారు. గుడికి ఏమీ చెల్లించడం లేదని ఆలయ వర్గాలు తెలిపాయి. దీనిపై ఎవరూ పట్టించుకోవటం లేదు.

దుబ్బాక కూడవెల్లి రామలింగేశ్వరస్వామి ఆలయానికి 4.24 ఎకరాలు, వేణుగోపాలస్వామి గుడికి 4.35 ఎకరాలు, సంగమేశ్వర ఆలయానికి 3.06 ఎకరాల భూములున్నాయి. వాటిలో 3.29 ఎకరాలు అన్యాక్రాంతమైనట్లు ఆరోపణలున్నాయి. రెండేళ్ల క్రితం సర్వే చేశారు. ఎలాంటి తదుపరి చర్యలు తీసుకోలేదు.

నంగునూరు పరిధిలో.. నంగునూరులోని రామాలయానికి దాదాపు 22 ఎకరాల భూమి ఉంది. అందులోనే శ్మశానవాటిక, రహదారులు, డంపింగ్‌యార్డు, పల్లె ప్రకృతి వనం నిర్మాణం, నర్సరీ నిర్వహణ సాగుతోంది. ఫలితంగా దేవుడి మాన్యం కుంచించుకుపోతోంది. ఆలయ సమీపంలో, విద్యుత్ ఉపకేంద్రం పక్కన రెండు చోట్ల దాదాపు రెండెకరాలు సాగు రూపంలో కబ్జాకు గురైంది. రూ.కోట్ల విలువైన భూమిపై కన్నేసిన పలువురు అనేకమార్లు కబ్జాకు విఫలయత్నాలు సాగిస్తున్నారు. నర్మెట్ట శివాలయం, రామాలయం భూములు దాదాపు 40 ఎకరాల మేర గ్రామానికి చెందిన కొందరు ఆక్రమించారు.




# ఢిల్లీ ఎర్రకోట వేదికగా ఘనంగా 77వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

ఢిల్లీ : ఢిల్లీ ఎర్రకోట వేదికగా 77వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. వరుసగా10వ సారి ఎర్రకోటపై ప్రధాని నరేంద్ర మోదీ జెండా ఎగురవేశారు. ఎర్రకోటలో వేడుకలు తిలకించేందుకు దేశంలోని వివిధ రంగాల నుంచి సుమారు 1,800 మందికి ప్రత్యేక అతిథులుగా ఆహ్వానం అందింది. గత ఏడాదితో పోల్చితే... ఈ ఏడాది పెద్ద సంఖ్యలో అతిథులకు ఆహ్వానం అందింది. 'జన భాగస్వామ్యం' పేరిట ఆహ్వానం పంపారు. ఉజ్వల గ్రామాల నుంచి 400 మంది సర్పంచులు సహా 660 మందిని పైగా ఆహ్వానించడం జరిగింది. రైతు ఉత్పత్తిదారు సంస్థల నుంచి 250 మంది, ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకం, ప్రధానమంత్రి నైపుణ్యాభివృద్ధి పథకం కింద 50 మంది, కొత్త పార్లమెంట్ భవనం, సెంట్రల్ విస్టా ప్రాజెక్టు నిర్మాణంలో పాల్గొన్న 50 మంది కార్మికులు, సరిహద్దు రోడ్ల నిర్మాణం, అమృత సరోవరాల తవ్వకం, ఇంటింటికీ నీరు పథకంలో పాల్గొన్న కార్మికులు, 50 మంది ఖాదీ కార్మికులు, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, నర్సులు, మత్స్యకారుల నుంచి 50 మంది చొప్పున ప్రత్యేక అతిథులుగా ఆహ్వానించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఎర్రకోట వద్ద రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, సహాయ మంత్రి అజయ్ భట్, కార్యదర్శి గిరిధర్ అరమానే తదితరులు స్వాగతం పలికారు. ఢిల్లీ సంయుక్త ఇంటర్-సర్వీసెస్, ఢిల్లీ పోలీస్ గార్డ్ బలగాలు ప్రధానికి వందన సమర్పణ చేశాయి. అనంతరం సైనిక బలగాల గౌరవ వందనం స్వీకరించారు. ఈ గౌరవ వందన కవాతు బృందంలో ఆర్మీ, వైమానిక దళం, ఢిల్లీ పోలీసు విభాగం నుంచి ఒక్కొక్క అధికారితో పాటు 25 మంది సిబ్బంది, నావికాదళం నుంచి ఒక అధికారితోపాటు 24 మంది సిబ్బంది పాల్గొన్నారు. ఈ ఏడాది కవాతు సమన్వయ బాధ్యతను భారత సైన్యం నిర్వహించింది. మేజర్ వికాస్ సంగ్వాన్ నేతృత్వంలో సైనిక దళాలు కవాతు నిర్వహించాయి. ప్రధాని జాతీయ జెండాను పూల వర్షం కురిపించిన భారత వైమానిక దళానికి చెందిన మార్క్-III ధ్రువ్ అడ్వాన్స్‌డ్ లైట్ హెలికాప్టర్లు ఆవిష్కరించాయి. ఎర్రకోట వద్ద పుష్పాలంకరణలో విశేషాకర్షణగా జి-20 లోగో నిలిచాయి. ఎర్రకోటకు చేరుకునే ముందు రాజ్ ఘాట్‌లో మహాత్మాగాంధీ సమాధి వద్ద ప్రధాని మోదీ నివాళులు అర్పించాయి.




# వచ్చే ఎన్నికల్లో పోటీ ఎక్కడి నుంచో చెప్పేసిన బాలినేని

ప్రకాశం: వచ్చే ఎన్నికల్లో ఒంగోలు నుండి పోటీ చేయనున్నట్లు మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస్‌రెడ్డి ప్రకటించారు. అలాగే మాగుంట శ్రీనివాసులురెడ్డి ఒంగోలు పార్లమెంట్ నుంచి పోటీ చేస్తారని తెలిపారు. మంగళవారం మీడియాతో బాలినేని మీడియాతో మాట్లాడారు. కొంత మంది రకరకాలుగా మాట్లాడుతున్నారని, వాటిని నమ్మొద్దని ఖండించారు. వచ్చే నెలలో 25 వేల మందికి ఇళ్ల పట్టాలు ఇస్తామని బాలినేని శ్రీనివాస్ చెప్పారు. ఒంగోలులో పేదలకు ఇళ్ల పంపిణీలో తాను అవినీతికి పాల్పడినట్టు నిరూపిస్తే రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటానని సవాల్ విసిరారు. 25వేల మందికి జగన్ అన్నఇళ్ల పట్టాలు పంపిణీకి రంగం సిద్ధం చేస్తే టీడీపీ వాళ్ళు కోర్టులో కేసులు వేసి అడ్డుకున్నారని మండిపడ్డారు.

ప్రజల సొమ్ము ప్రజలకు పంచుతుంటే టీడీపీకి కోర్టులో కేసులు వేయడం ఏం పని అంటూ ప్రశ్నించారు. "పేదలకు పంచే ఇళ్ల పట్టాల పంపిణీలో నేను సంపాదించాలనుకుంటే రూ.500 కోట్లలో రూ.50 కోట్లు సంపాదించుకోవచ్చు.. కానీ నేను సింగిల్ రూపీ కూడా ముట్టుకోలేదు" తెలిపారు. గతంలో ఒంగోలులో టిడ్కో ఇళ్ల విషయంలో భారీ అవినీతి జరిగిందని మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస్‌రెడ్డి ఆరోపణలు గుప్పించారు.

# సుప్రీంకోర్టుపై మోదీ ప్రశంసలు.. స్పందించిన సీజేఐ



దిల్లీ: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా చారిత్రక ఎర్రకోట నుంచి జాతినుద్దేశించి ప్రసంగించిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ .. దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టుపై ప్రశంసలు కురిపించారు. తీర్పులను ప్రాంతీయ భాషల్లోకి అనువాదం చేస్తూ కోర్టు తీసుకున్న నిర్ణయాన్ని కొనియాడారు.

ఈ వేడుకలకు అతిథిగా హాజరైన భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై. చంద్రచూడ్.. మోదీ ప్రశంసలకు స్పందించారు. అభినందన పూర్వకంగా ప్రధానికి నమస్కారం చేశారు. ఎర్రకోటపై జాతీయ జెండాను ఆవిష్కరించిన తర్వాత ప్రధాని మోదీ దేశ ప్రజలనుద్దేశించి సుదీర్ఘ ప్రసంగం చేశారు. ఈ సందర్భంగా ప్రాంతీయ భాషల ప్రాముఖ్యతను గుర్తుచేస్తూ సుప్రీంకోర్టు నిర్ణయాన్ని ప్రస్తావించారు. "ప్రాంతీయ భాషల ప్రాముఖ్యత పెరుగుతోంది. మాతృభాషలో బోధనకు మా ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోంది. సుప్రీంకోర్టు కూడా తమ తీర్పు ప్రతులను ప్రాంతీయ భాషల్లోనూ అందుబాటులో ఉంచేందుకు నిర్ణయం తీసుకుంది. ఇందుకు సుప్రీంకోర్టుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నా" అని మోదీ సర్వోన్నత న్యాయస్థానంపై ప్రశంసలు కురిపించారు. ప్రధాని వ్యాఖ్యలకు అక్కడే ఉన్న సీజేఐ స్పందిస్తూ.. అభినందన పూర్వకంగా నమస్కారం చేశారు. సుప్రీంకోర్టులో తీర్పు ప్రతులు ఇక ప్రాంతీయ భాషల్లోనూ అందుబాటులో ఉంటాయని ఈ ఏడాది ఆరంభంలో సీజేఐ జస్టిస్ డి.వై చంద్రచూడ్ ప్రకటించిన విషయం తెలిసిందే. కృత్రిమ మేధ సాయంతో ఇంగ్లిష్‌లో ఉన్న తీర్పు కాపీలను ప్రాంతీయ భాషల్లోకి అనువదిస్తున్నారు. అలా ఇప్పటివరకు దాదాపు 9500 కాపీలను హిందీ సహా పలు భాషల్లోకి అనువదించారు. సుప్రీంకోర్టు ఇప్పటివరకు ఇచ్చిన దాదాపు 35వేల తీర్పు కాపీలను ఇతర భాషల్లోనూ అందుబాటులోకి తేవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు గతంలో సీజేఐ వెల్లడించారు. ప్రస్తుతం హిందీతో పాటు ఒడియా, గుజరాతీ, హిందీ, తెలుగు, అస్సామీ, పంజాబీ, నేపాలీ తదితర భాషల్లోకి అనువదిస్తున్నారు.




# ఏకధాటిగా 90 నిమిషాలు.. ప్రసంగంలో మోదీ సరికొత్త రికార్డ్

దిల్లీ: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా చారిత్రక ఎర్రకోట నుంచి వరుసగా పదేళ్లు మువ్వన్నెల జెండాను ఆవిష్కరించిన తొలి కాంగ్రెస్సేతర ప్రధానిగా నరేంద్రమోదీ నిలిచారు. మంగళవారం ఉదయం ఎర్రకోటపై జాతీయ జెండాను ఎగురవేసిన అనంతరం ప్రధాని మోదీ జాతినుద్దేశించి సుదీర్ఘ ప్రసంగం చేశారు. 90 నిమిషాల పాటు ఏకధాటిగా మాట్లాడిన ఆయన.. పంద్రాగస్టు ప్రసంగంలో సరికొత్త రికార్డు సృష్టించారు. ఇప్పటివరకు 10 సార్లు మో ప్రసంగించగా.. సగటు సమయం 82 నిమిషాలుగా ఉంది. దేశ చరిత్రలో ఇతర ప్రధానులు మాట్లాడిన సగటు ప్రసంగ సమయం కంటే ఇది ఎక్కువ కావడం విశేషం. 2014లో ప్రధానమంత్రిగా ఎర్రకోట నుంచి మోదీ తొలి ప్రసంగం చేసిన విషయం తెలిసిందే. ఆ ఏడాది 65 నిమిషాల పాటు ఆయన మాట్లాడారు. ఆ తర్వాత వరుసగా 86 నిమిషాలు (2015), 96 నిమిషాలు (2016), 56 నిమిషాలు (2017), 83 నిమిషాలు (2018), 92 నిమిషాలు (2019), 90 నిమిషాలు (2020), 88 నిమిషాలు (2021), 74 నిమిషాలు (2022) ప్రసంగించారు. ఈ ఏడాది కూడా 90 నిమిషాల పాటు సుదీర్ఘ ప్రసంగం చేశారు. మొత్తంగా ప్రధాని సగటు ప్రసంగం నిడివి 82 నిమిషాలు కాగా.. ఇప్పటివరకు ఏ ప్రధాని సగటుగా ఇంత సమయం ప్రసంగించలేదు. ప్రభుత్వ గణాంకాల ప్రకారం.. 1947లో దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ మొట్టమొదటి ప్రసంగం చేశారు. 24 నిమిషాల పాటు ఆయన మాట్లాడారు. ప్రధానిగా ఇప్పటివరకు అత్యధిక పంద్రాగస్టు ప్రసంగాలు చేసింది కూడా నెహ్రూనే. మొత్తంగా 17 సార్లు ఆయన స్వాత్రంత్య దినోత్సవం నాడు జాతినుద్దేశించి ప్రసంగించారు.

ఆ తర్వాత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ 16 సార్లు పంద్రాగస్టు నాడు మాట్లాడారు. 1972లో సుదీర్ఘంగా 54 నిమిషాలు ప్రసంగించారు. ఇక, మాజీ ప్రధాని ఐకే గుజ్రాల్ కేవలం ఒకే ఒక్కసారి ఎర్రకోట నుంచి ప్రసంగించారు. 1997లో ఆయన 71 నిమిషాల పాటు మాట్లాడారు. ప్రధాని మోదీ తర్వాత రెండో అత్యధిక సగటు ప్రసంగ సమయం ఈయనదే. మాజీ ప్రధానులు మన్మోహన్ సింగ్, అటల్ బిహారీ వాజ్‌పేయీ స్వల్ప ప్రసంగాలు చేశారు. 2012లో మన్మోహన్ సింగ్ 32 నిమిషాలు, 2013లో 35 నిమిషాలు మాట్లాడారు. వాజ్‌పేయీ 2002లో 25 నిమిషాలు, 2003లో 30 నిమిషాల పాటు ప్రసంగించారు.

# ఆ నిశ్శబ్ద శక్తే నడిపించింది: రాహుల్ గాంధీ

దిల్లీ: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్వాతంత్ర్య దినోత్సవం వేళ నెట్టింట్లో పోస్టు పెట్టారు. భరత మాత ప్రతిఒక్కరి స్వరమని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా భారత్ జోడో యాత్ర అనుభవాలను పంచుకున్నారు. ప్రజల ఆదరణతో అందిన నిశ్శబ్ద శక్తి తనకెంతో సహకరించిందన్నారు. 'బలం, బలహీనతతో సంబంధం లేకుండా భారత మాత.. ప్రతి భారతీయుడి గళం. ఆ గళంలో ఆనందం, భయం, బాధ అంతర్గతంగా దాగి ఉంటుంది.

ఈ భరత మాత గళం వినేప్పుడు నా సొంత గళం, నా సొంత ఆకాంక్షలను నిశ్శబ్దంగా ఉంచాను. వినయంగా, నిశ్శబ్దంగా ఉన్నప్పుడు మాత్రమే ఆ గళం వినిపిస్తుంది' అని అన్నారు. 'జోడో యాత్ర ప్రారంభంలో నా పాత గాయం తిరగబెట్టింది. మోకాలి నొప్పి ప్రారంభమైంది. కానీ నాతో కలిసి ప్రయాణించే వారి సంఖ్య పెరుగుతూ వచ్చింది. వారు అందించిన ఆదరణతో ఆ నొప్పి మటుమాయం అయింది. ప్రతిసారి ఆ యాత్రను ఆపేద్దామనుకున్నప్పుడల్లా.. ఎవరో ఒకరు వచ్చి నాలో కొత్త శక్తిని నింపేవారు. అలా నిశ్శబ్ద శక్తి నాకు సహకరించింది. చిమ్మచీకట్లు అలుముకున్న అడవిలో కాంతిని నింపే మిణుగురులవలే నాకు దోహదం చేసింది. ఈ క్రమంలో ఒకరోజు అంతులేని నిశ్శబ్దాన్ని అనుభవించాను. నా చేయి పట్టుకొని నడుస్తున్న వ్యక్తి మాట తప్ప నాకు మరో శబ్దం వినిపించలేదు' అని యాత్ర అనుభవాలను గుర్తు చేసుకున్నారు. గత ఏడాది సెప్టెంబర్‌లో కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు జోడో యాత్ర జరిగింది. అయితే



ఈ యాత్ర ముగియలేదని, మళ్లీ మొదలవుతుందని కాంగ్రెస్ నేతలు వెల్లడించారు. ఈసారి గుజరాత్ నుంచి మేఘాలయ వరకు ఉంటుందని చెప్పారు. ఇదిలా ఉంటే..ఇటీవల పార్లమెంట్‌లో భరత మాత పదాన్ని వాడుతూ రాహుల్ చేసిన వ్యాఖ్యలు విమర్శలకు దారితీసిన సంగతి తెలిసిందే. ఆ విమర్శలను తిప్పికొట్టేలా ఈ రోజున రాహుల్ సుదీర్ఘ సందేశాన్ని ఇచ్చారు.




# గద్దర్‌పై కాల్పుల ఘటనపై స్పందించిన చంద్రబాబు

హైదరాబాద్ : ఇటీవలే కన్నుమూసిన గద్దర్‌ను భయం అంటే ఏంటో తెలియని వ్యక్తిగా టీడీపీ అధినేత చంద్రబాబు అభివర్ణించారు. మంగళవారం గద్దర్ నివాసానికి వెళ్లి ఆయన కుటుంబ సభ్యులను చంద్రబాబు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1997లో గద్దర్‌పై కాల్పులు జరిగిన ఘటనపై స్పందించారు. కాల్పుల ఘటనకు సంబంధించి తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. కాల్పుల ఘటన తర్వాత గద్దర్.. తనతో అనేక సార్లు మాట్లాడారన్నారు. తన లక్ష్యం.. గద్దర్ లక్ష్యం ఒక్కటేనని.. పేదల హక్కుల పరిరక్షణే తమ ధ్యేయమని చంద్రబాబు అన్నారు. హైదరాబాద్ అభివృద్ధికి కారణం ఎవరో అందరికీ తెలుసన్నారు. హైదరాబాద్ అభివృద్ధి ఫలాలు తెలంగాణలో ప్రతి ఒక్కరకీ అందుతున్నాయని చంద్రబాబు అన్నారు. గద్దర్ ఎన్నో ప్రజా పోరాటాలకు నాంది పలికారన్నారు. తెలంగాణ ఉద్యమంలో గద్దర్ పాత్ర కీలకమన్నారు.

ప్రజాయుద్ధ నౌక పేరు వింటే గద్దర్ గుర్తొస్తారన్నారు. గద్దర్ జీవితం బావి తరాలకు ఆదర్శమని చంద్రబాబు అన్నారు.

# జగన్ దళితులకు మేనమామ కాదు.. కంసమామ.. దొంగమామ



అమరావతి: ప్రస్తుత ప్రభుత్వంలో రాష్ట్రంలో దళితులకు రక్షణ కరువైందని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య విమర్శలు గుప్పించారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో దళితులపై దాడులు విపరీతంగా పెరిగాయన్నారు. దళితులను చంపినా, నరికినా, శిరోముండనం చేసినా, అత్యాచారాలు చేస్తున్నా ఈ ప్రభుత్వానికి, సీఎంకు చీమ కుట్టినట్లు కూడా లేదని మండిపడ్డారు. జగన్ మౌనం.. పరోక్షంగా వీటిని ప్రోత్సహిస్తున్నారా? అనే అనుమానం కలుగుతోందన్నారు. దళితులపై జరుగుతున్న దాడుల గురించి పుంఖాను పుంఖానులుగా పత్రికల్లో వస్తున్నా చర్యలు శూన్యమన్నారు. దళితులపై దాడులు చేస్తే అవార్డులు, రివార్డులు ఏమైనా ఇస్తున్నారా అని అనుమానించాల్సి వస్తోందన్నారు. పట్టపగలే రాష్ట్రంలో దళిత మహిళలకు రక్షణ లేకుండాపోయిందని విమర్శించారు. ఒక్కసారైనా సీఎం.. డైరెక్టర్ జనరల్, పోలీసులు, కలెక్టర్లను పిలిచి దళితులపై దాడి చేస్తుంటే మీరేం చేస్తున్నారని ప్రశ్నించారా?.. సమీక్ష చేశారా? అని టీడీపీ నేత నిలదీశారు. అనంతపురం జిల్లా కల్యాణదుర్గం మండలం మాదిగ కులానికి చెందిన ఓ మహిళపై వైసీపీకి చెందిన ఐదుగురు సంవత్సరకాలంగా సామూహిక అత్యాచారం చేశారన్నారు. ఒక దళిత మహిళను సంవత్సర కాలంగా గ్యాంగ్ రేప్ చేస్తూ వస్తుంటే డీఎస్పీ, ఎస్ఐలు చిన్న కంప్లైంట్ అని చెప్పడం సిగ్గుచేటని ఆగ్రహం వ్యక్తం చేశారు.

స్వాతంత్య దినోత్సవం రోజున స్వాతంత్ర్యం కోల్పోయిన దళిత బిడ్డకు సీఎం న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. జగన్ దళితులకు మేనమామ కాదు.. కంసమామ.. దొంగమామ అంటూ విరుచుకుపడ్డారు. దళితులు కూడా వారి పట్ల రాష్ట్ర ప్రభుత్వ వ్యవహారశైలిని గమనించాలన్నారు. దళితులపై జరుగుతున్న దాడుల పట్ల ముఖ్యమంత్రి ఒక ప్రకటన చేయాలన్నారు. కల్యాణదుర్గం మహిళపై జరిగిన గ్యాంగ్ రేప్ సంఘటనపై పూర్తి విచారణ జరిపించి, నిందితులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్ఐ, డీఎస్పీలపై తగు చర్యలు తీసుకోవాలని వర్ల రామయ్య డిమాండ్ చేశారు.

## ‘కావాలా..’ అంటూ ఊరించిన లిస్టర్ గాయని

ఇటీవల విడుదలైన జైలర్‌లోని సూపర్‌హిట్ పాట కావాలా.. 111 మిలియన్ వ్యూస్ తో సంచలనమైంది. ముఖ్యంగా మిల్కీ బ్యూటీ తమన్నా స్టెప్పులకు యూత్ మాంచి జోష్ తో ఊగిసలాడింది. ఈ పాటకు యూట్యూబ్ సోషల్ మీడియాల్లో అనుకరణలు అంతే వైరల్ గా మారుతున్నాయి. కావాలా పెప్పీ నంబర్ బ్లాక్ బస్టర్ మూవీ జైలర్ కి అదనపు అస్సెట్ గా నిలిచింది. విజువల్ గా తమన్నా అందచందాలు డ్యాన్సులు యూత్ ని మత్తెక్కించాయి. ఇక ఈ పాట టోన్ లో హస్కీనెస్ కుర్రకారును మత్తులోకి దించింది అంటే అతిశయోక్తి కాదు. ఇంతకీ ఈ పాటను పాడిన గాయని ఎవరు? అన్నది ఆరా తీస్తే తెలిసిన సంగతులివి.. ఈ చార్ట్ బస్టర్ పాటకు శిల్పారావు గాయని. దీపికా పదుకొనే, ఐశ్వర్య రాయ్ బచ్చన్, కత్రినా కైఫ్ వంటి ఎ-లిస్టర్ స్టార్లకు గాత్రాన్ని అందించిన మేటి గాయని శిల్పారావు. తాను ఎప్పుడూ గ్రూవీ ట్రాక్ లాంటిది పాడలేదని ఆమె చెప్పింది. ఇది వేణువు శ్రావ్యత.. పెర్కషన్ వాయిద్యాల చప్పుడు లయలతో కోరిక గురించి చెప్పే సాహిత్యంతో పెప్పీ నంబర్. నాకు స్వరకర్త అనిరుధ్ రవిచందర్ నుండి కాల్ వచ్చినప్పుడు పాటకు ప్రత్యేకమైన స్వర సాంకేతిక శైలి కావాలని అడగడంతో నేను కొంచెం భయపడ్డాను అని గాయని శిల్పారావు తెలిపారు. కర్నాటక సంగీతంలో పాపులర్ తవిల్ బీట్‌లను ఈ పాటకు ఉపయోగించడం మరో హైలైట్. రికార్డింగ్‌కు ముందు రవిచందర్ షేర్ చేసిన వాయిస్ రికార్డింగ్‌లోని



ఎగ్జయిట్ చేసే అంశాలను అనుకరించడానికి కసరత్తు చేసాను. ఈ పాటకు దక్షిణ భారతీయ సంగీతంలో భిన్నమైన బీట్‌లను ఉపయోగించారు. వాటిని నేటి అభిరుచులకు అనుగుణంగా రీక్రియేట్ చేసారు అని శిల్పా చెప్పారు. దీకాలానికి అనుగుణంగా 2023లో శిల్పా పాటలన్నీ అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రాలలో ఉర్రూతలూగించినవే. ఆమె పఠాన్‌లో బేషరమ్ రంగ్‌తో ఈ సంవత్సరాన్ని ఘనంగా ప్రారంభించింది. ఆ తర్వాత పొన్నియన్ సెల్వన్ 2లో రువా రువా జరా హాట్కే జరా బచ్కే లో సాంఝా, రాకీ ఔర్ రాణి కియ్ ప్రేమ్ కహానీలో రో లైన్ డే వంటి పాపులర్ పాటల్ని ఆలపించారు. బాలీవుడ్‌లో ప్లేబ్యాక్ సింగింగ్ సీన్‌ను డామినేట్ చేసేంత మధురమైన స్వరం శిల్పాకు లేదని విన్న ఎవరికైనా తెలుస్తుంది. శిల్పాజీ గానం శైలి శాస్త్రీయమైనది. తన స్వరం గంభీరమైన గుణాన్ని కలిగి ఉంది. పెప్పీ పాటలకు కూడా ఆధ్యాత్మిక టచ్ ఇస్తుంది. పాట మంచి సాహిత్య విలువను కలిగి ఉంటే.. దాని శ్రావ్యత స్థానం ఉత్తమ మార్గాన్ని కనుగొంటుంది! అని శిల్పారావు చెప్పారు. వో అజ్నాబీ (రైలు), ముడి ముది ఇత్తెఫాక్ సే (పా), ఇష్క్ షావా (జబ్ తక్ హై జాన్), మలాంగ్ (ధూమ్ 3), మన్మర్జియాన్ (లూటేరా), ఘుంగ్రూ (యుద్ధం) , బుల్లెయా (ఏ దిల్ హై ముష్కిల్) శిల్పాజీ పాడిన ఇతర పాపులర్ నంబర్‌లలో కొన్ని. 39 ఏళ్ల ఆమె అన్వర్ (2007)లో తోసే నైనా.. పాటతో తన కెరీర్‌ను ప్రారంభించింది. కానీ తెలుగు, పంజాబీ, మలయాళం, తమిళం, బెంగాలీ మరియు గుజరాతీ సహా పలు భాషల్లో పాడటం ప్రారంభించింది. ప్రతి భాషకు దాని పదాలకు ఒక నిర్దిష్ట లయ రసాస్వాదన ఉంటుంది. దానిని అర్థం చేసుకోవడం కీలకం అని ఆమె చెప్పింది. ఈ ఆలోచనా విధానం తనకు కావలా..తో ప్రకంపనలను సృష్టించేందుకు సహాయపడిందని శిల్పా చెప్పారు.

## సీతారామం కొనసాగిస్తారా..?

హను రాఘవపూడి డైరెక్షన్ లో దుల్కర్ సల్మాన్, మృణాల్ ఠాకూర్ లీడ్ రోల్ లో వచ్చిన సినిమా సీతారామం. 2022 ఏడాది క్రితం రిలీజైన ఈ సినిమా మరోసారి వైజయంతి బ్యానర్ వ్యాల్యూని నిలబెట్టింది. వైజయంతి మూవీస్ బ్యానర్ లో అశ్వనిదత్, స్వప్న, ప్రియాంకా దత్ లు ఈ సినిమా నిర్మించారు. అప్పటికే మహానటితో హిట్ అందుకున్న దుల్కర్ తో సీతారామం సినిమా చేశారు ఈ నిర్మాతలు. మహానటి సినిమా కూడా ఈ నిర్మాణ సంస్థ నుంచే వచ్చింది. ఆ నమ్మకంతోనే దుల్కర్ మీద మరోసారి పాతిక కోట్ల పైన బెట్ పెట్టారు అశ్వనిదత్. డైరెక్టర్ హను రాఘవపూడి కూడా సక్సెస్ లో ఉన్న డైరెక్టర్ కూడా కాదు అయినా కూడా సినిమా కథ మీద ఉన్న నమ్మకంతో సినిమాకు భారీ బడ్జెట్ కేటాయించారు. ఈ సినిమాతోనే మృణాల్ ఠాకూర్ తెలుగు తెరకు పరిచయమైంది. బాలీవుడ్ లో సీరియల్స్ చేస్తూ వచ్చి సినిమా ఛాన్స్ లు అందుకున్న ఆమె హృతిక్ రోషన్ సూపర్ 30లో నటించి మెప్పించింది. ఆ సినిమాలో మృణాల్ ని చూసే హనుకి సీతారామం లో సీత ఆమె అయితేనే పర్ఫెక్ట్ అని



ఫిక్స్ చేశారు. సీతారామం సినిమా ఏ ముహూర్తాన ఒప్పుకుందో కానీ మృణాల్ ఫేట్ మారిపోయిందని చెప్పొచ్చు. వరుస సినిమాలతో ఇటు తెలుగు అటు హిందీలో అదరగొట్టేస్తుంది మృణాల్. సీతారామం హిట్ తర్వాత ఈ సినిమా కథని కొనసాగించేలా హనుకి ఒక ఆలోచన ఉందట. అయితే అది ఇప్పుడప్పుడే మెటీరియలైజ్ అవ్వదు కానీ కొంత టైం తీసుకున్నా సరే కచ్చితంగా సీతారామం సినిమా కొనసాగింపు ఉంటుందని అది కూడా నెక్స్ట్ లెవెల్ లో ఉండబోతుందని హను రాఘవపుడి ఒకానొక సందర్భంలో చెప్పారు. సీతారామం పార్ట్ 2 కూడా ఉంటే ఆ సినిమాను ఇష్టపడే ఫ్యాన్స్ కి పండుగే అని చెప్పొచ్చు. ఆల్రెడీ మహానటితో తెలుగులో మంచి మార్కెట్ ఏర్పరచుకున్న దుల్కర్ సల్మాన్ సీతారామం హిట్ తో ఇక్కడ స్టార్ క్రేజ్ తెచ్చుకున్నాడు. తెలుగులో తనకు అన్ని సాఫ్ట్ క్యారెక్టర్స్ మాత్రమే ఇస్తున్నారు అని కింగ్ ఆఫ్ కోట అనే మాస్ సినిమాతో వస్తున్నారు దుల్కర్ సల్మాన్. ఆ సినిమా దుల్కర్ నుంచి వస్తున్న తొలి పాన్ ఇండియా సినిమా అని చెప్పొచ్చు. ఇదే కాదు తెలుగులో కూడా ఒకటి రెండు కథలు దుల్కర్ తో చర్చలు జరుగుతున్నాయట.




## మహేశ్ కోసం రూ.4కోట్ల భారీ సెట్



సూపర్ స్టార్ మహేశ్ బాబు హీరోగా మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న సినిమా గుంటూరు కారం. భారీ బడ్జెట్‌తో కంప్లీట్ మాస్ యాక్షన్ ఎంటర్టైనర్?గా ఈ సినిమా రాబోతుంది. అయితే ఈ సినిమా మొదటి నుంచి కష్టాలను ఎదుర్కొంటున్న సంగతి తెలిసిందే. సినిమాలోని నటీనటులు, టెక్నిషియన్స్.. బిగ్‌బాస్ హౌస్ కెంటెస్టెంట్ తరహాలో ఒక్కొక్కరుగా ఎలిమినేట్? అవుతూ వస్తున్నారు. దీంతో మూవీ షూటింగ్ బ్రేక్ పడుతూ వస్తోంది. అయితే తాజాగా ఈ సినిమా షూటింగ్ ఎట్టకేలకు ప్రారంభం కానుందని తెలిసింది. ఫ్యామిలీతో కలిసి రెండు వారాల క్రితం ఫారెన్ టూర్‌లో మహేశ్ బాబు? తిరిగి వచ్చేస్తున్నారట. దీంతో ఆగస్ట్ 16నుంచి కొత్త షెడ్యూల్ ప్రారంభించేందుకు మూవీటీమ్ సన్నాహాలు చేస్తున్నారని సమాచారం అందింది. మహేశ్ రాగానే సెట్స్?లో జాయిన్ అవ్వనున్నారు. అలాగే ఇటీవలే సినిమాటోగ్రాఫర్ పీఎస్ వినోద్ తప్పుకున్నట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. దీంతో కొత్త సినిమాటోగ్రాఫర్‌గా బాధ్యతలు ఎవరు తీసుకుంటారా అని ఆసక్తి మొదలైంది. తాజాగా దీనిపై కూడా ఓ క్లారిటీ వచ్చింది. పీఎస్ వినోద్ స్థానంలో మనోజ్ పరమహంస కొత్త సినిమాటోగ్రాఫర్‌గా వ్యవహరించనున్నారని సమాచారం. ఆగస్ట్? 16న ఈయనతో షూటింగ్ చేయబోతున్నారట. మరో ఆసక్తికర విషయమేమిటంటే.. సాధరణంగా త్రివిక్రమ్ సినిమా అంటే సెట్స్? ఎంత క్లాస్ అండ్ కాస్ట్లీగా ఉంటాయో తెలిసిన విషయమే. ఇప్పుడు ఈ కొత్త షెడ్యూల్ కోసం ఓ స్పెషల్ సెట్ వేయబోతున్నారట. ఓ ప్రైవేట్ స్టూడియోను అద్దెకు తీసుకుని అందులో దాదాపు రూ.4కోట్లు ఖర్చు పెట్టి మరీ భారీ సెట్ నిర్మించబోతున్నట్లు తెలిసింది. ఎంతో ప్రత్యేకంగా ఈ సెట్?ను తీర్చిదిద్దుతున్నారట. ఇందులోనే కొత్త షెడ్యూల్ చిత్రకరించనున్నారని సమాచారం అందింది. ఇకపోతే ఈ సినిమాలో హీరోయిన్లుగా శ్రీలీల, మీనాక్షి చౌదరి నటిస్తున్నారు. ఈ ఇద్దరితో పాటు సినిమాలోని ఇతర కీలక పాత్రలపై ఈ కొత్త షెడ్యూల్?లో చిత్రీకరణ జరపనున్నారట. తమన్ సినిమకు స్వరాలు సమకూరుస్తున్నారు. ఇప్పటికే రీసెంట్‌గా మహేశ్ పుట్టినరోజు సందర్భంగా విడుదలైన రెండు కొత్త మాస్? పోస్టర్లు మహేశ్ అభిమానులను బాగా ఆకట్టుకున్నాయి. సినిమాను హారిక అండ్ హాసిని క్రియేషన్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు.

## లియో కోసమైనా విజయ్ తెలుగు ప్రమోషన్స్ చేస్తాడా..?




కోలీవుడ్ స్టార్ హీరో దళపతి విజయ్ లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో చేస్తున్న సినిమా లియో. ఈ సినిమాను లలిత్ కుమార్ భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. కమల్ విక్రం తో బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్న లోకేష్ కనగరాజ్ విజయ్ తో అంతకుమించి హిట్ కొట్టాలని చూస్తున్నాడు. లియో గ్లింప్స్ ఇప్పటికే ఫ్యాన్స్ కి సూపర్ ట్రీట్ అందించగా సినిమా తప్పకుండా విజయ్ కెరీర్ లో బిగ్గెస్ట్ హిట్ అవుతుందని అంటున్నారు. మామూలుగానే దళపతి విజయ్ తన ప్రతి సినిమాతో తన రికార్డ్ తానే బ్రేక్ చేసుకుంటూ వెళ్తుంటాడు. ఆయన సినిమా యావరేజ్ టాక్ వచ్చినా సరే కోలీవుడ్ లో హిట్ సినిమా వసూళ్లను రాబడుతుంది. ఇక బ్లాక్ బస్టర్ టాక్ వస్తే మాత్రం వసూళ్ల మోత మోగాల్సిందే. తమిళంలోనే కాదు తెలుగు రెండు రాష్ట్రాల్లో కూడా విజయ్ సినిమాలకు మంచి మార్కెట్ ఉంది. ఇక్కడ కూడా ఆయన సినిమాలు మంచి ఫలితాలు అందుకుంటున్నాయి. అయితే విజయ్ తను నటించిన ప్రతి సినిమా తెలుగులో డబ్ చేసి రిలీజ్ చేస్తాడు కానీ ఒక్క సినిమా ప్రమోషన్స్ కి కూడా ఇక్కడకు రాలేదు. అప్పుడెప్పుడే మురుగదాస్ తుపాకి సినిమాకు హైదరాబాద్ వచ్చి ప్రమోట్ చేశాడు. ఆ తర్వాత చాలా సినిమాలు తెలుగులో రిలీజై మంచి హిట్ అందుకున్నా తెలుగు ప్రమోషన్స్ కి దూరంగా ఉంటూ వచ్చారు. ఈ ఇయర్ వచ్చిన వారిసు సినిమా తెలుగు దర్శకుడు, తెలుగు నిర్మాత చేశారు. కానీ ఆ సినిమా తెలుగు వెర్షన్ రిలీజ్ టైం లో కూడా విజయ్ ఇక్కడకు రాలేదు. ఇక్కడ మార్కెట్ అయితే కావాలి కానీ మన దగ్గరకు ప్రమోషన్స్ కు మాత్రం విజయ్ రావట్లేదని తెలుగు ఆడియన్స్ అసంతృప్తిగా ఉన్నారు. అయితే ఈ పరిస్థితి గమనించిన విజయ్ లియో సినిమాకు తెలుగు ప్రమోషన్స్ కూడా చేయాలని చూస్తున్నారు. లోకేష్ డైరెక్ట్ చేసిన ఖైదీ, విక్రం, మాస్టర్ సినిమాలు అన్నీ తెలుగులో మంచి ఫలితాలు అందుకున్నాయి. అలాంటి లోకేష్ డైరెక్ట్ చేస్తున్న లియో సినిమాకు తెలుగులో క్రేజ్ తెచ్చేందుకు దళపతి విజయ్ తెలుగు రాష్ట్రాల్లో కూడా ప్రమోషన్స్ ప్లాన్ చేస్తున్నారట.

బాలీవుడ్ హీరోలు కూడా తమ సినిమా తెలుగు డబ్బింగ్ వెర్షన్ ఇక్కడ రిలీజ్ అవుతుంటే హైదరాబాద్ లో ఈవెంట్ ఫిక్స్ చేస్తున్నారు. మిగతా తమిళ హీరోలైన రజిని, కమల్ సినిమాలకు ఇక్కడ ఈవెంట్స్ చేస్తున్నారు. కానీ విజయ్ ఆ విషయంలో ఎందుకో ఆసక్తిగా లేరు కానీ లియోకి మాత్రం ఈసారి విజయ్ ని తీసుకొచ్చే ప్లానింగ్ లో ఉన్నారు మేకర్స్.

## వరుణ్ ‘మట్కా’.. నోరా ఫతేహి ఛార్జ్? ఎంతంటే?

మెగా హీరో వరుణ్ తేజ్ హీరోగా ‘పలాస’ ఫేమ్ కరుణ కుమార్ దర్శకత్వంలో ఓ సినిమా చేయనున్న సంగతి తెలిసిందే. పీరియాడిక్ డ్రామాగా రానున్న ఈ చిత్రం మట్కా పేరుతో ఇది రూపొందనుంది. అయితే ఈ సినిమాలో బాలీవుడ్ బ్యూటీ యాక్టర్, డ్యాన్సర్ నోరా ఫతేహి కూడా నటిస్తోందని ఈ మధ్య వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. అయితే ఇది నిజమే. ఈ చిత్రంలో ఆమె నటిస్తోంది. సినిమాలోని ఓ ప్రత్యేక పాత్రలో నోరా నటించనుందట. అలాగే ఓ స్పెషల్ సాంగ్?లో ఆమె కనిపించనుందట. తాజాగా ఈ పాట కోసం ఆమె ఎంత మొత్తంలో తీసుకుంటుందో వివరాలు బయటకు వచ్చాయి. ఈ సాంగ్ కోసం ఆమె ఏకంగా రూ.30లక్షలు రెమ్యునరేషన్ తీసుకోబోతుందని తెలిసింది. ప్రస్తుతం ఈ విషయం నెట్టింట్లో చక్కర్లు



కొడుతోంది. ఇంకా ఈ సినిమాలో హీరోయిన్‌గా మీనాక్షి చౌదరి పేరు కూడా వినిపిస్తోంది. ఇకపోతే ఈ ముద్దుగుమ్మ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. బెల్లీ డ్యాన్స్‌కు ఈమె స్పెషాలిటీ. గతంలోనూ ఈమె పలు తెలుగు చిత్రాల్లో తన డ్యాన్స్‌తో ఆకట్టుకుంది. టెంపర్, కిక్ 2, షేర్, లోఫర్, బాహుబలి వంటి చిత్రాల్లో నటించింది. అయితే ఇందులో లోఫర్ వరుణ్ తేజ్ సినిమానే. ఇందులో నోరా ఫతేహి నొక్కే దోచేయ్ అనే స్పెషల్ సాంగ్‌లో చిందులేసింది. ఇప్పుడు మట్కా కోసం రెండో సారి వరుణ్‌తేజ్‌తో కలిసి కనిపించబోతుంది. ఇంకా నోరాఫతేహి.. దర్శకుడు క్రిష్.. పవన్ కళ్యాణ్ హీరోగా తెరకెక్కుతోన్న ‘హరిహర వీరమల్లు’ సినిమాలోనూ నటిస్తోంది. ఈ చిత్రంలో నోరా మహారాణి పాత్రలో కనిపించనుందట. ఔరంగా జేబు చెల్లెలు పాత్రలో ఆమె కనిపించనుందని తెలిసింది. మొదట ఆ పాత్ర కోసం జాక్వెలిన్ ఫెర్నాండెజ్?ను తీసుకోగా అనుకోని కారణాల వల్ల.. ఆమె స్థానంలో నోరాను తీసుకున్నారు. పవన్ కళ్యాణ్ పాత్రకు ఆమె స్నేహితురాలిగా నటించనుంది. ప్రస్తుతం నోరా.. వరుణ్? తేజ్ మట్కాకో పాటు 100 పర్సెంట్, మడ్గాన్ ఎక్స్‌ప్రెస్, డ్యాన్సింగ్ డ్యాడ్ చిత్రాల్లోనూ నటిస్తోంది. వెబ్‌సిరీస్ టెలివిజన్ రియాలిటీ షోస్?లోనూ కనిపిస్తోంది. ప్రస్తుతం ‘హిప్ హాప్ ఇండియా’ సీజన్ 1కు జడ్జిగా వ్యవహరిస్తోంది.

## అమలా పాల్ ఏం చేసినా లాభం ఉండట్లేదు..!

ఒకప్పుడు కోలీవుడ్ లో సూపర్ ఫాంలో ఉన్న అమలా పాల్ డైరెక్టర్ విజయ్ తో పెళ్లి డైవర్స్ మ్యాటర్ తో అమ్మడి ఫాం పూర్తిగా కోల్పోయింది. ఇప్పుడంటే పెళ్లైన హీరోయిన్స్ కి డిమాండ్ తగ్గలేదు కానీ ఆమె డైవర్స్ తీసుకున్న టైం లో అది కూడా వివాదాలతో కూడిన డైవర్స్ చేసుకోవడం వల్ల అది ఆమె కెరీర్ మీద ఎఫెక్ట్ పడేలా చేసింది. పెళ్లికి ముందు స్టార్ ఛాన్స్ లు అందుకున్న అమలా పాల్ ఆఫ్టర్ డైవర్స్ అరకొర అవకాశాలే అందుకుంది. అయితే వచ్చిన ప్రతి చిన్న అవకాశాన్ని వాడుకోవాలని చూసిన అమలా పాల్ తన మార్క్ చూపించడంలో వెనకబడింది. అమలా పాల్ సెకండ్ ఇన్నింగ్స్ అంత సంతృప్తిగా లేదని చెప్పొచ్చు. ఆమె చేస్తున్న సినిమాలేవి ఆశించిన ఫలితాలను అందుకోలేదు. సినిమాలే కాదు వెబ్ సీరీస్ లతో కూడా అమలా పాల్ ఆకట్టుకునే ప్రయత్నం చేసినా అది కూడా వర్క్ అవుట్



అవలేదు. అంతకుముందు కుడి ఎడమైతే సీరీస్ తో పర్వాలేదు అనిపించుకున్న అమలా పాల్ రీసెంట్ గా కడవర్ సినిమాతో కూడా సక్సెస్ అందుకుంది. ప్రస్తుతం తమిళ, హిందీ, మలయాళ భాషల్లో తనకు వచ్చిన అవకాశాలను చేస్తుంది అమ్మడు. ఇక మరోపక్క తన ఫోటో షూట్స్ తో కూడా ఫాలోవర్స్ ని ఎట్రాక్ట్ చేసే పనిలో ఉంది అమలా పాల్. ఆమె చేస్తున్న ఈ ఫోటో షూట్స్ వల్ల అమ్మడికి మంచి మైలేజ్ వస్తాయని అనుకున్నా అవి కూడా పెద్దగా అవకాశాలు తీసుకు రాలేకపోతున్నాయి. తెలుగులో అమలా పాల్ ని ఫాలో అయ్యే ఫ్యాన్స్ ఉన్నారు. టాలీవుడ్ లో చరణ్ తో ఒక సినిమా నాగ చైతన్యతో మరో సినిమా చేసిన అమలా పాల్ ఆ రెండు సినిమాలతోనే మంచి ఫాలోయింగ్ ఏర్పరచుకుంది. తెలుగులో కొనసాగించే ఆలోచన లేని అమలా పాల్ తమిళ సినిమాలనే చేస్తూ వచ్చింది. పర్సనల్ లైఫ్ లో జరిగే విషయాల పట్ల కథానాయికల కెరీర్ ఎఫెక్ట్ అవుతుంది అని అమలా పాల్ లైఫ్ చూస్తే అర్ధమవుతుంది. ఇప్పటికీ ఆడియన్స్ లో తన ఐడెంటిటీని కాపాడుకునేందుకు అమలా పాల్ చాలా ప్రయత్నాలు చేస్తుంది కానీ అవేవి పెద్దగా లాభం చేయట్లేదు. అమలా పాల్ చేస్తున్న ఫోటో షూట్స్ అయితే ఆమె ఫాలోవర్స్ ని మాత్రం ఎంజాయ్ చేసేలా చేస్తున్నాయి. ఈ ఇయర్ మలయాళం లో రెండు సినిమాలు చేస్తున్న అమలా పాల్ సౌత్ లో మరిన్ని ఆఫర్స్ కోసం తెగ ప్రయత్నాలు చేస్తుంది.




# అనతికాలంలోనే తిరుగులేని విజయాలు సాధించాం: కేసీఆర్

హైదరాబాద్: గతంలో రాష్ట్రంలో ఎటు చూసినా ఆకలి కేకలు.. ఆత్మహత్యలు ఉండేవని.. విధ్వంసమైన తెలంగాణను విజయపథం వైపు నడిపించామని సీఎం కేసీఆర్ అన్నారు. అనతికాలంలోనే రాష్ట్రం తిరుగులేని విజయాలు సాధించిందని చెప్పారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గోల్కొండ కోటపై జాతీయ పతాకాన్ని సీఎం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. "తెలంగాణ ఆచరిస్తోంది.. దేశం అనుసరిస్తోందనే పేరు తెచ్చాం. రాష్ట్రంలో నేడు విద్యుత్ వెలుగులు కనిపిస్తున్నాయి. పంటకాలువలు.. పచ్చని చేలతో తెలంగాణ కళకళలాడుతోంది. కాళేశ్వరం జీవధారలతో సస్యశ్యామలం అవుతోంది. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు పెద్ద అవరోధం తొలగిపోయింది. సత్వరమే సాగునీటి కాల్వల నిర్మాణాన్ని ప్రారంభిస్తున్నాం. అతి త్వరలోనే ఈ ప్రాజెక్టును పూర్తిచేస్తాం. పాలమూరు, రంగారెడ్డి జిల్లాలు పచ్చని పైరులతో కళకళలాడుతాయి. రాష్ట్ర ప్రజలు సంపూర్ణ ఆశీర్వాదాన్ని ఇలాగే అందించాలి.

**రెండు దశల్లో రూ.37వేల కోట్ల రుణమాఫీ చేశాం :** తలసరి ఆదాయం, విద్యుత్తు వినియోగంలో రాష్ట్రం నంబర్ వన్‌గా ఉంది. విద్యుత్ రంగంలో రాష్ట్రానికి స్ఫూర్తిదాయక విజయగాథ. గత నెలలో అసాధారణ స్థాయిలో భారీ వర్షాలు కురిశాయి. ప్రభుత్వం ఎప్పటికప్పుడు సహాయ చర్యలు చేపట్టింది. తక్షణ చర్యలకు రూ.500 కోట్లు విడుదల చేశాం. రైతుల సంక్షేమం వర్ధిల్లుతున్న రాష్ట్రంగా దేశానికి తెలంగాణ ఆదర్శం. రెండు దశల్లో దాదాపు రూ.37వేల కోట్ల రుణమాఫీ చేశాం. రైతులకు ఈ తరహాలో రుణ విముక్తులను చేసిన ప్రభుత్వం మరొకటి లేదు. చేనేత కార్మికుల కోసం మరో కొత్త పథకం అమలుకు నిర్ణయించాం. చేనేత గుంట మగ్గాల స్థానంలో ఫ్రేమ్ మగ్గాలు అందిస్తాం.

**సంకుచిత శక్తులు ఆర్టీసీ బిల్లును అడ్డుకునేందుకు యత్నించాయి :** ప్రభుత్వానికి ప్రజల్లో ఉన్న ఆదరణ చూసి కొందరు ఆందోళన చెందుతున్నారు. సంకుచిత శక్తులు ఆర్టీసీ బిల్లును అడ్డుకునేందుకు విఫల ప్రయత్నాలు చేశాయి. ఆ శక్తుల ప్రయత్నాలను వమ్ము చేస్తూ ఆర్టీసీ బిల్లును ఆమోదించాం.

బిల్లు ఆమోదంతో ఆ ఉద్యోగుల కుటుంబాల్లో ఆనందం నిండింది. సాగునీటి రంగంలో స్వర్ణయుగం సృష్టించాం. కొందరు అల్పబుద్ధితో రైతు సంక్షేమ చర్యలకు వక్రభాష్యాలు చెబుతున్నారు. సాగుకు 3 గంటల విద్యుత్ చాలని విపరీత వ్యాఖ్యలు చేస్తున్నారు. వారికి రైతు వ్యతిరేక వైఖరికి ప్రజలే తగిన జవాబు చెబుతారు. 'పాలమూరు-రంగారెడ్డి'ని అడ్డుకునేందుకు విపక్ష నేతలు యత్నించారు. ఎన్జీటీలో కేసులు వేసి వికృత మనస్తత్వం బయట పెట్టుకున్నారు. విద్రోహ మనస్తత్వంతో విపక్షాలు పెట్టిన కేసులు వీగిపోయాయి.

**సింగరేణి కార్మికులకు దసరా, దీపావళి బోనస్ రూ.1000 కోట్లు :** త్వరలోనే కొత్త పీఆర్సీ నియమించి ఉద్యోగుల వేతనాలు పెంచుతాం. అప్పటి వరకు మధ్యంతర భృతి చెల్లిస్తామని స్వయంగా ప్రకటించాను. సింగరేణి కార్మికులకు దసరా, దీపావళి బోనస్‌గా రూ.వెయ్యికోట్లు పంపిణీ చేస్తాం. వచ్చే 3-4 ఏళ్లలో మెట్రో రైల్ విస్తరణ పూర్తిచేయాలని నిర్ణయించాం. కొత్త ప్రతిపాదనలతో హైదరాబాద్‌లో 415 కి.మీ. మెట్రో సౌకర్యం రానుంది.
రూ.2.51లక్షల కోట్ల పెట్టుబడులతో రాష్ట్రానికి కొత్త పరిశ్రమలు వచ్చాయి. ఈ 9 ఏళ్లలో పారిశ్రామిక రంగంలో 17.21లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభించాయి"అని కేసీఆర్ వివరించారు.



# గోల్కొండ కోటపై జాతీయ జెండా ఎగురవేసిన సీఎం కేసీఆర్

హైదరాబాద్ : గోల్కొండ కోటపై జాతీయ జెండా రెపరెపలాడింది. 77వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కోటలోని రాణిమహల్ ప్రాంగణంలో సీఎం కేసీఆర్ జాతీయ జెండాను ఎగురవేశారు. అంతకుముందు కేసీఆర్ పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్ నుంచి గోల్కొండకు చేరుకున్న సీఎం కేసీఆర్‌కు.. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, డీజీపీ అంజనీ కుమార్, హైదరాబాద్ పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్, కళాకారులు ఘన స్వాగతం పలికారు. అంతకుముందు ముఖ్యమంత్రి కేసీఆర్.. సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో ఉన్న సైనిక వీరుల స్మారకం వద్ద అమరజవాన్లకు నివాళులర్పించారు.

# సిద్దిపేట ఐటీ టవర్‌లో 1500 ఉద్యోగాలు వచ్చేలా కృషి చేస్తా : మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేట : సిద్దిపేటకు ఐటీ టవర్ రావాలన్నది నా కల.. ఇవాళ ఆ కల నిజంగా కళ్లకు కనబడుతున్నది అని రాష్ట్ర ఆర్థిక మంత్రి హరీశ్‌రావు తెలిపారు. ఒక ప్రజాప్రతినిధి ప్రజల ఆకాంక్షలు అమలు చేస్తుంటే ఆ ప్రజాప్రతినిధికి మరింత శక్తి వస్తుందన్నారు. జిల్లా కేంద్రమైన సిద్దిపేట శివారులో ఉన్న ఐటీ టవర్‌లో ఎమ్మెల్యే సతీశ్, ఎమ్మెల్సీ రఘోత్తం రెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, అడిషనల్ కలెక్టర్ గరిమా అగ్రవాల్‌లతో కలిసి సిద్దిపేట హబ్ ఐటీ వెబ్ సైట్‌ను హరీశ్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఈ ఐటీ టవర్ ద్వారా 1500 మందికి ఉద్యోగాలు వచ్చేలా కృషి చేస్తానని తెలిపారు. ఫేజ్-1 పూర్తికాగానే ఫేజ్-2 ప్రారంభిస్తామని పేర్కొన్నారు. ఐటీ టవర్‌లో టాస్క్ ద్వారా శిక్షణ తరగతులు బాగా జరుగుతున్నాయని వివరించారు.

సిద్దిపేటలో సొంతంగా ఐటీ టవర్ పెట్టాలని అనుకునే వారికి కావాల్సిన మౌలిక సదుపాయాల కల్పనతో పాటు కావాల్సిన అనువైన స్థలాన్ని ఇస్తామని ఐటీ పారిశ్రామిక వేత్తలు ముందుకు రావాలని పిలుపు నిచ్చారు. డిగ్రీ ఫైనల్ ఇయర్ చదివే విద్యార్థులు, ఫ్రెషర్స్ టాస్క్‌లో చేరి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ మేరకు ఇటీవల 7 కంపెనీలు నిర్వహించిన జాబ్ మేళాలో ఎంపికైన



ఉద్యోగులకు జాబ్ ఆఫర్ లెటర్స్ అందించారు. అంతకు ముందు ఐటీ కంపెనీ నిర్వాహకులు మాట్లాడుతూ.. 18 కంపనీలకు ఎంపికైన ఉద్యోగులకు టాస్క్ ఆధ్వర్యంలో శిక్షణ కొనసాగుతున్నట్లు తెలిపారు.

అక్టోబర్ నెలలోపు వెయ్యి మంది ఈ ఐటీ టవర్‌లో ఉద్యోగులుగా ఉంటారని పేర్కొన్నారు. కాగా న్యూజెర్సీ బేస్డ్, బెంగళూరు, చెన్నై బేస్డ్ ప్రముఖ కంపెనీల ప్రతినిధులు సిద్దిపేట యువతలో చాలా టాలెంట్ ఉన్నదని, తమ కంపెనీల్లో మరికొంత మందికి ఉద్యోగ అవకాశాలు ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు.

# అక్కడ నుంచే ఎన్నికల ప్రచారం.. నన్ను మళ్లీ ఆశీర్వదించండి



రాజన్న సిరిసిల్ల జిల్లా: తంగళ్లపల్లి మండలం సారంపల్లిలో సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహాన్ని మంత్రి కేటీఆర్ ఆవిష్కరించారు. గౌడ కమ్యూనిటీ హాల్‌ను మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. "తంగళ్లపల్లి మండలం సారంపల్లి నుంచే ఎన్నికల ప్రచారం ప్రారంభించాను. నన్ను మళ్లీ ఆశీర్వదించండి. నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిపించారు. కడుపులో పెట్టుకొని చూసుకోండి. నన్ను గెలిపిస్తే మంచి పనులు అన్నగా తమ్మునిగా చేస్తా. కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అయితే రాష్ట్రం మరింత అభివృద్ధి సాధిస్తుంది." అని మంత్రి కేటీఆర్ అన్నారు.

# స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఏకిపారేసిన షర్మిల

హైదరాబాద్: వైఎస్సార్ తెలంగాణ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో 77వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం షర్మిల మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రజలకు, భారత పౌరులందరికీ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. భిన్నత్వంలో ఏకత్వం భారత దేశ గొప్పదనమన్నారు. ఎన్నో కులాలు, మతాలు, ఎన్నో భాషలు ఇదే భారత దేశ సంపద అని చెప్పుకొచ్చారు. కేంద్ర ప్రభుత్వం వైఖరి భిన్నత్వంలో ఏకత్వాన్ని కాపాడే విధంగా లేకపోగా డివైడ్ అండ్ రూల్ అనే పద్ధతిలో బ్రిటిష్ వాళ్లు అనుసరించిన విధంగా సాగుతోందని విమర్శించారు. ఇటీవల మణిపూర్‌లో జరిగిన ఘటనలు భరతమాతకే అవమానమన్నారు. నెలల తరబడి లా అండ్ ఆర్డర్ నశించిపోయిందన్నారు. పోలీస్ స్టేషన్‌ల మీద దాడులు చేసి 3 వేల ఆయుధాలు దోపిడీ చేసి, 6 లక్షల రౌండ్స్ ఆఫ్ అమ్యునిషన్స్ దోపిడీ చేసి సామాన్య ప్రజల మధ్య భీభత్సాన్ని సృష్టించారని మండిపడ్డారు. లా అండ్ ఆర్డర్ కాపాడాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిది కాదా? అని ప్రశ్నించారు. 60 వేల మంది నిర్వాసితులయ్యారని.. 222 చర్చిలను ధ్వంసం చేశారని.. మహిళలను రేప్ చేశారని.. ఇద్దరు మహిళలను నగ్నంగా పరేడ్ చేశారని.. ఇది భారత దేశం అవమానంతో తలదించుకునే సందర్భం కాదా? అంటూ నిలదీశారు. మతం పేరుతో కేంద్రం రాజకీయాలు చేయడం మానేసుకోవాలి... మతం పేరుతో చిచ్చు పెట్టడం ఆ మంటలో చలి కాచుకోవడం బీజేపీ పార్టీకి అలవాటుగా మారిందన్నారు. కేంద్ర ప్రభుత్వం తీరు మారాలని హితవుపలికారు. ఒక మహిళ అర్ధరాత్రి స్వేచ్ఛగా తిరగగలిగినప్పుడే నిజమైన స్వాతంత్ర్యం అని మహాత్మ గాంధీ గారు అన్నారని.. అయితే ఈరోజు ఆ పరిస్థితి ఉందా? అని అడిగారు. మణిపూర్‌లో నేటికీ అత్యాచారాలు, మతం పేరుతో గొడవలు అలాగే కొనసాగుతున్నాయన్నారు. ఇంటర్ నెట్‌ను బంద్ చేసి మరీ ఆ గొడవలకు, లూటీకి పాల్పడుతున్నారంటే మరి కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించక ఎవరిని ప్రశ్నించాలని అన్నారు. భారత దేశ ప్రజలు ఏం చేయాలని షర్మిల నిలదీశారు.

# తెలంగాణ అభివృద్ధిపై దేశమంతా విస్తృత చర్చ : ముఖ్యమంత్రి కేసీఆర్

హైదరాబాద్: పరిశ్రమలకు అనుమతి మంజూరు ప్రక్రియలో అలసత్వానికి, అవినీతికి అవకాశం లేకుండా తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన టీఎస్ఐపాస్ చట్టం దేశానికే మార్గదర్శకంగా నిలిచిందని ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. 24 గంటల నిరంతర విద్యుత్ పారిశ్రామిక రంగంలో నూతనోత్తేజాన్ని తీసుకొచ్చిందని చెప్పారు. జాతీయ, అంతర్జాతీయ పెట్టుబడులకు గమ్యస్థానంగా, పరిశ్రమలకు తెలంగాణ స్వర్గధామంగా మారిందన్నారు. 2.51 లక్షల కోట్ల పెట్టుబడులతో రాష్ట్రానికి కొత్త పరిశ్రమలు వచ్చాయని, పారిశ్రామిక రంగంలో గత తొమ్మిదిన్నరేండ్లలో 17.21 లక్షల మందికి ఉపాధి లభించిందన్నారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా గోల్కొండ కోటపై ముఖ్యమంత్రి కేసీఆర్ జాతీయ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఐటీ రంగంలోనూ తెలంగాణ మేటిగా నిలుస్తుందన్నారు. తెలంగాణ ఏర్పడేనాటికి రాష్ట్రంలో 3 లక్షల 23 వేల 39 మంది ఐటీ ఉద్యోగులు ఉండగా, రాష్ట్ర ఆవిర్భావం అనంతరం 6 లక్షలకుపైగా ఉద్యోగాలు సృష్టించబడ్డాయని చెప్పారు. 2014 నాటికి ఐటీ ఎగుమతులు రూ.57 వేల 258 కోట్లు కాగా, 2014 నుంచి 2023 నాటికి 2 లక్షల 41 వేల 275 కోట్లకు పెరిగాయి. ఐటీ రంగాన్ని ఖమ్మం, వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, మహబూబ్‌నగర్, సిద్దిపేట వంటి ద్వితీయశ్రేణి నగరాలకు కూడా విస్తరింపజేస్తూ, ప్రభుత్వం ఐటీ టవర్స్‌ను నిర్మించిందని తెలిపారు. తద్వారా గతానికి భిన్నంగా అభివృద్ధిని సైతం వికేంద్రీకరిస్తున్నదని చెప్పారు.

**సంపద పెంచు.. ప్రజలకు పంచు..** 'సంపద పెంచు-ప్రజలకు పంచు' అనే సదాశయంతో తెలంగాణ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల ఫలితంగా తెలంగాణలో పేదరికం తగ్గుతున్నదని, తలసరి ఆదాయం పెరుగుతున్నదని నీతి ఆయోగ్ తాజాగా విడుదల చేసిన బహుముఖీయ పేదరిక సూచీ స్పష్టం చేసిందన్నారు. జాతీయ స్థాయిలో నమోదైన సగటు పేదరికంతో పోల్చిచూస్తే తెలంగాణలో పేదరికం అందులో మూడోవంతుగా నమోదైందని చెప్పారు. ఈ నివేదిక ప్రకారం 2015-



16 నాటికి తెలంగాణలో 13.18 శాతంగా ఉన్న పేదరికం, 2019-21 నాటికి 5.88 శాతానికి దిగివచ్చిందని తెలిపారు. అంటే, ఏకంగా 7.3 శాతం పేదరికం కనుమరుగైందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం సమగ్ర, సమ్మిళిత, సమీకృత అభివృద్ధిని సాధిస్తూ పురోగమిస్తున్నదని సీఎం కేసీఆర్ అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోనూ, నగర ప్రాంతాల్లోనూ ఏకకాలంలో మౌలిక వసతుల కల్పన చేస్తూ సమగ్ర దృక్పథాన్ని అవలంభిస్తున్నదని వెల్లడించారు. దళిత బడుగు, బలహీన వర్గాలు, రైతాంగం మొదలుకొని అగ్రవర్ణ పేదల వరకూ అందరికీ సంక్షేమ ఫలాలను అందజేస్తూ, సమ్మిళిత అభివృద్ధిని సాధిస్తున్నదని చెప్పారు. వికేంద్రీకరణను ఒక విలువగా పాటిస్తూ పరిపాలనలో సంస్కరణలు చేసిందన్నారు. అదే విధంగా పరిశ్రమలను గ్రామీణ ప్రాంతాలకు విస్తరింపజేస్తూ అభివృద్ధిని వికేంద్రీకరిస్తున్నదని వెల్లడించారు. అభివృద్ధికి, సంక్షేమానికి సమాన ప్రాధాన్యతనిస్తూ పేదవర్గాలను ఆదుకుంటున్నదని తెలిపారు. అందుకే నేడు దేశంలోని ఇతర రాష్ట్రాల ప్రజలు సైతం తెలంగాణ అభివృద్ధి నమూనాకు జై కొడుతున్నారని చెప్పారు. అతి పిన్న రాష్ట్రం తెలంగాణ అభివృద్ధి మోడల్ గురించి ఇప్పుడు దేశమంతటా విస్తృతంగా చర్చ జరుగుతూ ఉండటం మనందరికీ గర్వకారణం. ఇది తెలంగాణ ప్రభుత్వ ప్రతిభకు, పటిమకు తిరుగులేని నిదర్శనమని వెల్లడించారు.

# స్వాతంత్ర్య పోరాటంలో ఖమ్మంకు విశిష్ట స్థానం

ఖమ్మం: స్వాతంత్ర్య పోరాటంలో మన జిల్లాకు విశిష్ట స్థానం ఉందని మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు. జిల్లాలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో మంత్రి పాల్గొని ప్రసంగించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలలో ఖమ్మం జిల్లా అగ్రగామిగా నిలుస్తుందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో వ్యాధి నిర్ధారణకు గాను రెండు కోట్ల 15 లక్షల రూపాయిలతో సి.టి స్కాన్‌ను అందుబాటులోకి తెచ్చామన్నారు. జిల్లాలో 161 పల్లె దవాఖానాలు, 09 బస్తీ దవాఖానాలు ప్రారంభించామని తెలిపారు. బనిగండ్లపాడు ఆరోగ్య కేంద్రానికి రూ.కోటి 56 లక్షలు మంజూరు చేశామన్నారు. జిల్లాలో 115 పాఠశాలలకు ప్రతి పాఠశాలకు రూ.9 లక్షల ఖర్చుతో 8, 9, 10 తరగతులకు డిజిటల్ తరగతి గదులు ఏర్పాటు చేశామని మంత్రి అన్నారు. అర్హులైన వారందరికీ ప్రతినెలా 15 వందల మందికి బీసీబంధు అందజేస్తున్నమన్నారు. రాష్ట్రంలో మొట్టమొదటి సోలార్ కలెక్టరేట్ భవనం ప్రారంభించామని.. ఖమ్మం - సూర్యాపేట రహదారి 15 వందల 66 కోట్లతో 58.62 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణం పూర్తి చేశామన్నారు. చింతకాని మండలంలో 3462 మంది లబ్దిదారులకు



దళిత బంధు మంజూరు చేశామని.. 2015 నుంచి ఇప్పటి వరకు 8956 డబుల్ బెడ్ రూం ఇళ్లు మంజూరు చేశామని తెలిపారు. వంద కోట్లతో గోళ్ళపాడు ఛానల్‌ను ఆధునీకరిస్తున్నామని తెలిపారు. రూ.4 కోట్ల 50 లక్షలతో ఇల్లందు క్రాస్ రోడ్డులో ఆధునిక మార్కెట్‌ను అందుబాటులోకి తెచ్చామన్నారు. జీవో 58,59 ప్రకారం ప్రభుత్వ స్థలాల్లో ఉన్న ఇండ్లను క్రమబద్ధీకరుస్తున్నామని మంత్రి పువ్వాడ అజయ్ వెల్లడించారు.






# ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో షర్మిల పాదయాత్ర

హైదరాబాద్: వైఎస్సార్టీపీ అధినేత్రి, దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్సార్ కుమార్తె వైఎస్ షర్మిల పేరు ఇండియన్ బుక్ రికార్డ్స్‌లో చేరింది. షర్మిల చేసిన ప్రజా ప్రస్థానం పాదయాత్రకు ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కింది. తెలంగాణలో 3800 కిలో మీటర్లు పాదయాత్ర చేసినందుకు గాను వైఎస్సార్టీపీ చీఫ్ ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించుకున్నారు. 3800 కిలో మీటర్లు పాదయాత్ర చేసిన మొదటి మహిళగా షర్మిల రికార్డు సృష్టించారు. ఈ సందర్భంగా ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రతినిధులు షర్మిలను కలిసి అభినందించి అవార్డును ప్రదానం చేశారు. 2021 అక్టోబర్ 20న తన తండ్రి వైఎస్సార్ పాదయాత్ర మొదలుపెట్టిన ప్రాంతం చేవెళ్ల నుంచే షర్మిల పాదయాత్ర ప్రారంభించారు. దాదాపు ఏడాదిన్నర పాటు పాదయాత్ర సాగింది. పాదయాత్రలో అనేక అడ్డంకులు వచ్చినప్పటికీ వాటిని లెక్కచేయకుండా షర్మిల పాదయాత్రలో ముందుకు సాగారు. పాదయాత్రలో భాగంగా తెలంగాణ ప్రభుత్వంపై షర్మిల తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఈ క్రమంలో షర్మిల వ్యాఖ్యలపై నర్సంపేటలో ఉద్రిక్తతలు తలెత్తడంతో పోలీసులు ఆమెను అరెస్ట్ చేశారు. ఆ తరువాత కొన్ని రోజులు పాదయాత్ర ఆగిపోగా.. తరువాత కోర్టుకు వెళ్లి పాదయాత్రకు అనుమతి తెచ్చుకున్నారు. అటు ఏపీలో కూడా షర్మిల పాదయాత్ర చేశారు. అయితే తెలంగాణలో మాత్రం సుదీర్ఘంగా 3800 కిలోమీటర్ల మేర పాదయాత్ర చేసి షర్మిల ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చేరారు.

# ఈరోజు ప్రధానంగా ఆ ముగ్గురిని స్మరించుకోవాలి

హైదరాబాద్: 140 కోట్ల భారతీయులందరికీ టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. గాంధీభవన్‌లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్వాతంత్ర్య సమరయోధుల చిత్రపటాలకు టీపీసీసీ చీఫ్ నివాళులు అర్పించారు. ఆపై గాంధీభవన్‌లో జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ... దేశ ప్రజలకు స్వాతంత్ర్య ఫలాలు అందించాలని లక్షలాది కాంగ్రెస్ శ్రేణులు ప్రాణత్యాగాలు చేశారని గుర్తుచేశారు. ఈరోజు ప్రధానంగా ముగ్గురిని మనం స్మరించుకోవాలన్నారు. "అహింస మార్గంతో పోరాటం చేయవచ్చని నిరూపించిన మహనీయుడు మహాత్మా గాంధీ.. దేశంలో ఓటును ఆయుధంగా మార్చి అందరికీ సమాన హక్కులు కల్పించారు అంబేద్కర్.. కరువు కాటకాలతో తల్లడిల్లుతున్న దేశాన్ని సంక్షేమ ఫలాలు అందించిన మహా నేత నెహ్రూ. ఈ ముగ్గురిని మనం స్మరించుకుని నివాళులు అర్పించాల్సిన బాధ్యత మనపై ఉంది" అని చెప్పుకొచ్చారు. దేశం కోసం ప్రాణాలు అర్పించిన వీర వనిత ఇందిరా గాంధీ అని కొనియాడారు. దేశంలో ఐటీ రంగంలో గొప్ప స్ఫూర్తినిచ్చిన గొప్ప ప్రధాని రాజీవ్ గాంధీ అని తెలిపారు. అలాగే దేశాన్ని ఆర్థికంగా పురోగతివైపు నడిపించింది పీవీ, మన్మోహన్ అని పేర్కొన్నారు. దేశంలో విభజించు పాలించు విధానాన్ని ఈరోజు బ్రిటిష్ జనతా పార్టీ అవలంబిస్తోందని విమర్శించారు. విద్వేషాన్ని వీడాలని భారత్ జోడోతో



రాహుల్ గాంధీ స్ఫూర్తి నింపారన్నారు. నెహ్రూ నుంచి మన్మోహన్ వరకు చేసిన 60 ఏళ్లలో చేసిన అప్పుకంటే ఎనిమిదేళ్లలో మోదీ రెండింతలు ఎక్కువ అప్పు చేశారని దుయ్యబట్టారు. దేశంలో నిరుద్యోగం తాండవిస్తోందన్నారు.

బీజేపీ వస్తే జీడీపీ పెరుగుతుందన్నారు.. కానీ పెరిగింది గ్యాస్, డీజిల్, పెట్రోల్ ధరలు అని వ్యాఖ్యలు చేశారు. దేశ ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమైందన్నారు. మణిపూర్ మండుతుంటే మోదీ, అమిత్ షా కర్ణాటకలో ఓట్ల వేటకు వెళ్లారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మణిపూర్‌లో సైన్యాన్ని పంపి నిలువరించాల్సింది పోయి, కాంగ్రెస్ ఓడించేందుకు ఈడీ, సీబీఐని పంపించారన్నారు. నియంతలకంటే నికృష్టాంగా మోదీ వ్యవహరిస్తున్నారని విమర్శించారు.

# తెలంగాణ భవన్‌లో ఘనంగా 77వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

న్యూఢిల్లీ: న్యూఢిల్లీ: మంగళవారం నాడు న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో 77వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు న్యూఢిల్లీలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధులు డా. మంద జగన్నాదం, కె. ఎం సాహ్నిలు ముఖ్య అతిధులుగా హాజరయ్యారు. ముందుగా ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధులు భవన్ ప్రాంగణంలోని గోదావరి బ్లాకులో గల అమరవీరుల స్థూపానికి, తెలంగాణ తల్లి విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం భవన్ ప్రాంగణంలోని శబరి బ్లాక్ కు చేరుకుని పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన తర్వాత ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి డా. మందా జగన్నాదం జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఈ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా అమర వీరుల త్యాగాలను ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధులు స్మరించుకున్నారు. ఈ సందర్భంగా తేజస్వినీ ఆర్ట్స్ అకాడమీ ఆద్వర్యంలో చిన్నారులచే దేశభక్తి గీతంతో కూడిన నృత్త రూపకాన్ని ప్రదర్శింప చేశారు. అంతే కాకుండా తెలంగాణ రాష్ట్ర ప్రగతికి సంబంధించిన షార్ట్ ఫిల్మ్స్ ప్రదర్శించారు. అదే విధంగా కార్యక్రమానికి హాజరైనవారందరికి మిఠాయిలు పంచారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి డా. మంద జగన్నాధం ప్రసంగిస్తూ "భారత 77వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా విచ్చేసిన తెలంగాణ ఉద్యమకారులకు, ప్రజా ప్రతినిధులకు, అధికారులకు, మేధావులకు, ఢిల్లీలో నివసిస్తున్న తెలంగాణ ప్రజలకు, విద్యార్థినీ, విద్యార్థులకు మరియు పాత్రికేయులకు గణతంత్ర దినోత్సవ హార్థిక శుభాకాంక్షలు తెలిపారు. స్వాతంత్ర్య సమరంలో అమరులైన సమరయోధులకు, త్యాగ ధనులకు జోహార్లు అర్పించారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at Ratan Graphics D.No. 2-3-703/7, Ameerpet, Hyderabad - 500013 Telangana State and Published from D.No. 5-87,
Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State. Editor : V. VISHWANATH, M.A. Journalism
Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : garudavartha@gmail.com